ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM ఖమ్మం : fb.com/vaartha Digital
Published from Khammam, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Nalgonda, Nellore, Tadepalligudem, Srikakulam
30-7-2026 గురువారం సంపుటి: 32 సంచిక: 180 పేజీలు: 8+16 వెల: 6.50

ఏడేళ్లు నివసిస్తే చాలు.. అమెరికాలో గ్రీన్‌కార్డు!
భర్తను నెలవారీ లీజుకు ఇచ్చిన భార్య 5లో

# 'పరీక్షల' బిల్లు పాస్

- విపక్షాల నిరసనల మధ్య మూజువాణి ఓటుతో ఆమోదించిన లోక్‌సభ
- చట్టం మరింత కఠినంగా అమలుకే ఈ సవరణలు: మంత్రి జితేంద్ర సింగ్
- విపక్ష నేత రాహుల్ గాంధీ విమర్శలపై రగడ
- కొన్ని వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగించిన స్పీకర్ ఓం బిర్లా


లోక్‌సభలో మంత్రి జితేంద్ర సింగ్


విపక్ష నేత రాహుల్ గాంధీ

**న్యూఢిల్లీ,జులై 29:** ప్రభుత్వపరీక్షల్లో ప్రశ్నాపత్రాల లీకేజీలను అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ప్రభుత్వ పరీక్షలు (అక్రమ మార్గాలనిరోధం) సవరణ బిల్లు-2026కు లోక్‌సభ బుధవారం ఆమోదం తెలిపింది. ప్రతిపక్ష సభ్యుల నిరసన నినాదాల మధ్య బిల్లును సభ ఆమోదించింది. సవరణ బిల్లుకు లోక్‌సభ మూజువాణి ఓటుతో ఆమోదం తెలిపింది. ఈ సవరణల ప్రకారం నేరస్తులకు గరిష్ఠంగా 10 సంవత్సరాల జైలు శిక్షతో పాటు రూ.50 లక్షల వరకు జరిమానా విధించే అవకాశం కల్పించారు. ఈ సవరణ బిల్లును కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ ముందురోజులోక్‌సభలో ప్రవేశపెట్టారు. ఇటీవల నీట్ ప్రశ్నాపత్రం లీకేజీ ఘటనల నేపథ్యంలో విద్యార్థులు పెద్దఎత్తున చేపట్టిన ఆందోళనల అనంతరం విద్యాశాఖ మంత్రి పదవికి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసిన కొద్ది రోజులకే ప్రభుత్వం ఈ సవరణ బిల్లును తీసుకొచ్చింది. బిల్లుపై జరిగిన చర్చకు సమాధానమిచ్చిన జితేంద్ర సింగ్ మాట్లాడుతూ, నీట్ ప్రశ్నాపత్రం లీక్‌ఘటనలో ప్రభుత్వం అత్యంతవేగంగాస్పందించిందన్నారు. 2024లో పేపర్ లీక్ నిరోధక చట్టం అమల్లోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకు 52 ఎఫ్‌ఐఆర్‌లు నమోదు చేసినట్లు తెలిపారు. అనుభవాల ఆధారంగా చట్టాన్ని మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని ప్రభుత్వం >>2

## లాఠీ-ఛార్జి, పెల్లెట్ గన్స్ ప్రయోగం అమిత్‌షాకు తెలియదా?
### ఆయన రాజీనామా చేయాల్సిందే: రాహుల్

**న్యూఢిల్లీ,జులై 29:** కేంద్ర హోం మంత్రి అమిత్ షాపై కాంగ్రెస్ ఎంపీ, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ మండిపడ్డారు. విద్యార్థులపై లాఠీఛార్జికి, హింసకు కారకుడు అమిత్ షా అని, ఆయనను మంత్రి పదవి నుంచి తొలగించాలని రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు. ఈ మేరకు ప్రధాని మోడీ చర్య తీసుకోవాలని కోరారు. ఢిల్లీలో బుధవారం జరిగిన ఒక మీడియా సమావేశంలో రాహుల్ మాట్లాడారు. నీట్ పేపర్ లీకేజీ, సిజెపి ర్యాలీ సందర్భంగా విద్యార్థులపై జరిగిన దాడి గురించి స్పందించారు. ఢిల్లీ పోలీసు వ్యవస్థ కేంద్ర హోం మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో పని చేస్తుంది. కేంద్ర బలగాలు కూడా హోం మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోనే >>2



పాలమూరు, సీతమ్మసాగర్, గౌరవెల్లికి
# పర్యావరణ అనుమతి

### తెలంగాణ ప్రాజెక్టులకు చట్టబద్ధ రక్షణ: సుప్రీం సిజె సూర్యకాంత్
### పనులు జరుగుతున్న ప్రాజెక్టులకు అడ్డంకులు వద్దని సూచన
### సీతమ్మ ప్రాజెక్టుద్వారా 6.74 లక్షల ఎకరాలకు సాగునీరు: మంత్రి తుమ్మల

**హైదరాబాద్,జులై 29,ప్రభాతవార్త:** తెలంగాణ ప్రాజెక్టుల నిర్మాణంకు పూర్తి చట్టబద్ధమైన రక్షణ ఉంటుందని సర్వోన్నత న్యాయస్థానం జస్టిస్ సూర్యకాంత్ ధర్మాసనం తెలిపింది. తెలంగాణలో నిర్మిస్తున్న పాలమూరు- రంగారెడ్డి, సీతమ్మసాగర్, గౌరవెల్లి ప్రాజెక్టులకు పర్యావరణ అనుమతులు లేవని ఇన్నాళ్లు ఉన్న అడ్డంకులను సుప్రీంకోర్టు తొలగించింది. 2021నాటి కేంద్ర పర్యావరణ శాఖ ఆఫీస్ మెమోరాండంను సుప్రీం కోర్టు రద్దుచేసింది. ఇప్పటికే ఆఫీస్ మెమోరాండం ద్వారా మంజూరైన పర్యావరణ అనుమతులన్నీ చెల్లుబాటులో ఉంటాయని స్పష్టంచేసింది. ఈ తీర్పు భవిష్యత్‌కు మాత్రమే వర్తిస్తుందని సిజెఐ సూర్యకాంత్ ధర్మాసనం విస్పష్టంగా చెప్పింది.ఇకపై మాత్రం ముందస్తు పర్యావరణ అనుమతులు లేకుండా కొత్త ప్రాజెక్టులకు అనుమతి ఇవ్వబడదని తీర్పు చెప్పారు.అత్యవసర మినహాయింపులకు చట్టబద్ధ నోటిఫికేషన్ తప్పనిసరిగా చేయాలని ధర్మాసనం ఆదేశించింది. ఇప్పటికే జరుగుతున్న కీలక ప్రాజెక్టుల పనులకు పర్యావరణ అడ్డంకులు కల్పించకూడదని ధర్మాసనం స్పష్టీకరణ చేసింది. కార్య నిర్వాహక ఉత్తర్వులతో చట్టాలను భర్తీ చేయడం కుదరదనీసుప్రీంకోర్టు తీర్పులో వెల్లడించింది. ఎస్సారెస్పీ వరదకాలువ ద్వారా నీటిని తీసుకొచ్చి సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలంలోని గౌరవెల్లి ప్రాజెక్టులో నిల్వచేసి ఒకలక్షా అరువై వేల ఎకరాలకు సాగు నీరు ఇవ్వడానికి ప్రతిపాదించారు. 2007లో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 1.43 టిఎంసిల నీటి నిల్వ సామర్థ్యం కలిగిన రిజర్వాయర్ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారు. అయితే 2015లో తెలంగాణ ఏర్పాటుకావడంతో మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్, హరీష్‌రావులు ఈ ప్రాజెక్టు నీటినిల్వ సామర్థ్యంను 8.23 టిఎంసిలకు పెంచారు. 2022లో >>2


పనులు ఆగిపోయిన సీతమ్మసాగర్ ప్రాజెక్టు




# బిల్లుకు రాజ్యసభ ఆమోదం

**న్యూఢిల్లీ,జులై 29:** జాతీయ గేయం వందేమాతరంను ఉద్దేశపూర్వకంగా అవమానించడాన్ని శిక్షార్హ నేరంగా ప్రకటించే జాతీయ గౌరవానికి అవమాన నిరోధక (సవరణ) బిల్లు2026కు రాజ్యసభ బుధవారం ఆమోదం తెలిపింది. ప్రస్తుతం జాతీయ జెండా, జాతీయ గీతానికి ఉన్న చట్టపరమైన రక్షణను ఇకపై వందేమాతరానికీ వర్తింపజేయనున్నారు. బిల్లుపై సుదీర్ఘ చర్చ అనంతరం ఎగువ సభ దీన్ని ఆమోదించింది. బిల్లుపై చర్చ సందర్భంగా సభలో తీవ్ర గందరగోళం నెలకొంది. కేంద్ర హోంమంత్రి అమిత్ షా సభకురావాలని ప్రతిపక్షసభ్యులు నినాదాలు చేశారు. ఆప్, కాంగ్రెస్, >>2



## మావోయిస్టు అగ్రనేత మిస్రి బిస్రా అరెస్టు
మరికొందరు అనుచరులను కూడా నిర్బంధించిన జార్ఖండ్ పోలీసులు 3లో

## ట్రైనీ ఐపిఎస్ కృష్ణారెడ్డికి రిమాండ్
చంచల్‌గూడ జైలుకు తరలింపు 3లో

### ఐఐటి బాంబే అఫ్రి కంపెనీతో టెస్ట్ చేయించాం
### కాంట్రాక్టర్లు బిఆర్‌ఎస్‌కు రూ. 1400 కోట్లు ఇచ్చారన్న కవిత
### కర్ణాటక సిఎం డికె శివకుమార్‌తో మంత్రి ఉత్తమ్, పిసిసి చీఫ్ మహేష్ గౌడ్ భేటీ


బుధవారం ఢిల్లీలో కర్ణాటక సిఎం డికె శివకుమార్‌తో భేటీ అయిన మంత్రి ఉత్తమ్, పిసిసి చీఫ్ మహేష్ గౌడ్

# ఇసుకలో కాళేశ్వరం ఫౌండేషన్!

**హైదరాబాద్,జులై 29,ప్రభాతవార్త:** ఢిల్లీలోని కర్ణాటక భవన్‌లో కర్ణాటక ముఖ్యమంత్రి డికె శివ కుమార్‌తో తెలంగాణ రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి బుధవారం సమావేశమైనారు. టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, ఎఐసిసి కార్యదర్శి సంపత్ కుమార్‌లు హాజరై కృష్ణా జలాలు పంపకంపై సమావేశంలో చర్చించారు. కర్నాటక ముఖ్యమంత్రి డికె శివ కుమార్ కర్ణాటక, తెలంగాణ అంతరాష్ట్ర నదీ జలాల అంశాలపై చర్చించిన సామరస్యంగా వాడుకోవాలని నీటి పారుదలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి హామి ఇచ్చారు. తుంగభద్ర, కృష్ణ నదీ జలాలు ప్రకృతివైపరిత్యం వేళ పొదుపుగా అందరికి లాభం జరిగేలా వాడుకొందామనీ హామీ శివకుమార్ ఇచ్చారు. ఇదిఇలా ఉంటే ఢిల్లీలో విలేకరులతో ఉత్తమ్‌కుమార్ మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్టుపై కెటిఆర్ మాట్లాడటం సిగ్గుచేటని విమర్శించారు. నాణ్యత లోపాలతోనే కాళేశ్వరం కట్టారు.. వారు సరిగా కట్టి ఉంటే ఈ సమస్య వచ్చేది కాదని మండిపడ్డారు. బ్యారేజీలో 2..3 టిఎంసిలు నిల్వ చేయమంటే 10 టిఎంసిలు ఎందుకు స్టోర్ చేశారని ప్రశ్నించారు...రైతులకు నీళ్లుఇచ్చేందుకు ఉన్న అన్ని అవకాశాలను ఉపయోగించుకుంటామని స్పష్టం చేశారు. ఎన్డీఎస్ఎ నివేదిక మేరకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. నిపుణుల సాయంతో వీలైనంత త్వరగా బ్యారేజీ మరమ్మతు పనులు పూర్తి చేస్తామన్నారు .
బిఆర్‌ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కెటిఆర్ బాధ్యత లేకుండా మాట్లాడడం దురదృష్టకరమని అన్నారు. ఇసుకలో కాళేశ్వరం ఫౌండేషన్ వేశారని గుర్తు చేశారు. ఐఐటి బాంబే ఆఫ్రి కంపెనీతో సాయిల్ టెస్ట్ చేయించామని పేర్కొన్నారు. బ్యారేజీలు ప్రమాదకర పరిస్థితుల్లో ఉన్నాయని.. అంటే అది ఓపెన్ చేస్తే ప్రజలకు ఏమైనా అయితే ప్రభుత్వం బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. బిఆర్‌ఎస్ పార్టీ కక్కుర్తి, అసమర్థత వలన కాళేశ్వరం కూలిపోయిందని విమర్శించారు. అయితే కాళేశ్వరం విషయంలో తమకు రాజకీయ దురుద్దేశం లేదని స్పష్టంచేశారు. కాళేశ్వరంవిషయంలో బిఆర్‌ఎస్ పార్టీ బూటకపు >>2

# భారీగా పోలీసు ఉద్యోగాల భర్తీ
### 7437 పోస్టులకు నోటిఫికేషన్లు జారీ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జులై29:** తెలంగాణలో పోలీసు ఉద్యోగాల కోసం ఎదురు చూస్తున్న అభ్యర్థులకు రేవంత్ సర్కార్ గుడ్‌న్యూస్ చెప్పింది.
తెలంగాణ రాష్ట్ర పోలీసు నియామక మండలి భారీ స్థాయిలో ఉద్యోగాల భర్తీకి బుధవారం సాయంత్రం నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నియామక ప్రక్రియలో భాగంగా మొత్తం నాలుగు వేర్వేరు నోటిఫికేషన్లను పోలీస్ నియామక మండలి చైర్మన్ వివి శ్రీనివాసరావు జారీ చేశారు. వీటి ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా 7,437 పోస్టులను భర్తీ చేయనున్నారు. ఇందులో సివిల్ పోలీసు, ఆర్మ్‌డ్ రిజర్వ్, స్పెషల్ పోలీసు, ఫైర్ సర్వీసెస్, జైళ్ల శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులను ఈ నియామకాల ద్వారా భర్తీ చేయనున్నారు. కానిస్టేబుల్ (సివిల్) 3,697,కానిస్టేబుల్(ఏఆర్) 1052 పోస్టులు భర్తీ చేయనున్నారు. స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్‌లో ఎస్ఐ 44, కానిస్టేబుల్ 1380 పోస్టులు ఉన్నాయి. ఫైర్ విభాగంలో స్టేషన్ ఫైర్ ఆఫీసర్ 39,ఫైర్ ఫైటర్ 751 పోస్టులు భర్తీ చేయనున్నారు. జైళ్ల శాఖలో 223 పోస్టులు భర్తీ చేయనున్నట్లు పోలీస్ నియామక మండలి తెలిపింది. >>2

# 3 నెలల బియ్యం ఒకేసారి పంపిణీ
### ఆగస్టు 1 నుంచి అమలు
### ఇ-కెవైసి లేకుంటే రేషన్‌కార్డు నిలిపివేత

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,జులై29:** ఎల్‌నినో ప్రభావంతో తీవ్ర వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో దేశవ్యాప్తంగా ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబర్ నెలల రేషన్ బియ్యం ఒకేసారి పంపిణీ చేయాలని కేంద్రం ప్రభుత్వం నిర్ణయించింది. పశ్చిమాసియా యుద్ధం నేపథ్యంలో ఏప్రిల్, మే, జూన్ మాసాలకు సంబంధించిన రేషన్ బియ్యం లబ్ధిదారులకు ఒకేసారి కేంద్రం పంపిణీ చేసిన విషయం తెలిసిందే. తాజాగా సూపర్ ఎల్‌నినో ద్వారా ఉత్పన్నమైన తీవ్ర వర్షాభావం, ప్రతికూల వాతావరణ పరిస్థితులు, గోదాముల్లో పేరుకుపోయిన నిల్వలు వంటి సవాళ్ల నేపథ్యంలో ఒకేసారి మూడు నెలల కోటా ఇవ్వాలని కేంద్ర సర్కార్ నిర్ణయించింది. తెలంగాణ రాష్ట్రంలో ఉన్న 1.06 కోట్ల రేషన్ కార్డుల ద్వారా 3.42 కోట్ల మంది లబ్ధిదారులకు 2.15 లక్షల మెట్రిక్ టన్నులు పైగా బియ్యం పంపిణీ చేయనున్నారు. మండల స్థాయి స్టాక్ పాయింట్లు నుంచి షాపులకు ఎలాంటి రవాణా ఇబ్బందులు లేకుండా చిన్న దుకాణాలకు ఒకేసారి పెద్ద షాప్‌లకు రెండు లేదా మూడు విడతల్లో >>2

## జూబ్లీహిల్స్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు రెడ్డి సస్పెన్షన్ 3లో

# దూసుకొస్తున్న తీవ్ర వాయుగుండం
### అతి భారీ వర్షాలు కురిసే అవకాశం
### పలు జిల్లాలకు రెడ్ అలర్ట్, కలెక్టర్లను అప్రమత్తం చేసిన ప్రభుత్వం

**హైదరాబాద్, జులై 29, ప్రభాతవార్త:** వాయవ్య బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం కారణంగా ఉత్తర తెలంగాణ జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. ప్రస్తుతం ఈ తీవ్ర వాయుగుండం తెలంగాణ వైపు దూసుకొస్తుంది. ఈ ప్రభావంతో రాష్ట్రంలో రాగల 36 గంటల్లో అత్యంత భారీ నుంచి తీవ్ర వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలంగాణ వెదర్ మ్యాన్ హెచ్చరించారు. ఉత్తర తెలంగాణ జిల్లాల్లో పరిస్థితులు అత్యంత తీవ్రంగా మారనున్నాయని అప్రమత్తం చేశారు. కొన్ని ప్రాంతాల్లో గరిష్ఠంగా 300 మిల్లీమీటర్ల నుంచి 450 మిల్లీమీటర్ల వరకు వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని, దీనివల్ల భారీగా వరదలు ముంచెత్తుతాయని వెదర్ మ్యాన్ వెల్లడించారు. ఈ నేపథ్యంలో అత్యంత ప్రమాదకర వర్షపాతం నమోదయ్యే జిల్లాల ప్రజలను తక్షణమే అప్రమత్తం చేయాలని, ముందస్తు రక్షణ చర్యలు చేపట్టాలని స్థానిక జిల్లాల పరిపాలన యంత్రాంగానికి విజ్ఞప్తి చేశారు. మరోవైపు మధ్య, పశ్చిమ, తూర్పు తెలంగాణ పరిధిలో రెడ్ అలర్ట్ జారీ అయింది. దీంతో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. హైదరాబాద్ నగరంలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలతో పాటు రోజు మొత్తం ముసురు వాతావరణం నెలకొంటుందని వెదర్ మ్యాన్ తెలిపారు. అలాగే నాగర్కర్నూల్, వనపర్తి, నల్గొండవంటి దక్షిణ తెలంగాణ జిల్లాల్లో మాత్రం స్వల్ప వర్షపాతం మాత్రమే నమోదు కానుందని వెదర్ మ్యాన్ తన నివేదికలో స్పష్టం చేశారు. ప్రమాదకర పరిస్థితులు ఉన్న ఉత్తర తెలంగాణ జిల్లాల ప్రజలు అత్యవసరమైతే తప్ప ఇళ్ల నుంచి బయటకు రాకూడదని, లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని >>2



బుధవారం తాలిపేరు ప్రాజుక్టు 24 గేట్లు ఎత్తివేసి దిగువకు నీరు వదులుతున్న దృశ్యం

### ఎల్లంపల్లిలో జలసవ్వడి
మధ్య మానేరుకు గోదావరి పరుగులు
తాలిపేరు 24 గేట్లు ఎత్తి దిగువకు నీరు విడుదల

**హైదరాబాద్,జులై 29,ప్రభాతవార్త :** బంగాళాఖాతం వాయువ్య దిశలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం తెలంగాణవైపు దూసుకొని రావడంతో మంగళవారం రాత్రి నుంచి భారీ వర్షాలు కురుస్తుండటంతో ఎల్లంపల్లి జలాశయంలోకి నీరు చేరుతోంది. బాహుబలి పంపులు ఆన్‌చేసి ఎల్లపల్లి నుంచి నీటిని ఎత్తిపోస్తున్నారు. నీరు ఎగిసిపడుతూ జలసవ్వడి చేస్తోన్నది. ఎల్లంపల్లి రిజర్వాయర్‌లో ప్రస్తుతం 11.50టిఎంసిల నీరు బుధవారం రాత్రి ఏడుగంటలకు వచ్చి చేరింది.కాళేశ్వరం ప్రాజెక్టు అనుబంధ లింక్ 2 పెద్దపల్లి జిల్లా ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి ధర్మారం మండలం నంది పంప్ హౌస్ ద్వారా గోదావరి జలాల ఎత్తిపోతలు ప్రారంభమైంది. రాష్ట్ర నీటిపారుదల శాఖ అధికారుల ఆదేశానుసారం తాగునీటి అవసరాల కోసం రాజన్న సిరిసిల్ల జిల్లాలోని శ్రీ రాజరాజేశ్వర మధ్యమానేరు జలాశయం నీటిని ఎత్తిపోయాలని నిర్ణయించడంతో నంది పంప్ హౌస్‌లోని 1,4,5,6 నెంబర్ల మోటార్లను బుధవారం మధ్యాహ్నం రెండు గంటలకు స్థానిక ఇంజనీరింగ్ అధికారులు ఆన్ చేశారు. గోదావరి జలాలు పంప్ హౌస్ నుంచి 4 డెలివరీ సిస్టర్న్‌ల ఎగిసిపడి నంది రిజర్వాయర్ లోకి వెళ్తున్నాయి. ఉత్తర తెలంగాణలో వర్షం దంచి కొట్టడంతో శ్రీపాద ఎల్లంపల్లి రిజర్వాయర్‌కు గోదావరి క్యాచ్‌మెంట్ ఏరియాలో వరద పెద్ద ఎత్తున వస్తోన్నది. ఉదయం తొమ్మిది గంటలకు 44వేల క్యూసెక్కుల నీటి ప్రవాహం గంట గంటకు పెరుగుతు పోతుండటంతో మధ్యాహ్నం 51వేల క్యూసెక్కులు సాయంత్రం నాలుగు గంటలకు 66వేల క్యూసెక్కులకు వరదచేసుకొంది. ప్రస్తుతం 82వేల >>2

# రిజర్వేషన్ హఠావో?
### ఆన్‌లైన్‌లో మరో ఉద్యమం

**న్యూఢిల్లీ,జులై 29:** కాక్రోచ్‌జనతాపార్టీ నిర్వహించిన ఉద్యమంతో నేరుగా కేంద్రమంత్రి రాజీనామాచేసే ఫలితాలు రావడంతో ఇపుడు అదే బాటలో ఇంటర్నెట్ వేదికగా అనేక అంశాల ఆధారిత డిజిటల్ ఉద్యమాలు పుట్టగొడుగుల్లా వెలుస్తుండటమే కాకుండా, నిమిషాల్లో వేలాదిమంది మద్దతును కూడగట్టుకుంటున్నాయి. వీటిలో కొన్ని సరదాగా ప్రారంభమైన దారు జనతా పార్టీ, కబూతర్ జనతా పార్టీ వంటివి ఉంటే, మరికొన్ని తీవ్రమైన ప్రజా సమస్యలపై పనిచేస్తున్నాయి. అందులో ఇథనాల్ కలిపిన ఇ20 పెట్రోల్ వినియోగంపై వ్యక్తమవుతున్న అసంతృప్తికి గళమెత్తుతున్న ఇ20 జనతా పార్టీ ఒకటైతే అందరి దృష్టినీ ఆకర్షిస్తూ సోషల్ మీడియాలో విపరీతంగా దూసుకుపోతున్నదిమాత్రం 'రిజర్వేషన్ హఠావో ఆందోళన్'. పేరుకు తగ్గట్టుగానే కులఆధారిత రిజర్వేషన్లను, కుల గణనను రద్దు చేయాలనేది ఈ డిజిటల్ ఉద్యమం ప్రధాన డిమాండ్. గడిచిన వారం రోజులుగా విద్యార్థుల నిరసనలతో దేశం అట్టుడికిపోతున్న వేళ, ఈ ఖాతా నెమ్మదిగా సైలెంట్‌గా విస్తరించింది. ప్రస్తుతం ఇన్‌స్టాగ్రామ్‌లో దీనికి ఏకంగా 58 లక్షలకు (5.8 మిలియన్లు) పైగా ఫాలోవర్లు ఉన్నారు. తృణమూల్ కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీ వంటి ప్రధాన రాజకీయ పార్టీల ఫాలోవర్ల కంటే ఇది చాలా ఎక్కువ.



గాజా నగరంపై ఇజ్రాయెల్ సైన్యం జరిపిన దాడులతో పొగ మేఘాలు ఆవరించిన దృశ్యం

## రాజ్యసభ ఆమోదం

>> సిపిఎం సభ్యులు అభ్యంతరాలు వ్యక్తం చేయగా, అనంతరం ప్రతిపక్ష సభ్యులు సభ నుంచి వాకౌట్ చేశారు. ఇరు పక్షాల సభ్యులు తమ అభిప్రాయాలు వెల్లడించిన తర్వాత కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి నిత్యానంద్ రాయ్ సమాధానం ఇచ్చారు. ఈ సందర్భంగా నిత్యానంద్ రాయ్ మాట్లాడుతూ, 1971లో జాతీయ చిహ్నాల పరిరక్షణ కోసం ఈ చట్టాన్ని తీసుకొచ్చారని గుర్తుచేశారు. ఇప్పుడు అదే రక్షణను వందేమాతరానికీ విస్తరిస్తున్నామని చెప్పారు. బంకించంద్ర చటర్జీ 1875లో ఈ గీతాన్ని రచించారని, 1896 కాంగ్రెస్ సమావేశంలో రవీంద్రనాథ్ ఠాగూర్ ఆలపించారని వివరించారు.

## అమిత్‌షాకు తెలియదా?

>> పని చేస్తాయి. దేశ రాజధాని ఢిల్లీలో వారంతా కేంద్ర హోం శాఖ ఆధ్వర్యంలోనే పని చేస్తారు. ఢిల్లీలో నిరసన చేసిన యువత, విద్యార్థులపై పెల్లెట్ గన్స్, ఎలక్ట్రిక్ బ్యాటన్స్, మేకులున్న లాఠీలు ప్రయోగించారు. పెల్లెట్ గాయాలు, లాఠీ గాయాలున్న విద్యార్థుల్ని చూశాను. విద్యార్థులపై పోలీసులు, భద్రతా బలగాల దాడికి ఆదేశాలిచ్చింది హోం మంత్రి అమిత్ షానే. ఒకవేళ ఈ విషయం అమిత్ షాకు తెలియకుంటే ఆయన ఈ పదవిలో కొనసాగడానికి అనర్హుడు. ఒకవేళ ఈ దాడికి అమిత్ షా ఆదేశించి ఉంటే ప్రధాన నిందితుడు కూడా ఆయనే. విద్యార్థులపై జరిగిన ఈ దారుణ ఘటనలకు బాధ్యుడైన అమిత్ షాను మంత్రివర్గం నుంచి తప్పించాలి. ఈ విషయంలో ప్రధాని మోడీకి కూడా నేను సలహా ఇస్తున్నా అంటూ రాహుల్ చెప్పుకొచ్చారు. ఇదే సమయంలో ఈ అంశంపై పార్లమెంట్‌లో ప్రభుత్వం తనను మాట్లాడనివ్వలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. నేను మాట్లాడేందుకు వీలుగా ఆర్డర్ ఇవ్వాలని లోక్‌సభ స్పీకర్‌ను కోరారు. కానీ, అనుమతి ఇవ్వలేదు. అమిత్ షాపై ఆరోపణలు చేసినందుకు నన్ను అనుమతించడం లేదని, క్షమాపణలు చెప్పాలి అంటున్నారు. క్షమాపణలు చెబితేనే అనుమతిస్తాం అంటున్నారు. నేను బిజెపికి కానీ, ఆర్ఎస్ఎస్‌కు కానీ, ఏ ఒక్క వ్యక్తికి కానీ క్షమాపణ చెప్పబోను అంటూ రాహుల్ వ్యాఖ్యానించారు. సిజెపి నిరసనల సందర్భంగా మైనర్లపై కూడా పోలీసులు దాడిచేశారని రాహుల్ ఆరోపించారు. విద్యార్థులపై అదనపు బలగాల్ని ఉపయోగించడం తీవ్రమైన చర్యగా అభివర్ణించారు.

## పోలీసు ఉద్యోగాల భర్తీ

>> **విభాగాల వారీగా భర్తీ చేసే పోస్టుల వివరాలు**

సబ్ ఇన్స్‌పెక్టర్ పోస్టులు (సివిల్)- 148
రిజర్వ్ ఎస్ఐ పోస్టులు -14
రిజర్వ్ ఎస్ఐ (టిజిఎస్‌పి) పోస్టులు- 12
రిజర్వ్ ఎస్ఐ (ఎస్ఎఆర్‌సిపిఎల్) పోస్టులు-3
అసిస్టెంట్ సబ్ ఇన్స్‌పెక్టర్ పోస్టులు (ఎఫ్‌పిబి)-23
పోలీస్ కానిస్టేబుల్ పోస్టులు(సివిల్)-3,697
పోలీస్ కానిస్టేబుల్ పోస్టులు (ఎఆర్)-1052
పోలీస్ కానిస్టేబుల్ పోస్టులు (ఎస్ఏఆర్‌సిపిఎల్)-24
పోలీస్ కానిస్టేబుల్ పోస్టులు (డ్రైవర్) పిటిఒ-24
పోలీస్ కానిస్టేబుల్ పోస్టులు (మెకానిక్)పిటిఒ-7

**స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్**

సబ్ ఇన్‌స్పెకర్ పోస్టులు-44
కానిస్టేబుల్ పోస్టులు-1380

**ఫైర్ డిపార్ట్‌మెంట్**

స్టేషన్ ఫైర్ ఆఫీసర్ పోస్టులు- 39
ఫైర్ ఫైటర్ పోస్టులు- 751

**జైళ్ల శాఖ**

డిప్యూటీ జైలర్ (పురుషులు) పోస్టులు-14
డిప్యూటీ జైలర్ (మహిళలు) పోస్టులు 1
వార్డెన్ (పురుషులు) పోస్టులు-196
వార్డెన్ (మహిళలు) పోస్టులు 12

ఈ నోటిఫికేషన్‌తో పోలీసుశాఖలో ఉద్యోగం సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్న వేలాది మంది అభ్యర్థులకు మంచి అవకాశం లభించింది. త్వరలో అర్హతలు, దరఖాస్తు విధానం, ఎంపిక ప్రక్రియ, పరీక్షల షెడ్యూల్ తదితర పూర్తి వివరాలను పోలీసు నియామక మండలి వెల్లడించనుంది. అభ్యర్థులు అధికారిక నోటిఫికేషన్‌ను పూర్తిగా పరిశీలించి, అర్హతలు నిర్ధారించుకుని గడువులోగా దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచించారు.

## కాళేశ్వరం ఫౌండేషన్!

>> ప్రచారం చేస్తుందని ఆరోపించారు. మేడిగడ్డ బ్యారేజ్ నుంచి కన్నెపల్లి పంపు హౌస్‌కు 18 కిలోమీటర్ల దూరం ఉందన్నారు. అన్నారం బ్యారేజ్‌కి రంధ్రాలు ఉన్నాయని కేంద్ర సంస్థ రిపోర్ట్ ఇచ్చిందని గుర్తు చేశారు. ఎన్‌డిఎస్ఎ మొదట ప్రిలిమినరీ రిపోర్ట్ నవంబర్ 23 ఇచ్చిందన్నారు. కమీషన్ల కోసం ఫౌండేషన్ చూసుకోకుండా కాళేశ్వరం ప్రాజెక్ట్ నిర్మించారని మండిపడ్డారు. బిఆర్ఎస్‌కు రూ. 1400 కోట్లు కాళేశ్వరం కాంట్రాక్టర్లు చెక్ రూపంలో ఇచ్చారని కల్వకుంట కవిత చెప్పారని..అది వాస్తవమని పేర్కొన్నారు.

## బియ్యం ఒకేసారి పంపిణి

>> బియ్యాన్ని చేరవేసేలా చూస్తున్నారు. ఆగస్టు 1 నుంచి మూడు నెలల రేషన్ బియ్యాన్ని ఒకేసారి విడుదల చేస్తుండటంతో తమకు శ్రమ, ఒత్తిడి, కూలీల కొరత అధికమవుతుందని డీలర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రేషన్ బియ్యం పొందడానికి ఇకెవైసి అప్‌డేట్ చేసుకోవడం తప్పనిసరిగా మారింది.

ఈ అంశం పూర్తయితేనే రేషన్ అందేలా జాతీయ సమాచార వ్యవస్థ తమ సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ చేసింది. కేంద్రం గత రెండేళ్లుగా ప్రచారం చేస్తున్నప్పటికీ ఇంకా 39 శాతం ఇకెవైసి చేయించుకోకపోవడంతో గ్రామీణ స్థాయిలో ప్రచారం కల్పించి 100 శాతం పూర్తి చేయాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. లబ్ధిదారులు మూడు నెలల కోటా కోసం ఎలక్ట్రానిక్ పాయింట్ యంత్రంలో నిబంధనల ప్రకారం వేలిముద్రలు వేయాల్సి ఉంటుంది. కానీ, ఎవరైనా ఇకెవైసి చేయించుకోని పక్షంలో ఆ రేషన్ కార్డు ఆగిపోవడం లేదా, తొలగించే అవకాశం ఉంటుందని అంటున్నారు.

# పర్యావరణ అనుమతి

>> భూసేకరణ పూర్తిచేశారు. ఒక టిఎంసి నీటిని కూడా నింపారు.దీనికి సంబంధించిన మూడు మోటార్ల ట్రయల్ రన్ చేశాక ఎన్‌జిటి ఈ ప్రాజెక్టును పనులు నిలిపివేయడమే కాకుండా అక్కడ సిసి కెమెరాలు పెట్టి నిత్యం పర్యవేక్షణ చేశారు.సీతమ్మ సాగర్ బహుళార్థ సాధక నీటిపారుదల ప్రాజెక్టు పనులు ఆపాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన తెల్లం నరేష్, ములుగు జిల్లాకు చెందిన బూర లక్ష్మీనారయణ ఫిర్యాదు చేయడంతో నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఎన్జీటీ ఆదేశాలు జారీ చేసింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపుర మండలం అమ్మగారిపల్లి గ్రామం వద్ద సీతమ్మ సాగర్ పనులను రాష్ట్ర ప్రభుత్వం మొదలు పెట్టింది. అయితే ఎలాంటి పర్యావరణ అనుమతులు లేకుండానే పనులు చేపడుతున్నారని ఇద్దరు వ్యక్తులు ఎన్జీటీ దక్షిణాది బెంచ్‌లో ఫిర్యాదు చేశారు. ఈ పిటిషన్ ఆధారంగా సీతమ్మ సాగర్ పనులు నిలిపి వేయాలని నేషనల్ గ్రీన్ ట్రైబ్యునల్ చెన్నై బెంచ్ ఆదేశాలు జారీ చేసింది. సీతమ్మ సాగర్ ప్రాజెక్టుకు ఎన్విరాన్మెంటల్ క్లియరెన్స్ లేదని ఎన్విరాన్మెంటల్ ఇంపాక్ట్ అసెస్‌మెంట్ ఇఐఎ 2006 నోటిఫికేషన్ ప్రకారం అక్కడ నిబంధనల ఉల్లంఘన జరుగుతోందని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై కూడా సూర్యకాంత్ ధర్మాసనం ఇప్పటికే జరుగుతున్న కీలక ప్రాజెక్టుల పనులకు పర్యావరణ అడ్డంకులు కల్పించకూడవద్దని ఈ ప్రాజెక్టు విషయంలో వ్యాఖ్యానించింది. సీతమ్మసాగర్ ప్రాజెక్టు ద్వారా 36.57 టిఎంసిల నీటిని నిల్వ చేసే సామర్థ్యం ఉంది. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుకు తగిన పర్యావరణ అనుమతులు తీసుకోకుండానే పనులు చేపట్టారంటూ ఆంధ్రా ప్రాంతపు రైతులు వివిధ సంఘాలు నేషనల్ గ్రీన్ ట్రైబ్యునల్ చెన్నై బెంచ్‌ను ఆశ్రయించాయి. రిజర్వాయర్లు, కాలువలు,పంప్‌హౌస్‌ల నిర్మాణాల వల్ల పెద్దఎత్తున అటవీ భూములు, వృక్ష సంపద మునిగిపోయే ప్రమాదం ఏర్పడుతోందని వారు ఆరోపించారు దీనికి సంబంధించిన వైల్డ్‌లైఫ్, ఫారెస్ట్ క్లియరెన్సెస్ సాధించడం పెద్ద సవాల్‌గా మారినా సుప్రీంకోర్టులో బుధవారం ఊరట పొందింది.

**తెలంగాణ ఇరిగేషన్ ప్రాజెక్ట్ లకు పర్యావరణ అనుమతులు ఇవ్వాలన్న సుప్రీం తీర్పుపై మంత్రి తుమ్మల హర్షం**

ఈ తీర్పుతో ఖమ్మం జిల్లాలలోని సీతమ్మ సాగర్ ప్రాజెక్ట్‌కు లైన్ క్లియర్ అయిందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. సీతమ్మ ప్రాజెక్ట్ ద్వారా 36.37 టిఎంసిల నీరు నిల్వ చేసి, 6.74 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీరు అందించవచ్చునని తెలిపారు. 282.80 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేయవచ్చునని పేర్కొన్నారు. రాష్ట్ర ఇరిగేషన్ ప్రాజెక్ట్‌ల పర్యావరణ అనుమతుల కోసం కృషి చేసిన సిఎం రేవంత్ రెడ్డికి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కు సంబంధిత అధికారులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేసినట్లు ప్రకటించారు.

# 'పరీక్షల' బిల్లు పాస్

>> భావిస్తోందని, అందుకే ఈ సవరణలు తీసుకొచ్చినట్లు చెప్పారు.ప్రశ్నాపత్రాల లీకేజీల కారణంగా విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడే ఘటనలు గత కొన్ని సంవత్సరాల్లో తగ్గుముఖం పట్టాయని కూడా ఆయన పేర్కొన్నారు.ఈ సందర్భంగా లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీపై జితేంద్ర సింగ్ విమర్శలు గుప్పించారు. పార్లమెంటరీ సంప్రదాయాలు, ప్రభుత్వ వ్యవహార తీరుపై ఆయనకు సరైన అవగాహన లేదని ఆరోపించారు. బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలిపిన అనంతరం సభను వాయిదా వేశారు. బిల్లును సభలో ప్రవేశపెట్టిన సమయంలో ప్రతిపక్ష సభ్యుల నినాదాలు, ఆందోళనల మధ్య తీవ్ర గందరగోళం నెలకొంది. అధికార, ప్రతిపక్ష సభ్యులు పరస్పరం తీవ్ర విమర్శలు చేసుకోవడంతో సభలో ఉద్రిక్త వాతావరణం కనిపించింది. లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ప్రసంగంతో ప్రధానంగా రాజకీయ దుమారం రేగింది. ఆయన కేంద్ర హోంమంత్రి, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో పాటు ఆర్ఎస్ఎస్‌పై విమర్శలు గుప్పించారు. సభలో నిరసనలు వ్యక్తమవడంతో రాహుల్ గాంధీ ప్రసంగంలోని కొన్ని వ్యాఖ్యలను లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా రికార్డుల నుంచి తొలగించారు. పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరెన్ రిజిజు స్పందిస్తూ, రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలు పార్లమెంటరీ సంప్రదాయాలకు విరుద్ధమని విమర్శించారు. ఆధారాలు లేని ఆరోపణలు చేయడానికి ముందు పార్లమెంట్ గౌరవాన్ని కాపాడాలని ఆయన సూచించారు.సభ పలుమార్లు వాయిదా పడిన అనంతరం జితేంద్ర సింగ్ బిల్లును అధికారికంగా సభ ముందుంచారు. అప్పటికీ ప్రతిపక్ష సభ్యులు 'వీ వాంట్ జస్టిస్' అంటూ నినాదాలు కొనసాగించారు. గందరగోళం మధ్యే బిల్లును వాయిస్ ఓటుకు పెట్టగా, లోక్‌సభ ఆమోదం తెలిపింది.ఈ బిల్లును కేంద్ర ప్రభుత్వం పరీక్షా పత్రాల లీకేజీలను అరికట్టేందుకు తీసుకొచ్చిన కీలక చట్ట సవరణగా పేర్కొంటోంది. పేపర్ లీక్ నేరాలకు పాల్పడే వారిపై మరింత కఠిన చర్యలు తీసుకోవడమే ఈ బిల్లు ప్రధాన లక్ష్యమని ప్రభుత్వం స్పష్టంచేసింది. కొత్త సవరణ బిల్లులో ఈ నేరాలకు మరింత ఎక్కువకాలం జైలుశిక్షలు, భారీ ఆర్థిక జరిమానాలు విధించేలా నిబంధనలు తీసుకురానున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఉభయసభలు ఆమోదించిన తర్వాత రాష్ట్రపతి ఆమోదిస్తే చట్టరూపంలోకి ఈ కొత్తబిల్లు రానున్నది.

## ఎన్యుమరేషన్ ఫారాలకు దగ్గరపడుతున్న గడువు

### ఆగస్టు 3 లోగా 100% డిజిటైజేషన్

### 'సర్'తో ప్రభుత్వ పథకాలకు సంబంధం లేదు: సిఇఒ సుదర్శన్ రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జులై29:** రాష్ట్రంలో ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా చేపడుతున్న ఓటరు జాబితా సవరణకు, ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఎలాంటి సంబంధం లేదని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి స్పష్టం చేశారు.బుధవారం నాడు ఎస్ఐఆర్ ప్రక్రియ పురోగతిపై జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్లతో ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా డిజిటలైజేషన్ పై కలెక్టర్లతో సమీక్షించారు. ఈ సందర్భంగా సిఇఒ మాట్లాడుతూ కొనసాగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియ కేవలం తప్పులు లేని ఓటరు జాబితా రూపకల్పనకు మాత్రమేనని, ప్రభుత్వం పథకాలకు ఎలాంటి సంబంధం లేదని తెలిపారు. ఎన్యూమరేషన్ ఫారాలను సమర్పించేందుకు మరో ఐదు రోజులు గడువు మాత్రమే ఉన్నందున ఆగస్టు మూడవ తేదీలోగా డిజిటలైజేషన్ ప్రక్రియ 100శాతం పూర్తి చేయాలని కలెక్టర్లను ఆదేశించారు. ఇప్పటి వరకు రాష్ట్రంలో 76శాతం డిజిటలైజేషన్ ప్రక్రియ పూర్తయిందని, గ్రామీణ ప్రాంతాల్లో 90శాతం పూర్తయిందని, ఇందులో ఖానాపూర్, బాల్కొండ, ఎల్లారెడ్డి, హుజూర్ నగర్, నర్సంపేట్, వర్ధన్నపేట్, పరకాల, బోథ్ నియోజకవర్గాల్లో 100శాతం డిజిటలైజేషన్ పూర్తయిందని, ఇందుకు సంబంధించిన అధికారులను సీఈఓ ప్రశంసించారు. శేరిలింగంపల్లి, రంగారెడ్డి, మేడ్చల్, జిహెచ్ఎంసితో పాటు నిజామాబాద్, వరంగల్, ఖమ్మం పట్టణ ప్రాంతాలలో డిజిటలైజేషన్ ప్రక్రియపై సంబంధిత డిఇఒలు ప్రత్యేక దృష్టి సారించి డిజిటలైజేషన్ ప్రక్రియను గడువులోగా పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు. ఎన్యూమరేషన్ ఫారాలను డిజిటలైజేషన్ చేయడంలో ఓటరు పేర్లను తప్పులు లేకుండా అప్‌లోడ్ చేసేలా బిఎల్ఒలు, సూపర్ వైజర్లు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. ఇఆర్ఒ, ఎఇఆర్ఒలు దీనిపై సమీక్షించి తప్పులు లేకుండా చూడాలని పేర్కొన్నారు. డిజిటలైజేషన్‌లో నిర్లక్ష్యం వహించిన బిఎల్ఒలు, సూపర్ వైజర్లపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవడం జరుగుతుందని సీఈఓ హెచ్చరించారు. కేంద్ర ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం పోలింగ్ స్టేషన్ల రేష్నలైజేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని ఆయన ఆదేశించారు. ఒకే కుటుంబ సభ్యుల పేర్లు ఒకే పోలింగ్ కేంద్రంలో ఉండేలా చూడాలన్నారు. ఓటర్లలో మరణించిన వారు, ఇల్లుమరిన వారి వివరాలు, అందుబాటులో లేని వారి (ఎ.ఎస్.డి) జాబితాను సిద్ధంచేసేటప్పుడు అన్ని రాజకీయ పార్టీలకు సంబంధించిన బిఎల్ఎల సంతకాలను తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. జిల్లా స్థాయిలో ఇఆర్ఒ, ఎఇఆర్ఒ, బిఎల్ఒ స్థాయిలలో జరిగే రాజకీయ పార్టీల సమావేశాలను వీడియోగ్రాఫ్ చేసి డాక్యుమెంట్ చేయాలన్నారు. దాంతోపాటు విఐపి, వివిఐపిల ఓటర్లను గుర్తించి మ్యాపింగ్ చేయాలన్నారు. ఈ సమావేశంలో అదనపు ప్రధాన ఎన్నికల అధికారి వాసం వెంకటేశ్వర్లు, జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి.కర్ణన్, డిప్యూటీ ఎన్నికల అధికారి చారి, పిఎం ఐటి చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

## వారం - వర్జ్యం

**30-07-2026, గురువారం**
**శ్రీ పరాభవ నామ సంవత్సరం,**
**ఆషాఢమాసం, దక్షిణాయణం**
**గ్రీష్మ ఋతువు, కృష్ణపక్షం, పుష్యమి కార్తె**
పాడ్యమి రా.9.28
శ్రవణ సా.5.41
వర్జ్యం : రా.9.58-రా.11.41
దు.ఉ.10.05-ఉ.10.57,
2) మ.3.14-సా.4.06
రాహుకాలం – మ.1.30-3.00

## వార్తాఫలం

**మేషం:** అందివచ్చే అవకాశములను నేర్పుతో మీకు అనుకూలంగా మార్చుకోండి. ఆర్థిక అభివృద్ధి చెందుతుంది.

**వృషభం:** దూరప్రాంతంలోని సన్నిహిత వర్గం ద్వారా మాట సహాయం పొందుతారు. వ్యాపారాలు అభివృద్ధి చెందుతాయి.

**మిథునం:** మాటల చాతుర్యంతో ఎంతటి వారినైనా ఆకట్టుకుని ముందుకు సాగుతారు. ఋణాలు తీరి ఊపిరి పీల్చుకుంటారు.

**కర్కాటకం:** జీవితభాగస్వామి ద్వారా ధనలాభం పొందుతారు. పోటీ పరీక్షలలో విజయం సాధిస్తారు. కాంట్రాక్టులు దక్కించుకుంటారు.

**సింహం:** భూ వివాదాలు తీరి లబ్ధి పొందుతారు. గృహనిర్మాణ ఆలోచనలు కలసి వస్తాయి. ప్రయత్నాలు నిదానంగా పూర్తిచేస్తారు.

**కన్య :** ఇతరుల విషయాలలో అతి జోక్యం వల్ల అభాసుపాలవుతారు. సంఘంలో గౌరవం పొందుతారు.బంధువుల కలయిక.

**తుల:** ఊహించని ఆహ్వానాలు అందుకుంటారు. సమస్యల పరిష్కారాన్ని కాలానికి వదిలివేస్తారు. శుభకార్యాలలో పాల్గొంటారు.

**వృశ్చికం:** కార్యాలయంలోని నూతన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తారు. మీ కృషిని పట్టుదలను అందరూ మెచ్చుకుంటారు.

**ధనుస్సు:** వ్యవహారాలలో తొందరపాటు వద్దు. ఆరోగ్య విషయాలలో మెలుకువ పాటించండి. మీ ఆలోచన విధానంలో మంచి మార్పువస్తుంది.

**మకరం:** మాటమీద నిలకడ లేని మనుషుల వల్ల కొన్ని ఇబ్బందులు ఎదురవుతాయి. జాగ్రత్తలు పాటించండి.

**కుంభం:** గృహ సంబంధమైన విషయాలను పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నారనే భావన మీ వారిలో రానివ్వకుండా జాగ్రత్తలు వహించండి.

**మీనం:** ముఖ్యమైన వస్త్రాలకు జతచేయవలసిన వాటిని మర్చిపోయే అవకాశం వుంది. జాగ్రత్తలు పాటించండి.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

## ఇరాన్‌పై తీవ్రస్థాయిలో ప్రతీకార చర్యలు తప్పవు: అమెరికా అధ్యక్షుడు ట్రంప్ హెచ్చరిక

**వాషింగ్టన్,జులై 29:** ఇరాన్ తమ సైనిక స్థావరాలపై క్షిపణి దాడులకు పాల్పడిన నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్రంగా స్పందించారు. ఇరాన్‌పై కఠిన ప్రతీకార చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అమెరికా బలగాలు ఇరాన్‌కు గట్టి సమాధానం చెబుతాయని ట్రంప్ స్పష్టం చేశారు.మీడియా ఇంటర్వ్యూలో ట్రంప్ మాట్లాడుతూ ఇరాన్ తదుపరి పరిణామాలను ఎదుర్కోవాల్సి ఉంటుందని ఘాటైన వ్యాఖ్యలు చేశారు. మేము వారిపై తీవ్రంగా దాడి చేస్తాం. వారికి గట్టి దెబ్బ తగులుతుందని ట్రంప్ పేర్కొన్నారు. ఇరాన్‌కు చెందిన ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్ అమెరికా సైనిక స్థావరాలను లక్ష్యంగా చేసుకుని బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగించిందని అమెరికా సెంట్రల్ కమాండ్ వెల్లడించిన మరుసటి రోజే ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. అయితే, అమెరికా రక్షణ వ్యవస్థలు ఆ క్షిపణులను మధ్యలోనే అడ్డుకోవడంతో ఎలాంటి నష్టం జరగలేదని అధికారులు తెలిపారు.రాత్రి సమయంలో ప్రయోగించిన క్షిపణులను కూల్చివేయడానికి అమెరికా బలగాలకు కేవలం కొన్ని నిమిషాల సమయం మాత్రమే లభించిందని ట్రంప్ తెలిపారు. ఈ ఘటన ఎంత తీవ్రంగా మారే అవకాశం ఉందో ఆయన వ్యాఖ్యలు స్పష్టం చేశాయి. ఇరాన్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్‌కు చెందిన ఏరోస్పేస్ విభాగం అమెరికా వైమానిక స్థావరంతో పాటు జోర్డాన్‌లోని సెంట్రల్ కమాండ్ ప్రాంతీయ ప్రధాన కార్యాలయాన్ని లక్ష్యంగా చేసుకుని పలు బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగించినట్లు ప్రకటించింది.ఈ దాడితో ఇరాన్‌అమెరికా మధ్య కొనసాగుతున్న తాత్కాలిక ఉద్రిక్తతలు మరింతపెరిగాయి.

## మరోసారి భారత్‌పై నోరుపారేసుకున్న పాక్ రక్షణమంత్రి

**కరాచి,జులై 29:** పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్ (పీఓకే)లో కొనసాగుతున్న ఉద్రిక్తతల మధ్య పాక్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ చేసిన వ్యాఖ్యలు మరోసారి తీవ్ర వివాదానికి దారితీశాయి. పీఓకేలో నిరసనలు చేపడుతున్న వారిని భారత్‌తో సమానంగా శత్రువులుగా చూస్తానంటూ నోరు పారేసుకున్నారు. పాకిస్థాన్ భద్రతా బలగాల కాల్పుల్లో గత రెండు రోజుల్లో పీఓకేలో కనీసం 40 మందికాశ్మీరీ నిరసనకారులు ప్రాణాలు కోల్పోయినట్లు వార్తలు వస్తున్న తరుణంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. సోషల్ మీడియాలో వైరల్‌గా మారిన ఓ వీడియోలో ఖవాజా ఆసిఫ్ మాట్లాడుతూ అక్కడ నిరసన చేస్తున్న వారిని కూడా భారత్‌ను చూసినట్టే చూస్తాను. వాళ్లూ మా శత్రువులేఅని అన్నారు. ఈవ్యాఖ్యలపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పీఓకేలో శాంతియుతంగా నిరసనలు చేస్తున్న ప్రజలను శత్రువులుగా చిత్రీకరించడం పరిస్థితిని మరింత ఉద్రిక్తం చేస్తోందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. జూన్ 5 నుంచి పీఓకేలో హింసాత్మక ఘటనలు కొనసాగుతున్నాయి. అప్పటి నుంచి ఇప్పటివరకు 90 మందికిపైగా ప్రాణాలు కోల్పోయినట్లు సమాచారం.



బుధవారం గురు పూర్ణిమ సందర్భంగా అయోధ్యలోని సరయునదిలో పుణ్యస్నానాలు చేస్తున్న భక్తులు

# ప్రాజెక్టులకు వరదకళ

>> క్యూసెక్కుల నీటి ప్రవాహం వచ్చిచేరుతుండంతో నీటిని ఎత్తిపోయడం సాధ్యమైంది.ఒక్కో మోటార్ 3,150 క్యూసెక్కుల చొప్పున నీరు పంపింగ్ అవుతుంది.4 మోటార్ల ద్వారా 12,600 క్యూసెక్కుల నీరు రిజర్వాయర్‌లోని క్రష్ గేట్ల ద్వారా జంట సొరంగాల నుంచి కరీంనగర్ జిల్లా రామడుగు మండలంలోని లక్ష్మీపూర్ గాయత్రి పంప్ హౌస్ కు అదే పరిమాణంలో నీరు తరలుతోంది. గాయత్రి పంపు హౌస్‌లో బాహుబలి మోటార్లను ఆన్ చేయడంతో జలాలు శ్రీ రాజరాజేశ్వర జలాశయానికి తరలుతున్నాయి. కాగా నీటి తరలింపు మూడు రోజులపాటు కొనసాగుతుందని ఆ శాఖ స్థానిక ఇంజనీరింగ్ అధికారులు తెలిపారు. రామడుగు మండలంలోని లక్ష్మీపూర్ గాయత్రి పంప్‌హౌస్ నుంచి నాలుగు పంపుహౌజులతో 12600 క్యూసెక్కుల నీటి ఎత్తిపోతలు చేపట్టారు. మధ్యాహ్నం తొలుత గాయత్రి పంప్ హౌస్ నాలుగు మూడు ద్వారా 10,500 క్యూసెక్కులు ఎత్తిపోత ట్రయల్ రన్ మొదలైంది. గాయత్రి పంప్‌హౌస్ నుంచి ఎస్ఆర్ఎస్పీ కాలువ ద్వారా మధ్యమానేరుకు గోదావరి నీరు చేరుతుంది. తెలంగాణ, చత్తీస్‌గడ్‌లో మోస్తారు వర్షాలు కురుస్తోండటంతో ఎల్‌నితో ఇంతకాలం నీరులేని తాలిపేరులో భారీగా వరద వచ్చి చేరుతోంది దీనితో ప్రాజెక్టుకు చెందిన 24 గేట్లుఎత్తి 84,376వేల క్యూసెక్కులు నీటిని దిగువకు గోదావరికి విడుదల చేస్తున్నారు. 13గేట్లు రెండు అడుగుల మేరకు 11 గేట్లు పూర్తిస్థాయిలో ఎత్తినీటిని కిందికి వదలుతున్నారు., చింతవాగు, రోటెంతవాగు, పగిడివాగు నుంచి వరద పెద్ద ఎత్తున వస్తుండటంతో తాలిపేరు కుడిఎడమల కాల్వలకు నీటిని విడుదల చేస్తున్నారు. ఎగువ ప్రాంతం నుంచి 77వేల క్యూసెక్కుల వరద రిజర్వాయర్‌లోకి వస్తోంది. ఇంకా వరద పెరిగితే అన్ని గేట్లు పూర్తిస్థాయిలో ఎత్తుతామని నీటిపారుదలశాఖ అధికారులు తెలిపారు. కామారెడ్డి జిల్లా నిజాంసాగర్ పరిధిలోని కళ్యాణి ప్రాజెక్టుకు చెందిన రెండు గేట్లు ఎత్తి250 క్యూసెక్కుల నీటిని మంజీరా నదిలోకి కిందికి వదులుతున్నారు. 480క్యూసెక్కుల నీరు వరదగా వచ్చిచేరుతోంది.408.6అడుగులతో నిండుకుండలా కళ్యాణిప్రాజెక్టు తలపిస్తోంది. నిజాంసాగర్ జలాశయంకు ఎగువన కురుస్తోన్న వర్షంతో 6585క్యూసెక్కులవర్షం వచ్చిచేరుతోంది. జలాశయంలో 1395 అడుగుల నీరు వచ్చిచేరింది. 17.802టిఎంపిల నీటి నిల్వసామర్థ్యం కలిగిన ఈ ప్రాజెక్టులోకి ప్రస్తుతం 7.132 టిఎంసిల నీరుఉంది. శ్రీరామసాగర్ ప్రాజెక్టులోకి నాలుగువేల క్యూసెక్కుల నీరు వచ్చిచేరుతోంది ప్రస్తుతం రిజర్వాయర్‌లో 16టిఎంసిలనీరుఉంది. కడెంప్రాజెక్టులోకి 21583క్యూసెక్కుల నీరు వచ్చిచేరుతోంది కిందికి 67వేల క్యూసెక్కుల నీరు వదిలిపెడుతున్నారు. మంచిర్యాలజిల్లాలో రాళ్ళవాగు కాజ్వేవాగు ఉప్పొంగిపో తుంది. మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి మండలం కన్నాలగ్రామంలోని ఎర్రగుంటపల్లి చెరువుకు గండిపడింది.

## దూసుకొస్తున్న తీవ్ర వాయుగుండం

>> సూచించారు. ఉత్తర ఒడిశా, పశ్చిమ బెంగాల్ ప్రాంతాలపై కేంద్రీకృతమైన తీవ్ర వాయుగుండం దక్షిణ ఝార్ఖండ్, ఉత్తర ఛత్తీస్‌గఢ్ మీదుగా పశ్చిమవాయవ్య దిశగా కదిలే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది. రుతుపవన ద్రోణి ఆగ్నేయ దిశగా ఈశాన్య బంగాళాఖాతం వరకు విస్తరించడంతో రాష్ట్రంలో భారీ వర్షాలు కురుస్తాయని హెచ్చరించింది. ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి తదితర జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని వెల్లడించింది. ఈ మేరకు ఆయా జిల్లాలకు వాతావరణ శాఖ ఎల్లో హెచ్చరికలు జారీ చేశారు. గురు, శుక్రవారాల్లో రాష్ట్రవ్యాప్తంగా తేలికపాటి నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. ఉత్తర తెలంగాణ జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు పడే అవకాశం ఉందని పేర్కొంది. ఈ మేరకు ఆయా జిల్లాలకు ఐఎండి ఎల్లో అలర్ట్ జారీ చేసింది. వర్షం కురిసే సమయంలో అత్యవసరం అయితే తప్ప ఎవరూ బయటకు వెళ్లొద్దని అధికారులు సూచించింది. భారీ వర్షాల హెచ్చరికల నేపథ్యంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించి అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. లోతట్టు ప్రాంతాలు, సహాయక చర్యలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. భద్రాచలం, ములుగు, నిర్మల్ జిల్లాల్లో ఎన్డీఆర్ఎఫ్ బృందాలను సిద్ధంగాఉంచినట్లు తెలిపారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని, వ్యవసాయ శాఖ రూపొందించిన ప్రత్యామ్నాయ పంటల సాగు ప్రణాళికను అమలుచేస్తూ రైతులకు అవసరమైన విత్తనాలు, సహాయ సహకారాలు అందించాలని కలెక్టర్లను ఆదేశించారు.

## రెండేళ్లలో రూ.30 లక్షల కోట్లకు పసిడి తనఖా రుణ మార్కెట్

### అదే సమయంలో ఎన్‌బిఎఫ్‌సిలకు గోల్డ్ లోన్ బకాయిలు పెరిగే ముప్పు

**న్యూఢిల్లీ,జులై 29:** నాన్‌బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీలు (ఎన్‌బీఎఫ్‌సీలు) ఇచ్చే బంగారం తాకట్టు రుణాల్లో సమీప కాలంలో బకాయిలు పెరిగే అవకాశం ఉందని ఐసీఆర్ఏ నివేదిక వెల్లడించింది. ఇదే సమయంలో బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీలు కలిపి నిర్వహించే వ్యవస్థీకృత గోల్డ్ లోన్ మార్కెట్ పరిమాణం మార్చి 2026లో ఉన్న సుమారు రూ.18 లక్షల కోట్ల నుంచి మార్చి 2028 నాటికి రూ.30 లక్షల కోట్లకు మించనుందని అంచనా వేసింది.రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సవరించిన నిబంధనల నేపథ్యంలో రుణగ్రహీతలు బుల్లెట్ రీపేమెంట్ రుణాల నుంచి సాధారణ నెలవారీ వాయిదాల చెల్లింపు విధానానికి మారుతున్నారని ఐసీఆర్ఏ తెలిపింది.2027,2028 ఆర్థిక సంవత్సరాల్లో వ్యవస్థీకృత గోల్డ్ లోన్ మార్కెట్ 30 శాతానికి పైగా సమ్మిళిత వార్షిక వృద్ధి రేటు నమోదు చేసే అవకాశం ఉందని నివేదిక పేర్కొంది. ఎన్‌బీఎఫ్‌సీల వాటా పెరుగుదగోల్డ్ లోన్ మార్కెట్‌లో ఎన్‌బీఎఫ్‌సీల వాటా 2027-28 నాటికి 23 శాతానికి పెరుగుతుందని అంచనా వేస్తున్నారు. అయితే పెరుగుతున్న పోటీ కారణంగా రుణాలపై వచ్చే ఆదాయాలపై ఒత్తిడి ఏర్పడి, వృద్ధి అవకాశాలు పరిమితం కావచ్చని ఐసీఆర్ఏ హెచ్చరించింది.

మొత్తం గోల్డ్ లోన్ బుక్ 2024-25 నుంచి 2025-26 మధ్య 38 శాతం సమ్మిళిత వార్షిక వృద్ధి రేటుతో పెరిగింది. ముఖ్యంగా 2025-26లో దాదాపు 50 శాతం వృద్ధి నమోదైంది.ఈ కాలంలో బ్యాంకుల గోల్డ్ లోన్ పోర్ట్‌ఫోలియో 35 శాతం సమిష్టివృద్ధితో పెరగగా, ఎన్‌బీఎఫ్‌సీల గోల్డ్ లోన్ వ్యాపారం 54 శాతం అధిక వృద్ధిని నమోదు చేసినట్లు ఐసీఆర్ఏ నివేదిక తెలిపింది. ఎన్‌బీఎఫ్‌సీలకు లాభందీంతో మొత్తం గోల్డ్ లోన్ ఆస్తుల నిర్వహణలో ఎన్‌బీఎఫ్‌సీల వాటా 2025-26లో పెరిగింది. గత మూడు సంవత్సరాలుగా తగ్గుతూ వచ్చిన వాటా తిరిగి మెరుగుపడింది. మార్చి 2024లో గోల్డ్ లోన్ నిర్వహణ ఆస్తుల్లో బ్యాంకుల వాటా 82 శాతంగా ఉండగా, మార్చి 2026 నాటికి అది సుమారు 78 శాతానికి తగ్గింది. ఇదే సమయంలో ఎన్‌బీఎఫ్‌సీల వాటా పెరిగింది.

## రాహుల్‌గాంధీ హత్యచేసారని నేను కూడా చెపుతా.. నమ్మొచ్చా!

### లోక్‌సభలో కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు

**న్యూఢిల్లీ,జులై29:** పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో అధికార, ప్రతిపక్షాల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. యాంటీపేపర్ లీక్ బిల్లు, విద్యార్థి నిరసనలపై ప్రతిపక్షం బిజెపిని ఇరుకున పెట్టేందుకు ప్రయత్నించింది. కాంగ్రెస్ ఎంపీ, ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ చేసిన ఆరోపణలు వివాదస్పదంగా మారాయి. విద్యార్థులపై కాల్పులు జరపడానికి, బలప్రయోగం చేయడానికి కేంద్ర హోంమంత్రి అమిత్ షా భద్రతా బలగాలకు ఆదేశాలు ఇచ్చారని రాహుల్ గాంధీ ఆరోపించారు. రాహుల్ గాంధీ ఆరోపణలపై పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు ఘాటు వ్యాఖ్యలు చేశారు. రాహుల్ గాంధీ ఆరోపణలకు ఆధారాలు ఉంటే సభ ముందు ఉంచాలని డిమాండ్ చేశారు. ఎలాంటి ఆధారాలు లేకుండా ఇలాంటి తీవ్రమైన ఆరోపణలు చేయడం సరికాదని హితవు పలికారు. రాహుల్ గాంధీ హత్య చేశారని నేను కూడా చెప్పగలనని వ్యాఖ్యానించారు. ఆధారాలు లేకుండా ఎవరిపైనా ఏ ఆరోపణ అయినా చేయవచ్చని తాను ఈ ఉదాహరణ చెప్పానని కిరన్ రిజిజు అన్నారు.రాహుల్ వ్యాఖ్యలపై లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా కూడా అసంతృప్తి వ్యక్తం చేశారు. సభలో చేసే ప్రతీ ఆరోపణ వాస్తవాల ఆధారంగా ఉండాలని సూచించారు. ప్రతిపక్ష నేతగా రాహుల్ గాంధీ చేసే వ్యాఖ్యలు సభా రికార్డుల్లో శాశ్వతంగా నిలిచిపోతాయని, అందువల్ల బాధ్యతాయుతంగా మాట్లాడాలని సూచించారు. చర్చ జరిగే సమయంలో ప్రతిపక్షాలు హోంమంత్రి సమాధానం చెప్పాలి అంటూ నినాదాలు చేశారు. సమాజ్‌వాదీ పార్టీ చీఫ్ అఖిలేష్ యాదవ్ మాట్లాడుతూ విద్యార్థులపై కాల్పుల ఘటనపై ప్రభుత్వం వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

# నిధులు సక్రమ వినియోగం కాకుంటే ఆర్థిక మంజూరు నిలిపివేత

## ముందు రాష్ట్ర వాటా నిధుల ఖర్చు

## రాష్ట్రాలకు కేంద్రం హెచ్చరిక

**హైదరాబాద్, జూలై 28, ప్రభాతవార్త:** రాష్ట్రాలకు విడుదల చేసే నిధుల వినియోగంపై కేంద్రం ఆంక్షలు విధించింది. వివిధ కేంద్ర ప్రాయోజిత పథకాలు తదితర వాటికి రాష్ట్రాలకు కేంద్రం నిధులను మంజూరు చేస్తోంది. అయితే ఆ నిధులను సంబంధిత నిర్దేశించిన పథకాలకు వినియోగించకుండా కొన్ని రాష్ట్రాలు పక్కదారి పట్టిస్తుండగా, మరికొన్ని వాటి వినియోగంలో తీవ్ర నిర్లక్ష్యం చూపుతున్నాయి. కేంద్రం మంజూరు చేసే నిధులను రాష్ట్రాలు తమ ఆర్థిక అవసరాలకు అనుగుణంగా సర్దుబాటు చేసుకునేవి. కేంద్రం నిధులు వాడుకుని వినియోగధృవపత్రం (యుసిని) మాత్రం ఆర్థిక సంవత్సరం చివర్లో సమర్పించేవి. ఫలితంగా నిధులు దారి మళ్లుతున్నాయని కేంద్రం గుర్తించింది. దీంతో ఈ నిధుల వ్యవహారానికి చెక్ పెట్టేందుకు ప్రతి పథకానికి ప్రత్యేక అకౌంట్లను ఏర్పాటు చేసింది. ఆయా ఖాతాల్లో రాష్ట్రాలు ముందుగా తమ వాటాను జమ చేసిన తర్వాత కేంద్రం తన వాటాను జమ చేసేది. కేంద్రం ఈ విధానంలో నిధులను మళ్లిస్తున్నట్లు గుర్తించింది. దీనికి తగినట్లుగా నిధుల దుర్వినియోగం, పక్కదారి పడుతున్నాయని ఫిర్యాదుల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం వీటిపై కీలక నిర్ణయం తీసుకున్నది. ఈ క్రమంలోనే ప్రభుత్వ పథకాలు, నిధుల వినియోగంలో క్రమక్రమంగా అనేక సంస్కరణలను కేంద్రం తీసుకువస్తుంది. ఇందులో భాగంగా మార్గదర్శకాల్లో తాజాగా మార్పులు చేసింది. ఇప్పటి వరకు కేంద్రం నిధులను మంజూరు చేసిన తర్వాత రాష్ట్రం తన వాటా జమ చేసిన ఆకౌంట్లో జమ చేసేది. తదుపరి కేంద్రం తన వాటా నిధులను విడుదల చేసేది. దీంతో కేంద్ర రాష్ట్రాల సంయుక్త నిధులను కలిపి ఒకేసారి పథకాల వినియోగం కోసం ఖర్చు చేసేవారు. అయితే తాజాగా మారిన మార్గదర్శకాల ప్రకారం కేంద్రం నిధులు మంజూరు చేసిన తర్వాత రాష్ట్రం తన వాటా నిధులను సంబంధిత పథకానికి ఖర్చు చేసి యూటిలైజేషన్‌సర్టిఫికేట్‌(యూసీ) సమర్పించిన తదుపరే కేంద్రం తన వంతు వాటా నిధులను విడుదల చేయాలని నిర్ణయించింది. ఇలా చేయడం వలన కేంద్రం రూపొందించిన పథకాలు క్షేత్రస్థాయిలో అమలవుతున్నాయని, అవి ఆచరణలోకి ఉన్నాయనేది ధృవీకరణ జరిగిన తదుపరే నిధులను విడుదల చేయాలని నిర్ణయించింది.

## ఆగస్టు 12న సంపూర్ణ సూర్యగ్రహణం

### భారత్‌లో ప్రభావం నిల్

**న్యూఢిల్లీ, జూలై 29:** సంపూర్ణ సూర్యగ్రహణం వచ్చేనెల 12న సంభవించనుంది. ప్రపంచవ్యాప్తంగా ఖగోళ శాస్త్రవేత్తలు, ఔత్సాహికులు ఎంతగానో ఎదురుచూస్తున్న ఈ అరుదైన దృశ్యం భారతదేశంలో మాత్రం కనిపించదు. మన దేశంలో ఆ సమయానికి రాత్రి అవుతుండటమే ఇందుకు ప్రధాన కారణం. సూర్యుడికి, భూమికి మధ్య చంద్రుడు అడ్డుగా వచ్చినప్పుడు సంపూర్ణ సూర్యగ్రహణం ఏర్పడుతుంది. చంద్రబింబం సూర్యుడిని పూర్తిగా కప్పివేయడంతో పగటిపూట కూడా ఆకాశం చీకటిగా మారి, ఉష్ణోగ్రతలు ఒక్కసారిగా పడిపోతాయి. ఆ సమయంలో నక్షత్రాలు, గ్రహాలు కూడా స్పష్టంగా కనిపించే అవకాశం ఉంటుంది. నాసా శాస్త్రవేత్తల కథనం ప్రకారం, సూర్యుడు చంద్రుడి కంటే 400 రెట్లు పెద్దదైనప్పటికీ, అదే స్థాయిలో (400 రెట్లు) దూరంగా ఉండటం వల్ల ఆకాశంలో చంద్రుడు, సూర్యుడు దాదాపు ఒకే పరిమాణంలో కనిపిస్తారు. ఈ సంపూర్ణ గ్రహణం గ్రీన్‌లాండ్, ఐస్‌లాండ్, స్పెయిన్, పోర్చుగల్‌లోని కొన్ని ప్రాంతాలతో పాటు ఉత్తర రష్యా, అట్లాంటిక్ మహాసముద్రం పరిధిలో కనిపిస్తుంది. ఇక ఉత్తర అమెరికా, కెనడా, యూరప్, వాయువ్య ఆఫ్రికాలోని పలు ప్రాంతాల్లో పాక్షిక సూర్యగ్రహణాన్ని వీక్షించే అవకాశం ఉంది. భారత కాలమానం ప్రకారం, ఆగస్టు 12 రాత్రి 9:45 గంటలకు ప్రారంభ మయ్యే ఈ గ్రహణం, ఆగస్టు 13 తెల్లవారుజామున 2:15 గంటల వరకు కొనసాగుతుంది. ఈ సమయంలో మన దేశంలో సూర్యరశ్మి ఉండదు కాబట్టి గ్రహణాన్ని వీక్షించే వీలు లేదు. అందువల్ల, గ్రహణం సమయంలో పాటించే సూతక్ కాలం వంటి సాంప్రదాయ నియమాలు మనకు వర్తించవని పండితులు స్పష్టం చేస్తున్నారు.

## ట్రైనీ ఐపిఎస్ ఉదయ్ కృష్ణారెడ్డికి రిమాండ్

### చంచల్‌గూడ జైలుకు తరలింపు

### హైకోర్టులో విచారణ నాలుగు వారాలు వాయిదా

**హైదరాబాద్ (శంకర్‌పల్లి), జులై 29, ప్రభాతవార్త :** మహిళా ట్రైనీఐపిఎస్ అధికారిపై లైంగిక వేధింపులకు పాల్పడిన కేసులో అరెస్టు అయిన ట్రైనీ ఐపీఎస్ అధికారి ఉదయ్ కృష్ణారెడ్డికి రెండు వారాల రిమాండ్ విధిస్తూ ఉప్పర్పల్లి కోర్టు బుధవారం సాయంత్రం సంచలన ఆదేశాలు జారీ చేసింది. ఈ నెల 18న ఉదయ్ కృష్ణారెడ్డిపై లైంగిక వేధింపులకు సంబంధించి అత్తాపూర్ పోలీస్ స్టేషన్లో కేసు నమోదవడం తెలిసిందే. అనంతరం ఈ కేసును మహిళా భద్రత విభాగానికి బదలీ చేశారు. దీని తర్వాత ఉదయ్ కృష్ణారెడ్డిని పోలీసు అకాడమీ నుంచి సస్పెండ్ చేయగా బోరబండలోని తన స్నేహితుడి ఇంటికి వెళ్లి అతిగా మద్యం సేవించి అనారోగ్యానికి గురయ్యాడు. వెంటనే అతన్ని స్నేహితులు ఆస్పత్రికి తరలించడంతో మూడు రోజుల తర్వాత కోలుకున్నాడు. అనంతరం ఉన్నట్టు ఉండి సెల్‌ఫోన్ స్విచ్ఛాఫ్ చేసుకొని అజ్ఞాతంలోకి వెళ్లిపోయాడు. ఇదే సమయంలో తనను పోలీసులు అరెస్టు చేయకుండా ఉండేందుకు ఉదయ్ కృష్ణారెడ్డి హైకోర్టును ఆశ్రయించాడు. ఈ కేసు హైకోర్టు విచారణలో ఉన్నది. ఓ వైపు ఉదయ్ కృష్ణారెడ్డికోసం పోలీసులు గాలిస్తుండగా మంగళవారం ప్రకాశం జిల్లా నుంచి ఉదయ్ కృష్ణారెడ్డి మీడియా ప్రకటన విడుదల చేశారు. తాను ఎక్కడికీ పారిపోలేదని, పోలీసులకు అందుబాటులో ఉన్నానని, హైదరాబాద్ కు వస్తున్నట్లు తెలిపారు. అతని గురించి సమాచారం అందుకున్న పోలీసులు మంగవారం సాయంత్రం మిరియాలగూడవద్ద అదుపులోకి తీసుకున్నారు. అనంతరం బుధవారం తెల్లవారుజామున నాటకీయ పరిణామాల మధ్య ఉస్మానియాలో వైద్య పరీక్షలు నిర్వహించి సాయంత్రం 4గంటల సమయంలో ఉప్పర్‌పల్లి కోర్టులో హాజరుపరచగా కోర్టు ఆగస్టు 11వరకు రిమాండ్ విధించింది. పోలీసు బందోబస్తు మధ్య చంచల్‌గూడ జైలుకు తరలించారు.

## కేంద్ర బొగ్గు, గనుల శాఖ కార్యదర్శిగా కేశవ్‌చంద్ర

**హైదరాబాద్, జులై 29,ప్రభాతవార్త :** కేంద్ర బొగ్గు, గనుల మంత్రిత్వ శాఖ కార్యదర్శిగా కేశవ్ చంద్రను నియమిస్తూ కేంద్రం నిర్ణయం తీసుకుంది. దీంతో ఆ వెనువెంటనే కేశవ్ చంద్ర గనుల మంత్రిత్వ శాఖ కార్యదర్శిగా బుధవారం బాధ్యతలు స్వీకరించారు. తదుపరి వెంటనే, గనుల శాఖ కార్యదర్శి గనుల మంత్రిత్వ శాఖలోని ఉన్నతాధికారులతో ఒక సమావేశాన్ని నిర్వహించారు. మంత్రిత్వ శాఖ యొక్కలో అమలవుతున్న కీలక కార్యక్రమాలు, కొనసాగుతున్న కార్యకలాపాలను సమీక్షించారు. ఇందులో సీనియర్ అధికారులు మంత్రిత్వ శాఖ యొక్క వివిధ ముఖ్యమైన కార్యక్రమాలు, తీసుకున్న చర్యలు, అవి అమలవుతున్న తీరుతెన్నులను గురించి కార్యదర్శికి వివరించారు. వీటిలో ముఖ్యంగా ఖనిజ అన్వేషణ, ఖనిజ బ్లాకుల వేలం మరియు కార్యాచరణ, కీలక మరియు వ్యూహాత్మక ఖనిజాలు, మరియు మైనింగ్ మరియు ఖనిజ రంగంలోని ఇతర కీలక అంశాలకు సంబంధించినవి ఉన్నాయి. భారతదేశ ఖనిజ రంగాన్ని బలోపేతం చేయడానికి, మంత్రిత్వ శాఖ యొక్క కీలక కార్యక్రమాలను సమన్వయంతో, సమర్థవంతంగా అమలు చేయాల్సి న ఆవశ్యకతను గనుల శాఖ కార్యదర్శి నొక్కి చెప్పారు.

## రాష్ట్రంలో ప్రైస్ మానిటరింగ్ సెంటర్లు ఏర్పాటు

### పౌర సరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర

**హైదరాబాద్, జులై 29,ప్రభాతవార్త :** రాష్ట్రంలో 11 ప్రైస్ మానిట రింగ్ సెంటర్లు ఏర్పాటు చేస్తునట్లు పౌరసరఫరాలశాఖ కమీషనర్ స్టీఫెన్ రవీంద్ర తెలిపారు. పౌరసరఫరాలభవన్‌లో బుధవారం వ్యవసాయ ఉత్పత్తుల సేరకణ రైతు సంక్షేమం పై ఉన్నతస్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ధాన్యం సేకరణ సమయంలోఉండే హమాలి కొరత తీర్చడానికి సరైన ఏర్పాట్లు చేసుకోవాలని తగిన యాంత్రీకరణ చేపట్టాలని తెలిపారు,. వ్యవసాయశాఖ కమీషరన్ సురేంద్రమోహన్ మార్క్‌ఫెడ్ ఎండి రాహుల్‌రాజ్ నిత్యావసరాలధర స్థిరీకరణకు ప్రైస్‌మానిటరింగ్ సెంటర్లు దోహదపడుతాయని ప్రజలకు ధరల పెరుగదల హెచ్చుతగ్గులపై ఆందోళన లేకుండా ఉంటుందని అభిప్రాయపడ్డారు.

## మాజీ ప్రధాని దేవెగౌడకుఎపి సిఎం పరామర్శ

**విజయవాడ, జులై 29 ప్రభాతవార్త ప్రతినిధి:** మాజీ ప్రధాని హెచ్.డి. దేవెగౌడ సతీమణి చెన్నమ్మ ఇటీవల మృతి చెందడంతో ఆయన్ను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఫోనులో పరామర్శించారు. చెన్నమ్మ మృతి పట్ల సిఎం సంతాపం వ్యక్తం చేశారు. ఈ క్లిష్ట సమయంలో ధైర్యంగా ఉండాలని సూచించారు. చెన్నమ్మ ఆత్మకు శాంతి చేకూరాలని, ఆమె కుటుంబ సభ్యులు ఈ విషాదాన్ని తట్టుకుని మనోధైర్యంతో ఉండాలన్నారు. ఈ సందర్భంగా దేవెగౌడ సహా ఆయన కుటుంబంతో మూడు దశాబ్దాలుగా తనకున్న అనుబంధాన్ని సిఎం చంద్రబాబు గుర్తు చేసుకున్నారు.

## సినారె జయంతి సందర్భంగా సిఎం రేవంత్‌రెడ్డి ఘనంగా నివాళి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,జులై29:**ప్రఖ్యాత కవి, జ్ఞానపీఠ పురస్కార గ్రహీత, రాజ్యసభ మాజీ సభ్యుడు, తెలంగాణ ముద్దుబిడ్డ డాక్టర్ సి. నారాయణ రెడ్డి జయంతి సందర్భంగా ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి ఆ మహాకవికి ఘనంగా నివాళులర్పించారు. తన కలంతో తెలుగు భాషకు అపూర్వమైన వైభవాన్ని చేకూర్చిన సినారే కవిత్వానికి కొత్త దిశను చూపారని, సాహిత్యం, గేయం, గజల్, సినీగీతం, పరిశోధన, ప్రతి రంగంలోనూ తనదైన ముద్ర వేసి తెలుగు జాతి గర్వించే మహనీయుడిగా నిలిచారని కొనియాడారు. సినారే రచనలు మానవీయ విలువలు, ప్రేమ, ప్రకృతి, సామాజిక చైతన్యం, సాంస్కృతిక వైభవాన్ని ప్రతిబింబిస్తూ తరతరాలకు స్ఫూర్తినిస్తు న్నాయని, తెలంగాణ నేల గర్వించే మహనీయుడిగా, తెలుగు భాష ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటిన సాహితీ శిఖరంగా ఆయన చిరస్థాయిగా నిలిచిపోతారని స్మరించుకున్నారు.

## విద్యార్థులను అవమానించిన రాహుల్‌గాంధీ

# తక్షణమే క్షమాపణ చెప్పాలి

### బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు డిమాండ్



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జులై 29:** లోక్‌సభలో పబ్లిక్ ఎగ్జామ్స్ సవరణ బిల్లు, నీట్ పరీక్షల సంస్కరణలపై చర్చ సందర్భంగా రాహుల్ గాంధీ దేశ విద్యార్థి లోకాన్ని తీవ్రంగా అవమానించేలా మాట్లాడారని, ఆయన వ్యాఖ్యలను భారతీయ జనతా పార్టీ తీవ్రంగా ఖండిస్తోందని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు ప్రకటించారు. దేశానికి భావి భారత పౌరులు, ఈ దేశ భవిష్యత్తు అయిన విద్యార్థులను ఇడియట్స్ అని పిలవడం రాహుల్ గాంధీ అజ్ఞానానికి, విద్యార్థుల పట్ల ఉన్న చులకన భావానికి నిదర్శనమని ఆగ్రహం వ్యక్తం చేశారు. అసలు సబ్జెక్టుపై అవగాహన లేక, మాట్లాడటానికి ఏ విషయాలూ లేక పార్లమెంటు సమయాన్ని వృథా చేస్తూ రాహుల్ గాంధీ ఒక పొలిటికల్ ఇడియట్‌లా వ్యవహరిస్తున్నారని ఎద్దేవా చేశారు. ఢిల్లీ నిరసనల్లో రబ్బర్ బుల్లెట్లు వాడారంటూ అబద్ధాలు ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ నేతలు, గతంలో తెలంగాణ ఉద్యమంలో వందలాది మంది విద్యార్థులను ఏ రకంగా పొట్టనబెట్టుకున్నారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

తెలంగాణ తొలిదశ, మలిదశ ఉద్యమాల్లో 1400 మందికి పైగా విద్యార్థులు, యువకులు ప్రాణాలు కోల్పోవడానికి కాంగ్రెస్ పార్టీ వైఖరే కారణమని రాంచందర్ రావు గుర్తుచేశారు. ఆనాడు నాటి కాంగ్రెస్ కేంద్ర మంత్రి పి.చిదంబరం తెలంగాణ రాష్ట్రాన్ని ప్రకటిస్తున్నట్లు చెప్పి, ఆ తర్వాత యు టర్న్ తీసుకొని తెలంగాణ ఆకాంక్షలను కాలరాశారని, దాంతో మనస్తాపానికి గురై వందలాది మంది విద్యార్థులు ఆత్మబలిదానాలు చేసుకున్నారని గుర్తుచేశారు. నిరసనకారులపై లాఠీచార్జ్ చేస్తే వారేమైనా టెర్రరిస్టులా అని ప్రశ్నిస్తున్న ప్రియాంక గాంధీ... మరి ఆనాడు కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో తుపాకీ గుళ్లకు బలైన తెలంగాణ విద్యార్థులు టెర్రరిస్టులా అని ప్రశ్నించారు. బిజెపిని ఆర్ఎస్ఎస్ నడిపిస్తోందని విమర్శలు గుప్పిస్తున్న కాంగ్రెస్ నేతలకు, తమ పార్టీని ఇటలీ నడిపిస్తోందనే నిజాన్ని చూసి సిగ్గుండాలని ఘాటుగా విమర్శించారు. గత ఎన్నికల సమయంలో ప్రియాంక గాంధీ స్వయంగా తెలంగాణకు వచ్చి యూత్ డిక్లరేషన్ పేరిట ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటి కూడా రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటివరకు నెరవేర్చలేదని, యువతను తీవ్రంగా మభ్యపెట్టి మోసం చేసిందని విమర్శించారు. విద్యార్థులను ఇడియట్స్ అని అవమానించి నందుకు రాహుల్ గాంధీ, అలాగే తెలంగాణ ఉద్యమంలో విద్యార్థుల చావులకు కారణమైనందుకు, ఇచ్చిన హామీలను విస్మరించినందుకు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రజలకు, విద్యార్థి లోకానికి బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

## మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు మిస్రి బిస్రా అరెస్టు

### అనుచరులు గౌరవ్‌హోస్తా మోచుసహా పలువురిని జార్ఖండ్‌లోని ధన్‌బాద్ గిరిడి జిల్లా సరిహద్దుల్లో అదుపులోకి తీసుకున్న పోలీసులు

**చర్ల, జులై 29, ప్రభాతవార్త:** మావోయిస్టు కేంద్ర కమిటీలో ఉన్న ఒకేఒక్క సభ్యుడు మిస్రి బిస్రాను జార్ఖండ్ పోలీసులు, సిఆర్పీఎఫ్ సిబ్బందికి చేతికి చిక్కాడు. ఆపరేషన్ కగార్ చేపట్టిన నాటి నుండి ఆయన, ఆయన అనుచరుల కోసం జార్ఖండ్ పోలీసులు గత రెండు సంవత్సరాలుగా విస్తృత సెర్చ్ ఆపరేషన్ చేపట్టారు. కేంద్ర కమిటీలో ఉన్న 40 మంది సభ్యుల్లో చాలామంది లొంగిపోగా మరికొందరు ఎన్‌కౌంటర్లలో మరణించారు. కమిటీలో గణపతి, మిస్రిబిస్రానే ఉండగా వీరిద్దరి ఆచూకీ కోసం కేంద్ర రాష్ట్ర బలగాలు ఆపరేషన్ చేపట్టాయి. జార్ఖండ్ రాష్ట్రంలోని వెస్టసింగ్ భూమ్ జిల్లాలో మావోయిస్టుల ప్రభావం అధికంగా ఉండటంతో ఆ జిల్లాను మావోయిస్టు ప్రభావిత జిల్లాగా కేంద్రం ప్రకటించింది. బిస్రా అతని అనుచరులు గౌరవ్ హోస్థా మోచు మరికొంత మంది కోసం గత కొంతకాలంగా భద్రతా బలగాలు సెర్చ్ ఆపరేషన్ చేపట్టాయి. ఈ క్రమంలో సిఆర్పీఎఫ్ బలగాల వత్తిడి ఎక్కువ అవ్వడంలో 16 మంది మావోయిస్టులు పోలీసుల ఎదుట లొంగిపోగా బుధవారం బిస్రాను ఆయన అనుచరులు గౌరవ్ హోస్థా మోచులను ధన్‌బాధ్ గిరిడి జిల్లాల సరిహద్దులో భద్రతా బలగాలు అదుపులోకి తీసుకున్నాయి.

పట్టుబడిన మోస్ట్ వాండెట్ మావోయిస్టు నేత బిస్రాపై కోటి రూపాయల రివార్డు ఉంది. ఆపరేషన్ కగార్ చేపట్టిన కేంద్ర ప్రభుత్వం మార్చి 31 నాటికి మావోయిస్టు రహిత దేశం చూస్తారని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా ప్రకటించి అందుకు అనుగుణంగా అడుగులు వేయడంతో మావోయిస్టుల నిర్మూలన సాధ్యం అయ్యింది. మావోయిస్టు రహిత భారత్ అని కేంద్ర ప్రకటించి విజయం సాధించినా కేంద్ర కమిటీలో ఉన్న బిస్రా, గణపతి ఆచూకీ తెలియకపోవడం కొంత వెలితిగా అనిపించింది. ఇప్పుడు మిస్రి బిస్రా పట్టుబడటంతో గణపతి ఆచూకీ కోసం కేంద్ర ఇంటిలిజెన్స్ నిఘా విభాగం గణపతిపై మరింత ఫోకస్ పెట్టనున్నారు.

కాగా ఛత్తీస్‌గఢ్ అటవీ ప్రాంతంలో అక్కడక్కడగా మావోయిస్టుల ఉనికి వినిపిస్తుండటంలో భద్రతా బలగాలు సెర్చ్ ఆపరేషన్ కొనసాగిస్తున్నట్లు సమాచారం. మావోయిస్టుల డంపులు ఐఇడిల కోసం దండకారణ్యంలో నిరంతరం ఆపరేషన్ కొనసాగుతుంది.

## మహిళపై లైంగిక వేధింపుల ఆరోపణలు

## జూబ్లీహిల్స్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులురెడ్డి సస్పెన్షన్

**హైదరాబాద్ (జూబ్లీహిల్స్), జులై 29, ప్రభాతవార్త:** జూబ్లీహిల్స్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు రెడ్డిని నగర పోలీసు కమిషనర్ విసి సజ్జనార్ సస్పెండ్ చేశారు. ఒక మహిళ పోలీసు ఉన్నతాధికారులకు చేసిన ఫిర్యాదు నేప థ్యంలో అధికారులు ఈ నిర్ణయం తీసుకున్నారు. వివరాల్లోకి వెళితే.. శ్రీనివాసులు రెడ్డి అమీన్‌పూర్‌లో ఇన్‌స్పెక్టర్‌గా ఉన్న సమయంలో ఠాణాకు ఫిర్యాదు చేయడానికి వచ్చిన ఒక మహిళతో పరిచయం ఏర్పడింది. అది వారిద్దరి మధ్య సాన్నిహిత్యానికి దారితీసింది. ఈ క్రమంలో తీసుకున్న ఫొటోలు, వీడియో లు అడ్డుపెట్టుకొని ఇన్‌స్పెక్టర్ తనను డబ్బుల కోసం బెదిరించాడని సదరు మహిళ పోలీసు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసింది. ఇందుకు సంబంధించి వారిద్దరి మధ్య జరిగిన కొన్ని డబ్బుల లావాదేవీలకు సంబంధించిన స్క్రీన్ షాట్లను, ఆడియోలను పోలీసులకు అందించారు. తనపై పలుమార్లు లైంగిక దాడికి పాల్పడ్డాడని, అబార్షన్ చేయించాడని, పిల్లలు పుట్టకుండా కాపర్ టి వేయించాడంటూ ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై ఉన్నతాధికారులు ఇప్పటికే విచారణ జరిపారు. శ్రీని వాసులురెడ్డిని సైతం విచారించినట్లు తెలుస్తుంది. అయితే డబ్బుల కోసం మహిళ తనను బెదరిస్తుందని ఉన్నతాధికారుల ముందు వివరిం చాడు. మహిళ ఫిర్యాదు నేపథ్యంలో తొలుత వీఆర్‌కు బదిలీ చేస్తున్నట్లు ఆర్డర్ కాపీ ఇచ్చినప్పటికి కొద్ది సమయంలోనే శ్రీనివాసులు రెడ్డిని సస్పెండ్ చేస్తున్నట్లు కమిషనర్ ప్రకటించారు. ఇదిలా ఉండగా ఈ వ్యవహారంలో మరో కొత్త కోణం వెలుగుచూసింది. ఇన్‌స్పెక్టర్ పోస్టు కోసం రూ. 25లక్షలు చెల్లించాడంటూ వచ్చిన ఆరోపణల నేపథ్యంలో ఉన్నతాధికారులు ఆ దిశగా విచారి స్తున్నారు. ఈ డబ్బులు ఒక అధికారి కార్యా లయంలో పనిచేసే వారికి వెళ్లినట్లు కొన్ని స్క్రీన్‌షాట్లు సైతం ఇప్పటికే పోలీసులకు అందాయి. దీంతో పోలీసులు అంతర్గ తంగా సైతం విచారిస్తున్నారు. మరోవైపు శ్రీనివా సులు రెడ్డి వ్యవహారంపై విచారణకు ఆదేశించడమే కాకుండా ఒక అధికారిని ఇందుకోసం నియ మించారు. 4 నెలల్లోనే శ్రీనివాసులురెడ్డి అర్ధంత రంగా సస్పెన్షన్‌కు గురవ్వడంతో పోలీసు వర్గాల్లో ఈ వ్యవహారం తీవ్ర చర్చానీయం శమైంది.



శ్రీనివాసులురెడ్డి

### ఇన్‌స్పెక్టర్‌గా ముత్తుయాదవ్ నియామకం

జూబ్లీహిల్స్ ఇన్‌స్పెక్టర్‌గా ప్రస్తుతం రాజేంద్రనగర్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న ముత్తు యాదవ్‌ను నియమిస్తూ అధికారులు ఆదేశాలు జారీ చేశారు. ముత్తు యాదవ్ గతంలో సనత్‌నగర్ ఠాణాతో పాటు ఎస్బీలో పనిచేసిన అనుభవం ఉంది. 2007 బ్యాచ్‌కు చెందిన ఆయన నగరం లోని పలు ఠాణాల్లో పనిచేశారు. గురువారం ఆయన బాధ్యతలు స్వీకరించే అవకాశం ఉంది.

## డిప్యూటీ స్పీకర్ నియామకం ఆలస్యంపై ఎఐసిసి చీఫ్ మల్లికార్జునఖర్గే ఆగ్రహం

**హైదరాబాద్, జులై 29,ప్రభాతవార్త :** తెలంగాణ అసెంబ్లీ డిప్యూటీ స్పీరక్ నియామకం జాప్యం పై ఎఐసిసి అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆగ్రహం వ్యక్తంచేశారు. బుధవారం ఇందిరాభవన్‌లో టిపిసిసి సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ముఖ్య అతిథిగాహాజరైన మల్లికార్జునఖర్గే మాట్లాడుతూ మహబూబ్‌నగర్ జిల్లా డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ జాటోత్ రాంచందర్‌నాయక్‌ను శాసనభ డిప్యూటీ స్పీకర్‌గా నియమించకపోవడం అసంతృప్తి వ్యక్తంచేశారు. ఆయనను ప్రస్తుతం డిప్యూటీ స్పీకర్ పదవినుంచి డ్రాప్ చేసి వేరే వారికి ఇచ్చేందుకు కూడా ఆయన సంకేతాలు ఇచ్చారు. రాంచందర్‌నాయక్ మంత్రి పదవిఆశిస్తున్నారు. మంత్రిమండలిలో ఇంకా ఇద్దరికి అవకాశంకల్పించే వీలు ఉంది. మరోవైపు నల్లగొండ జిల్లాలో పార్టీలోజరుగుతున్న క్రమశిక్షణరాహిత్యంపై కూడా ఆయన అసంతృప్తిని వ్యక్తంచేశారు. కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, సామెల్ వ్యవహారం చర్చించారని తెలిసింది. నామినేటెడ్ పోస్టులపై కూడా చర్చజరిగింది. శాసనసభ సమవేశాలు ఆగస్టులో జరగబోతుండటంతో డిప్యూటీ స్పీకర్ నియామకంపై తగిన శ్రద్ధతీసుకోవాలని ఎఐసిసి చీఫ్ ఆదేశించారు.ఈ సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఎఐసిసి ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్, టిపిసిసి చీఫ్ మహేష్‌కుమార్, మంత్రులు భట్టివిక్రమార్క, దామోదర రాజనర్సింహ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి,సీతక్క, సచిన్ సావంత్ వంశీచంద్‌రెడ్డిలు పాల్గొన్నారు.

## భారీ వర్షాలకు ముందస్తు చర్యలు

### దక్షిణ తెలంగాణ విద్యుత్ సంస్థ జితేష్

**హైదరాబాద్, జులై 29,ప్రభాతవార్త :** భారీ వర్షాల నేపథ్యంలో సంస్థ పరిధిలో విద్యుత్ సరఫరాకు ఎటువంటి అంతరాయం కలుగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ సిఎండి జితేష్ వి పాటిల్ సూచించారు. హైదరాబాద్ నుండి బుధవారం నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో మాట్లాడుతూ అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది పూర్తి అప్రమత్తంగా ఉండాలన్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడిన సందర్భాల్లో పూర్తి భద్రతా ప్రమాణాలను పాటిస్తూ యుద్ధ ప్రాతిపదికన పునరుద్ధరణ చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. భారీ వర్షాలు, ఈదురుగాలుల కారణంగా విద్యుత్ వ్యవస్థకు నష్టం వాటిల్లే అవకాశాలను ముందుగానే అంచనా వేసి, అన్ని స్థాయిల్లో అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. ఎక్కడైనా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడితే అధికారులు వెంటనే స్పందించి, క్షేత్రస్థాయిలో పరిస్థితిని సమీక్షించి, పూర్తి భద్రతా ప్రమాణాలతో సాధ్యమైనంత త్వరగా సరఫరాను పునరుద్ధరించాలని ఆదేశించారు. వర్షాలు, బలమైన ఈదురుగాలుల సమయంలో భారీ చెట్లు లేదా కొమ్మలు విరిగి విద్యుత్ లైన్లపై పడే అవకాశం ఉన్న ప్రాంతాలను ముందుగానే గుర్తించి, అవసరమైన నివారణ చర్యలు చేపట్టాలన్నారు. విద్యుత్ లైన్లకు అత్యంత సమీపంలో ఉన్న చెట్లు, ప్రమాదకరంగా మారే కొమ్మలను గుర్తించి సంబంధిత శాఖల సమన్వయంతో సురక్షితంగా తొలగించాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో తక్షణమే స్పందించేందుకు ట్రీ ప్రూనింగ్ మిషన్లు, బకెట్ ల్యాడర్లు, కట్టింగ్ పరికరాలు, వాహనాలు, అవసరమైన విద్యుత్ సామగ్రి, భద్రతా పరికరాలను ముందుగానే సిద్ధంగా ఉంచాలని పేర్కొన్నారు. వర్షాల సమయంలో విద్యుత్ సరఫరా పునరుద్ధరణ ఎంత ముఖ్యమో, సిబ్బంది భద్రత కూడా అంతే ముఖ్యమని వెల్లడించారు. అత్యవసర విధుల్లో పాల్గొనే సిబ్బందికి సేఫ్టీ కిట్లు, హెల్మెట్లు, గ్లౌజులు, సేఫ్టీ షూస్, రెయిన్ గేర్ తదితర వ్యక్తిగత రక్షణ పరికరాలు అందుబాటులో ఉండేలా ఏర్పాట్లు చేయాలని తెలిపారు. ఆపరేషన్స్, మెయింటెనెన్స్ సిబ్బంది తమ పరిధిలోని సబ్‌స్టేషన్లు, ఫీడర్లు, డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు, హెచ్‌టీ/ఎల్‌టీ లైన్లు, విద్యుత్ స్తంభాలు, తీగలను నిరంతరం పర్యవేక్షి ంచాలని దేశించారు.

## తగ్గిన బొగ్గు దిగుమతులు

### 45.4 మిలియన్ టన్నుల మేర విద్యుత్ ప్లాంట్లు సేకరణ

**హైదరాబాద్, జులై 28, ప్రభాతవార్త:** తెలంగాణతో పాటు, దేశంలోని వివిధ థర్మల్ విద్యుత్ ప్లాంట్లు బొగ్గు దిగుమతులను తగ్గించుకున్నాయి. థర్మల్ పవర్ ప్లాంట్లు 2025-26 ఆర్థిక సంవత్సరంలో 45.4 మిలియన్ టన్నుల బొగ్గును దిగుమతి చేసుకోగా, 2024-25లో 62.5 మిలియన్ టన్నుల దిగుమతి చేసుకున్నాయి. ఇది సుమారు 27.4 తగ్గుదలను సూచిస్తుంది. ఈ మేరకు కేంద్ర బొగ్గు, గనుల శాఖ సహాయ మంత్రి సతీష్ చంద్ర దుబే రాజ్యసభలో ఒక లిఖితపూర్వక సమాధానంలో తెలిపారు. అంతేకాకుండా, దిగుమతి చేసుకున్న బొగ్గుతో నడిచే ప్లాంట్లు ఏప్రిల్ 2025లో 3.97 మిలియన్ టన్నుల బొగ్గును దిగుమతి చేసుకోగా, ఏప్రిల్ 2026 నాటికి అది 2.88 మిలియన్ టన్నులకు తగ్గింది. ఇది సుమారు 27.45 శాతం తగ్గుదలను సూచిస్తుంది. విద్యుత్ రంగానికి బొగ్గు దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించడానికి ప్రభుత్వం తీసుకున్న కీలక చర్యల్లో భాగంగా వార్షిక ఒప్పంద పరిమాణం ప్రామాణిక అవసరంలో 100 శాతం వరకు పెంచబడింది. వార్షిక ఒప్పంద పరిమాణం పెంపు వలన దేశీయ బొగ్గు సరఫరా పెరిగి, తద్వారా దిగుమతులపై ఆధారపడటం తగ్గుతుంది. విద్యుత్ రంగంలోని ప్రస్తుత లింకేజ్ హోల్డర్లందరి పూర్తి పవర్ పర్చేజ్ అగ్రిమెంట్ అవసరాన్ని తీర్చడానికి, ట్రిగ్గర్ స్థాయి, వార్షిక ఒప్పంద పరిమాణం స్థాయిలతో సంబంధం లేకుండా బొగ్గు కంపెనీలను అందుబాటులో ఉంచాలని కేంద్రం ప్రభుత్వం నిర్ణయించింది. దేశీయంగా బొగ్గు ఉత్పత్తిని పెంచడం మరియు దేశంలో అనవసరమైన బొగ్గు దిగుమతులను తొలగించడంపై ప్రభుత్వం దృష్టి సారించింది. జీఎస్టీ పరిహార సెస్ తొలగింపు, దిగుమతి బొగ్గుతో పోలిస్తే దేశీయ బొగ్గును పోటీతత్వంగా మార్చింది. అంతేకాకుండా, బొగ్గు ప్రభుత్వ రంగ సంస్థలు, ఇతర విషయాల తో పాటు, ప్రతి రంగానికి వర్తించే నియంత్రణ నిబంధనలను దృష్టిలో ఉంచుకుని, బొగ్గును సరసమైన ధరలకే అందిస్తూనే ఉన్నాయని కేంద్ర మంత్రి వెల్లడించారు.


**తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం వద్ద ఒక క్రొత్త రాజకీయ పార్టీగా రిజిస్ట్రేషన్ కావడానికి జారీచేయబడిన నోటీసు**

(తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘము ఆదేశములతో ప్రచురించబడినది)

తేది: .07.2026

రాజకీయ పార్టీల రిజిస్ట్రేషన్ మరియు గుర్తుల కేటాయింపు ఉత్తర్వు, 2018 యొక్క నిబంధనలకు లోబడి PRK పార్టీ పేరిట అధ్యక్షులు/జనరల్ సెక్రెటరీ అయిన శ్రీ ఎ.ప్రవీణ్ కుమార్ గారు తమ పార్టీని 'రిజర్వ్ గుర్తు లేని రాజకీయ పార్టీగా' తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం వద్ద నమోదు చేసుకొనుటకై అభిలషిస్తున్నట్లు సాధారణ ప్రజానీకానికి తెలియజేసేందుకు ఈ నోటీసు ఇవ్వడమైనది. ఈ పార్టీలో (1) శ్రీ ఎ.ప్రవీణ్‌కుమార్ గారు, అధ్యక్షులు (2) శ్రీ ఎస్.వి.భోపాల్‌రెడ్డి గారు, ఉపాధ్యక్షులు (3) శ్రీమతి ఎ.మహాలక్ష్మి గారు, ప్రధాన కార్యదర్శి మరియు కోశాధికారి ప్రధాన కార్యవర్గ సభ్యులు; మరియు పార్టీ యొక్క ప్రధాన కార్యాలయము ఇం.నం. 2-18/1, అమీన్‌పూర్, HDFC ATM సెంటర్ ఎదుట, ప్రవీణ్‌కుమార్ నిలయం ఎదుట అమీన్‌పూర్. సదరు పార్టీ రిజిస్ట్రేషనుపై ఎవరికైనా ఏ విధమైన అభ్యంతరాలు ఉన్నట్లయితే, అట్టి అభ్యంతరాలను కార్యదర్శి, తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘము, మొదటి అంతస్తు, DTCP భవనము, A.C గార్డ్స్, హైదరాబాద్-500 004 గారికి ఈ ప్రకటన ప్రచురితమైన పదిహేను రోజుల్లోగా పంపవలెను. నిర్ణీత గడువులోగా అభ్యంతరాలు రానియెడల, తెలంగాణ రాష్ట్రములో పార్టీల పరంగా జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీచేసేందుకు PRK పార్టీను ఒక రాజకీయ పార్టీగా నమోదు చేయు ప్రక్రియను రాష్ట్ర ఎన్నికల సంఘం చేపడుతుంది.

సం/- ఎ.ప్రవీణ్‌కుమార్,
అధ్యక్షులు, PRK పార్టీ.



**AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్ (ఒక షెడ్యూల్డ్ కమర్షియల్ బ్యాంక్)**

AU SMALL FINANCE BANK — A SCHEDULED COMMERCIAL BANK

నమోదిత కార్యాలయం: 19-ఎ, ధూలేశ్వర్ గార్డెన్, అజ్మీర్ రోడ్, జైపూర్-302001(CIN:L36911RJ1996PLC011381)

**అనుబంధం IV (నిబంధన 8(1) చూడండి) స్వాధీనతా ప్రకటన**

"ఫిన్‌కేర్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్" ఏప్రిల్ 01, 2024 నుండి "AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్"తో విలీనం అయిందని రుణగ్రహీతలందరికీ మరియు ప్రజలకు తెలియజేయడానికి ఇది. అయితే, కింద సంతకం చేసిన వ్యక్తి "సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రెస్ట్ (యాక్ట్, 2002 (54 ఆఫ్ 2002) కింద AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్ (షెడ్యూల్డ్ కమర్షియల్ బ్యాంక్) యొక్క అధీకృత అధికారి మరియు సెక్యూరిటీ ఇంట్రెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 3తో చదవబడిన సెక్షన్ 13(12) కింద ఇవ్వబడిన అధికారాలను వినియోగించుకుంటూ క్రింద పేర్కొన్న తేదీన డిమాండ్ నోటీసు జారీ చేశారు. ఆ నోటీసు అందిన తేదీ నుండి 60 రోజులలోపు, క్రింద ఇవ్వబడిన పట్టికలో ఇవ్వబడిన వివరాల ప్రకారం, ఆ నోటీసులో పేర్కొన్న మొత్తాన్ని చెల్లించాలి.

| రుణగ్రహీత/సహ-రుణగ్రహీత/ తనఖాదారు/హామీదారు పేరు/రుణ ఖాతా నం. | 13(2) నోటీసు తేది మరియు మొత్తం | స్వాధీనం చేసుకున్న తేది |
|---|---|---|
| (Loan A/C No.) 23630000033967, తిమిడి శ్రీను (రుణగ్రహీత), తిమిడి శైలజ (సహ-రుణగ్రహీత) | 28-జనవరి-26 రూ.14,24,150/-, పద్నాలుగు లక్షల ఇరవై నాలుగు వేల ఒక వంద యాభై రూపాయలు మాత్రమే 27-జనవరి-26 నాటికి | 24-జూలై -26 |
| తనఖా పెట్టిన ఆస్తి వివరణ: 8-6/1 నంబరు గల, 173.06 చదరపు గజాల విస్తీర్ణంలో ఉన్న RCC పైకప్పు కలిగిన ఇల్లు (మరుగుదొడ్లతో) సహా. ఇందులో 302.01 చదరపు అడుగులు మరియు 295.20 చదరపు అడుగుల విస్తీర్ణంలో ACC పైకప్పు ఇల్లు నిర్మాణం కానిటరీ, ఎలక్ట్రికల్ ఫిట్టింగ్‌లు మరియు ఇతర ఆమరికలతో సహా ఉంది. ఈ షెడ్యూల్ ఆస్తి ఖమ్మం జిల్లా, కూసుమంచి రూరల్ SRO పరిధిలోని నేలకొండపల్లి రెవెన్యూ గ్రామం మరియు గ్రామ పంచాయతీ, నేలకొండపల్లి మండలంలో ఉంది. దీని సరిహద్దులు: తూర్పున గ్రామ పంచాయతీ రోడ్డు, పడమరన మారుతి చంద్రమౌళి ఇల్లు, ఉత్తరాన సోమపోయిన స్వరాజ్యం ఇల్లు, దక్షిణాన దేశముఖ్ నరహరిరావు ప్లాట్. | | |
| (Loan A/C No.) 23660002323347, మాసి కోటేశ్వరరావు (రుణగ్రహీత) మాసి అనూష (సహ-రుణగ్రహీత) | 22-ఆగస్టు-25 రూ.7,53,069/-, ఏడు లక్షల యాభై మూడు వేల అరవై తొమ్మిది రూపాయలు మాత్రమే 20-ఆగస్టు-25 నాటికి | 24-జూలై -26 |
| తనఖా పెట్టిన ఆస్తి వివరణ: ఇంటి నంబర్ 1-31 (అసెస్మెంట్ నంబర్ 50), RCC పైకప్పు కలిగిన భవనం (టాయిలెట్లతో సహా) - విస్తీర్ణం 474 చదరపు అడుగులు విద్యుత్ ఫిట్టింగ్‌లు మరియు ఇతర అమరికలతో సహా దీనికి సంబంధించిన 187 చదరపు గజాల విస్తీర్ణం గల స్థలం. ఈ ఆస్తి ఖమ్మం జిల్లా, కూసుమంచి SRO పరిధిలోని నేలకొండపల్లి మండలం, బుద్ధారం గ్రామం మరియు గ్రామ పంచాయతీ పరిధిలో ఉంది. దీని సరిహద్దులు ఈ క్రింది విధంగా ఉన్నాయి: తూర్పున - గ్రామ పంచాయతీ రోడ్డు; పడమరన - ఇతరుల భూమి; ఉత్తరాన - మేళ్లచెరువు సత్యం గారి ఇల్లు; దక్షిణాన - మాసి బాబు గారి ఇల్లు. | | |

రుణగ్రహీత మొత్తాన్ని తిరిగి చెల్లించడంలో విఫలమైనందున, పైన పేర్కొన్న పట్టికలో పేర్కొన్న తేదీలో పేర్కొన్న నియమంలోని సెక్షన్ 13(4)తో పాటు (చట్టం 2002) నిబంధన 8తో చదువబడే అతనికి/ఆమెకు ఇవ్వబడిన అధికారాలను ఉపయోగించి, పైన పేర్కొన్న పట్టికలో వివరించిన ఆస్తిని క్రింద సంతకం చేసిన వ్యక్తి స్వాధీనం చేసుకున్నాడని రుణగ్రహీతకు మరియు ప్రజలకు నోటీసు ఇవ్వబడింది. "సెక్యూర్డ్ ఆస్తులను తిరిగి పొందడానికి అందుబాటులో ఉన్న సమయానికి సంబంధించి, అంటే ఈ సమాచారం నుండి 30 రోజులలోపు, నియమం 8(6)తో పాటు చట్టంలోని సెక్షన్ 13లోని సబ్ సెక్షన్ (8)లోని నిబంధనలకు రుణగ్రహీత దృష్టిని ఆహ్వానించబడ్డాడు".

ముఖ్యంగా రుణగ్రహీత మరియు సాధారణ ప్రజలు ఆస్తితో ఎలాంటి లావాదేవీలు చేయరాదని ఇందుమూలంగా హెచ్చరిస్తున్నారు మరియు ఆస్తితో ఏవైనా లావాదేవీలు పైన పేర్కొన్న పట్టికలో పేర్కొన్న మొత్తం మరియు దానిపై వడ్డీకి AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్ (ఒక షెడ్యూల్డ్ కమర్షియల్ బ్యాంక్) ఛార్జీకి లోబడి ఉంటాయి.

తేది: 29/07/2026 ప్రదేశం : ఖమ్మం, తెలంగాణ — అధీకృత అధికారి, AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్.

వార్త

నిస్వార్థత ఎంత అధికంగా ఉంటుందో,
విజయం అంత అధికంగా లభిస్తుంది.
- రోజర్

# ఉపాధి ఊరట ఎంతదాకా?

ప్రస్తుత వాతావరణ పరిస్థితులకు ఏమాత్రం లొంగిరాని ఎల్‌నినో దెబ్బకు వ్యవసాయ కూలీలకు పనిలేకుండా పోయింది. దాంతో కూలీలు 'జి రాంజీ' ఉపాధి పనులపై దృష్టి పెట్టక తప్పడం లేదు. 'ఎల్‌నినో'తో ఏర్పడిన వర్షాభావ పరిస్థితుల గందరగోళంలో వ్యవసాయ పనులు మందకొడిగా సాగుతున్నాయి. రెండుమూడు రోజుల పాటు వర్షాలు కురిసినా 'వరి' సాగు సజావుగా సాగుతుందన్న నమ్మకం లేదు. ఈ నేపథ్యంలోనే 'వరి' సాగుకు ప్రత్యామ్నాయంగా వేర్వేరు పంటలసాగు లాభసాటియని ఊదరగొడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇప్పటికే ముమ్మర ప్రచారం చేపట్టారు. వారి సూచనలకు బాసటగాభారతీయ వాతావరణ సంస్థ కూడా రైతాంగానికి హెచ్చరికలు జారీ చేసింది. గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు వ్యవసాయమేఆలంబన. కానీ సాగు సాగాలంటే వర్షపాతం బాగా తక్కువగా ఉన్నందున మరో చుక్క వర్షం ఎప్పుడు పడుతుందో ఎలా పడుతుందో అర్థంకాని పరిస్థితులలో వ్యవసాయం మీద 'రిస్క్' చేసి పెట్టుబడి పెట్టేందుకు రైతాంగం జంకుతోంది. వ్యవసాయ కూలీలుగా అలవాటుపడిన వారు కూలిపనిగ్యారంటీ లేక పొలం పనులకు వెళ్లడం తగ్గించారు. స్థానికంగా అమలవుతున్న విబి జీ రాం జీ పనులపట్ల ఆసక్తి చూపిస్తున్నారు. ఈ పథకం కింద ఒక్కో కూలీకి వంద రోజుల నుంచి 125 పనిదినాలకు పెంపు ఉపాధి లభిస్తుంది. వ్యవసాయ పనులు సీజన్‌ల వారీగానే ఉన్నా అనిశ్చితి సమయంలో ఆ పనుల మీద దృష్టి పెట్టి వేరే ప్రభుత్వ పథకాలను వదులుకుంటే ఆ మాత్రం ఉపాధి కూడా దొరకదనే ఆలోచనలతో వ్యవసాయ పనులనే వదులుకుంటున్నారు. సాగు పనులకు అత్యంత కీలకంగా భావించే జులై నెల మరో 2,3 రోజుల్లో ముగియనుంది. తెలంగాణలో గత 2రోజుల్నుంచే వర్షం కురుస్తోంది. మరో పదిరోజుల పాటు కురుస్తుందన్న గ్యారంటీ లేదు. కాగా మంగళవారం ఒక్క రోజే ఈ రాష్ట్ర వ్యాప్తంగా 2 లక్షల 10వేల 592 మంది కూలీలు ఉపాధి కోసం జీ రాంజీ పథకాన్ని ఆశ్రయించారు. దాదాపు తెలంగాణలోని ప్రతి జిల్లా నుంచి లక్షమంది వ్యవసాయకూలీలు ఉపాధి కూలీలుగా మారారు. నల్గొండ జిల్లాలో మాత్రం 1 లక్షా 72వేల 402మంది ఉపాధి పనులకు హాజరయ్యారు. వీరందరిలో ఎవరికీ వ్యవసాయ పనుల ఒత్తిడి కూడాలేదు. గత యేడాది వానాకాలం సీజన్‌లో నెలకు 5 లక్షల నుంచి 8లక్షల మంది వ్యవసాయ పనుల్లోనే జీవనోపాధి పొందేవారు. గతంలో ఉపాధి పనులకు ఎంతో రద్దీ ఉండేది. గత అనుభవాల దృష్ట్యా వ్యవసాయ కూలీలు ఉపాధి పనులకు వెళ్లిపోవడంతో రైతులంతా వ్యవసాయ యంత్ర పరికరాల ద్వారా వ్యవసాయ కార్యాచరణ చేపట్టేవారు. కూలీల అవసరం తగ్గింది. ఏడాదిలో అధిక కాలం పొలం పనుల ద్వారా జీవనోపాధి కల్పించుకునే వారు సైతం ఇప్పుడు రోడ్ మీద పడ్డారు. అప్పట్లో వ్యవసాయ కూలీలు ఉపాధి కూలీ పనులకు మొగ్గుచూపేరు. కొంతకాలం వ్యవసాయ దారుల కూలీల మధ్య సంబంధాలు కూడా మారిపోయాయి. ప్రభుత్వ ఉపాధి పథకాలలో నిర్దిష్ట వేతనం, నిర్ణీత పనివేళలో, కొంతవరకు పనిలో భౌతిక ఒత్తిడి తక్కువగా ఉండటం వల్ల కూలీలు ఉపాధి కూలి పనులకే వెళ్లేవారు. వ్యవసాయ పనులే మర్చిపోయి ఉంటారులే, అని అనిపించేది. ఉపాధి హామీ కూలీల పథకం వచ్చాక రైతు కాస్త కుదేలయ్యాడు. మానవ వనరులు సకాలంలో దొరికేవి కాదు. ఈసారి పరిస్థితులు చక్కబడినవనుకుంటే మళ్లీ సమస్యలు నెత్తిన కూర్చొన్నాయి. సాగు పనిలేని రోజుల్లో కుటుంబ పోషణ కోసం ప్రత్యామ్నాయ ఉపాధి అవసరం. గతంలో ఎంజిఎన్‌రెగా పథకంగా ఉన్న ఈపథకాన్ని తాజాగా విబి జీ రాం జీ పథకంగా మార్చి కొన్ని మార్పులు చేశారు. పంటల సీజన్‌లో రైతులకు అవసరమైన కూలీలు అందుబాటులో ఉంటే మంచిది. వ్యవసాయేతర కాలంలో ఉపాధి పనులను సమన్వయంగా చేసుకుంటే రైతు కూలీలకు నిరంతర ఉపాధి దొరుకుతుంది. ఇప్పుడు వ్యవసాయ పనులు లేకపోవడంతో ఉపాధి కూలీలకు వెళ్లిపోతున్నారు. పల్లెల్లో పనిలేక కొందరు కూలీలు బెంగళూరు, చెన్నై,వంటి ప్రాంతాలకు వలస కూలీలుగా వెళ్లిపోతున్నారు.ఇలా కూలి పనుల తీరు మారడం కొన్ని రోజులు మాత్రమే ఉపాధి లభించడంతో పిల్లల చదువుల మీద దెబ్బతగులుతుంది. గ్రామీణ సమాజంలో సామాజిక ఆర్థికమార్పు కనపడుతున్న రోజుల్లో 'ఎల్‌నినో' ప్రభావం ఎన్నో జీవితాల్లో స్థిరత్వాన్ని మాయం చేస్తోంది. ఎల్‌నినో ప్రభావంతో రేపెపుడో కరువు పరిస్థితులను కూడా ఎదుర్కోవాల్సి వస్తుందనే భయంతో ఉన్నఊళ్లోనే చేతికందిన ఉపాధిని దక్కించుకోవడం వారికి తప్పనిసరి అయింది. ఒకవేళ పంటలు విఫలమైతే ఆదాయం ఉండదని చిన్నకారు, సన్నకారు రైతుల్లో కొందరు కూడా ఉపాధికోసం వెతుక్కోవడమే ఉపాధి వలసలకు కారణం. చెరువుల పూడికతీత,రహదారులనిర్మాణం, భవనాలు, నివాస గృహాల నిర్మాణంలో కూలీల నైపుణ్యాన్ని, మరోమార్గంలోకి మళ్లించాల్సి వస్తోంది. గ్రామీణాభివృద్ధికి వారి కృషి ఉపయోగపడుతుంది. కాగా మరోపక్క 'ఎల్‌నినో' ప్రభావం పంటలు పండకపోవడం, లేదా నాట్లు కుళ్లిపోవడం,చివరి ఎకరానికి నీళ్లు దొరక్కపోవడం పంటలు ఎండిపోవడం వంటి చర్యలవల్లన ఆహార భద్రతకే లోపమేర్పడ్తోంది.ఇప్పుడు ముంచుకొస్తున్న ఎల్‌నినో కానీ, సూపర్ ఎల్‌నినో పరిస్థితులు కానీ గ్రామీణ ఆర్థిక ముఖ చిత్రాన్ని మార్చేస్తున్న తరుణంలో వ్యవసాయ కూలీలకు ప్రత్యామ్నాయం జీ రాంజీ ఉపాధి లభించినా, మరెంతో మంది ఉపాధికి కటకటలాడే పరిస్థితులు దాపురించబోతున్నాయి. వాటి ని ఎదుర్కొనేందుకు ప్రభుత్వాలు ముందుకొచ్చి 'క్లైమేట్ స్మార్ట్ ఉపాధి'కల్పించడానికి ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలి. లేకుంటే లక్షలాది మంది కూలీలు దుర్భర దారిద్ర్యంలోకి వెళ్లిపోయే పరిస్థితులను అంచనా వేసుకోవాలి. 'ఎల్‌నినో' పరోక్షంగా ఎంత మంది జీవితాలను అతలాకుతలం చేస్తుందో, వారినెలా ఆదుకోవాలో ప్రభుత్వాలు ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకోవడం అవసరం.



సంబంధి కాకపోయినప్పటికీ ఎవరు మిత్రభావంతో మసలుతున్నాడో అతడే బంధువు, అతడే మిత్రుడు, అతడే గతి, అతడే ఆశ్రయం.

గోల్డ్‌స్మిత్



సమస్యను చేపట్టేవారి శక్తి సామర్థ్యాలపై వాటి పరిష్కారం ఆధారపడి ఉంటుంది.

స్వామి వివేకానంద

## ప్రజావాక్కు

### న్యాయమూర్తులు ఇలా ఉండాలి

సుప్రీంకోర్టు న్యాయ మూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్ గారు మొన్న మంచి స్టేట్మెంట్ ఇచ్చారు. గంగానది మీద మాంసాహారం తినడం నేరమని, అపవిత్రం అని ఏ రాజ్యాంగంలో ఉందో చెప్పమని సూటిగా ప్రశ్నించాడు. అలాగే రిటైర్ అయిన న్యాయమూర్తులు రాజకీయాలలో ప్రవేశించడం, రాజకీయ పరమైన పోస్టులు తీసుకోవటం కూడా రాజ్యాంగ వ్యతిరేకం అని స్పష్టంగా చెప్పాడు. ఎందుకంటే ఈమధ్య కొన్ని కేసులలో కేంద్రప్రభుత్వానికి అనుకూలంగా తీర్పులు చెప్పినవారికి గవర్నర్ పోస్టులు, ఇతర రాజకీయ పరమైన పోస్టులు వచ్చాయని ( రాజ్య సభ సభ్యులుగా) ప్రజలు భావిస్తున్నారు.న్యాయ వ్యవస్థ మీద ఎలాంటి ప్రలోభాలు ఒత్తిళ్లు ఉండకూడదు.ఉన్నట్లయితే న్యాయం సరిగా జరగదు.

- నార్నె వెంకటసుబ్బయ్య, ప్రకాశం జిల్లా

### ప్రజల ఆరోగ్యంతో చెలగాటం

నేటి సమాజంలో ఆహార కల్తీ ఒక తీవ్రమైన సమస్యగా మారుతోంది. కొందరువ్యాపారులు అధిక లాభాల కోసం తక్కువ ధరకు లభించే నాసిరకం పదార్థాలతో ఆహారాన్ని తయారు చేసి విక్రయిస్తున్నారు.ఇలాంటి ఆహారాన్ని తీసుకోవడం వల్ల ప్రజలు అనేకరకాల అనారోగ్య సమస్యలకు గురవుతున్నారు. సంబంధిత అధికారులు ఎప్పటికప్పుడు తనిఖీలునిర్వహిస్తూ, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకుంటున్నప్పటికీ, కొందరు వ్యాపారులలో మాత్రంమార్పు కనిపించడంలేదు. ప్రతిక్కవ్యాపారి నాణ్యతకు ప్రాధాన్యం ఇచ్చి స్వచ్ఛమైన ఆహారాన్ని అందించడం తన బాధ్యతగా గుర్తించాలి. అలాగే ప్రజలు కూడా ఆహారపదార్థాలను కొనుగోలుచేసే సమయంలో నాణ్యత, పరిశుభ్రతపై శ్రద్ధవహించాలి. ప్రజల అప్రమత్తత,వ్యాపారుల బాధ్యత,అధికారుల నిరంతరపర్యవేక్షణతోనే ఆహార కల్తీనిఅరికట్టిఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించగలం.

- నిమ్మగడ్డ కృష్ణ, హైదరాబాద్

### హక్కులను ఉపయోగించుకోవాలి

మానవ జీవితంలో రాజ్యాంగం కల్పించిన ప్రతి హక్కులను అవసరమైన చోట పూర్తిగా వినియోగించుకోవాలి. ఎక్కడ ఎవరికి కూడా భయపడాల్సిన అవసరం లేదు. నీ హక్కులను పూర్తిగా వినియోగించుకున్నపుడే సాధికారితతో కూడిన జీవితం గడపవచ్చు. మన హక్కులను కాల రాయకుండా వినియోగించుకుందాం.

-మోతె శివకుమార్, రంగారెడ్డిజిల్లా

### దుస్తుల కాలుష్యం

మనదేశంలో అనేక రకాల కాలుష్యాలతో పాటు మనం ధరించే దుస్తుల వల్ల కూడా చెత్త ప్రోగు అవటమే కాకుండా ప్రకృతికి కూడా విపరీతమైన నష్టం జరుగుతోంది. దీనికంతకూ కారణం మనం ధరించే దుస్తుల్లో అధిక శాతం ప్లాస్టిక్‌తో తయారయ్యే పాలియిస్టర్ దుస్తులు.ఇదేకాక ఫ్యాషన్ పేరుతో పార్టీలకనీ, టూర్లకు అనీ అవసరం లేకపోయినా దుస్తులు ఇబ్బడి ముబ్బడిగా కొనుగోలుచేయటం. పూర్వం మనదేశంలో పత్తి నూలుతో తయారయ్యే దుస్తులే ఉండేవి. సాంకేతికత పేరుతో పత్తి నూలుతోపాటు పాలియిస్టర్ నూలు మిళితమైన దుస్తులు అధికంగా ఉత్పత్తి అవుతున్నాయి. పత్తి నూలుతో తయారయ్యే దుస్తులు సులభంగా భూమిలో కలిసిపోతాయి. కొందరైతే దుస్తులు ఒకటి రెండు సార్లు వేసుకుని మూలన పడేస్తున్నారు. వాడేసిన దుస్తులు చెత్తకుప్పలకు చేరుతున్నాయి. పాలియిస్టర్‌దారం మిళిత దుస్తులు భూమిలో కలిసిపోక కాలుష్యకారకం అవుతున్నాయి. ఈకాలుష్యం పెరగకుండా ఉండాలంటే అవసరమైన మేరకే దుస్తులుకొనుగోలు చేయాలి.

- కప్పగంతు వెంకట రమణమూర్తి, సికింద్రాబాద్

### వెంటనే స్పందించాలి

వైద్యవిద్యార్థులకు భారతదేశవ్యాప్తంగా ఉమ్మడిగా నిర్వహించే 'నీట్' పరీక్ష లీక్ కావడం ఎంతో చర్చనీయాంశం అయింది. మొదటగా నీట్ పరీక్ష నిర్వహించి లీక్ అయిన విషయం తెలిసినాక ఆ పరీక్షరద్దు చేసి మళ్లీ పరీక్ష నిర్వహించి ఫలితాలు వచ్చిన తర్వాత మళ్లీ లీక్ అయిందని విద్యార్థులు, కాంగ్రెస్ పార్టీ నాయకులుప్రధాని ఇంటి వద్దనిరసన,ముట్టడి తెలిపినందుకు పోలీసుల ద్వారా గాయాలు అయ్యేదాకా ప్రధాని నోటి మాట రాలేదంటే స్పందన లేదంటే ప్రజాస్వామ్యస్ఫూర్తి ఎటుపోతుందో అర్థంకావడం లేదు.ఇప్పటికైనా ప్రధాని ప్రజాస్వామ్యస్ఫూర్తిని నిలబెట్టి రక్షించాలి.

- బెజుగాం నరేష్, సిద్దిపేట జిల్లా

### షీ టీమ్ తరహాలో వికలాంగుల టీం

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మహిళల రక్షణ కోసం, వారిని వేధింపుల కోసం రక్షించడం కోసం షీటీం ఏర్పాటు చేయడం సంతోషకరం. అదేతరహాలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వికలాంగులకు కూడా రక్షణకల్పించాలి. వారిపై హేళనలు. ఈసడింపులు,దాడులు,దౌర్జన్యాలు,దూషణలు, సూటిపోటీ మాటలు, వైకల్యాలను సూచిస్తూ హేళన చేయడం సమాజంలో జరుగుతుంది వికలాంగుల రక్షణ కోసం రక్షణ కవచంగా కొన్ని టీములు ఏర్పాటు చేయాలి.

- ఈదునూరి వెంకటేశ్వర్లు, వరంగల్‌జిల్లా

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మనవి ఎడిట్ పేజీకి..
ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు
మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్
(e-mail: editpage@vaartha.com)

# ఆశ నిరాశల మధ్య ఆదివాసీల ఊగిసలాట!

**ఆదివాసీల సంక్షేమం అంటే కేవలం పింఛన్లు, సంక్షేమ పథకాలు మాత్రమే కాదు. రాజ్యాంగం కల్పించిన హక్కులను పరిరక్షి ంచడం, ఉపాధి అవకాశాలను కాపాడడం, భూమిని రక్షి ంచ డం, వారి సంస్కృతిని గౌరవించడం కూడా ప్రభుత్వ బాధ్యతే. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అన్నివర్గాల అభివృద్ధికి కట్టుబడి ఉంటామని పలుమార్లు ప్రకటించింది. అదే స్ఫూర్తితో ఆదివాసీల న్యాయమైన ఆందోళనలను కూడా సానుకూలంగా పరిశీలించి, వారి హక్కులు, అవకాశాలు, భవిష్యత్తు దెబ్బతినకుండా చట్టబద్ధమైన చర్యలు తీసుకోవాలని గిరిజన సమాజం ఆశిస్తోంది. ఆదివాసీలు కోరేది ప్రత్యేక హక్కులు కాదు. రాజ్యాంగం కల్పించిన హక్కుల పరిరక్షణ మాత్రమే. అభివృద్ధి పేరిట హక్కులు కోల్పోకుండా, హక్కుల పరిరక్షణతోపాటు అభివృద్ధి కూడా అందేలా ప్రభుత్వం ముందుకు సాగితేనే ఆదివాసి సమాజానికి నిజమైన సామాజిక న్యాయం అందించినట్లవుతుంది.**



ఎస్. సీతారామయ్య

భారత రాజ్యాంగం దేశంలోని బలహీన వర్గాలకు సామాజిక, ఆర్థిక, విద్యాపరమైన న్యాయం అందించాలనే లక్ష్యంతో ప్రత్యేక రక్షణలను కల్పించింది. ఆ రక్షణల్లో ముఖ్యమైనవి ఆదివాసీల హక్కులు అడవిని, భూమిని, ప్రకృతి వనరులను నమ్ముకుని జీవించే ఆదివాసీల జీవన విధానాన్ని, సంస్కృతిని, ఉపాధిని కాపాడేందుకు అనేక ప్రత్యేకచట్టాలు, విధానాలు అమలులోకి వచ్చాయి. అయితే నేడు చట్టం కల్పించిన హక్కులకు భంగం వాటిలే పరిస్థితి ఏర్పడుతోంది. న్యాయపరంగా ఏర్పడిన కొన్ని అంశాలు ఆధారంగా గిరిజనేతరులు వ్యవహరిస్తున్న తీరు ఆదివాసి సమాజం తీవ్ర అన్యాయానికి గురవుతోంది. ఆదివాసీలు రాజ్యాంగం కల్పించిన హక్కులను కాపాడుకోవడానికి పోరుబాట పట్టవలసిన దుస్థితి ఏర్పడింది. ఆదివాసి ప్రాంతాలను పాలన కోసం ప్రత్యేకంగా రాజ్యాంగం 5వ షెడ్యూల్‌లో నియమాలు, నిబంధనలు పొందుపరిచారు. అందులో భాగంగా షెడ్యూల్డ్ ప్రాంత స్థానిక ఆదివాసి అభ్యర్థులతోనే ఉద్యోగాలు భర్తీ చేసేందుకు వీలుగా 2000 సంవత్సరంలో అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జీవో 3ను తీసుకొచ్చి ఉద్యోగ నియామకాల్లో 100శాతం ఆదివాసీలకు రిజర్వేషన్ కల్పిస్తూ వచ్చింది. దీనిని వ్యతిరేకిస్తూ చెబ్రోలు లీలా ప్రసాద్ అనే వ్యక్తి న్యాయస్థానాన్ని ఆశ్రయించి దాఖలు చేసిన కేసులో ఐదుగురు న్యాయమూర్తులతో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం ఏప్రిల్ 2020లో జిఒ నెం.3రద్దు, చేసింది. దాంతో నిరుద్యోగ ఆదివాసీలకు జీవనోపాధితెలుగు రాష్ట్రాలలో ప్రశ్నార్థకంగా మారింది. సుప్రీంకోర్టు తన తీర్పులో రాజ్యాంగ మౌలిక సమాన హక్కులకు విరుద్ధంగా జీవో 3 ప్రభుత్వ ఉత్తర్వులు ఉన్నాయని, నూరు శాతంషెడ్యూల్డ్ ప్రాంత స్థానిక గిరిజన అభ్యర్థులతో పోస్టులు భర్తీ చేయడం రాజ్యాంగ విరుద్ధమని, అందువల్ల చెల్లనేరవని అన్నది. అలాగే ఆర్టికల్ 309 కింద జారీ అయిన ఆంధ్రప్రదేశ్ ఉద్యోగ నియామకాల నియమాలను సవరించే అధికారం ఐదవ షెడ్యూల్ పేరా 5(1)కింద గవర్నరుకు లేదని సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చింది. అప్పటి నుంచి నేటి వరకు కూడా రెండు తెలుగు రాష్ట్రాల్లో పోరాటం చేస్తూనే ఉన్నారు.ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం సాధారణ ఎన్నికలు 2024 ప్రచారంలో భాగంగా అరకు సభలో నేటి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారంలోకి కూటమి ప్రభుత్వం వస్తే మళ్లీ ఆదివాసీలకు ఉద్యోగ నియామకాల్లో 100 శాతం ఆదివాసీలకు రిజర్వేషన్ కల్పిస్తామని హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చి 2సంవత్సరాలు పూర్తయినా అది అమలుకాలేదు. ఆదివాసి సమాజం దానికోసం ఎదురు చూస్తూ ఉంది. ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ మీద నేటికీ కట్టుబడి ఉన్నారు. అయితే న్యాయపరంగా రాబోయే రోజుల్లో ఏవిధమైన ఇబ్బందులు లేకుండా ఆదివాసీలకున్యాయం చేయడం తన బాధ్యతగా ప్రతిసారి వ్యక్తపరుస్తూ అధికారులను ఆదేశిస్తున్నారు. కానీ కార్యరూపం దాల్చడం లేదు. దానికోసం ఆదివాసి సమాజం వేయికళ్లతోఎదురుచుస్తున్నది. అలాగే అటవీ ప్రాంతాల్లో ఆదివాసీల భూముల పరిరక్షణ



కొరకు ప్రత్యేక చట్టాలను తెచ్చారు. అటువంటి చట్టమే షెడ్యూల్డ్ ప్రాంతాల భూ బదలాయింపు రెగ్యులేషన్ 1/70 ఇది షెడ్యూల్డ్ ప్రాంతాల్లో ఆదివాసి భూముల పరిరక్షణకు బలమైన కవచంగా నిలిచి ఉన్నది. నేడు చట్టాని నిర్వీర్యం చేయాలని గిరిజనేతరులు జిఒ నెం.3 మీద ఏవిధంగా అయితే సుప్రీంకోర్టుకి వెళ్ళి రద్దు చేయించారో అదే విధంగా 1/70 యాక్టుని రద్దు చేయించాలని తెలంగాణకు చెందిన ఇతర పిటిషనర్లు సుప్రీం కోర్టును ఆశ్రయించారు. షెడ్యూల్డ్ ప్రాంతాల్లో అనేక గ్రామాలు, మండల కేంద్రాలలో గిరిజనేతరులు అధిక సంఖ్యలో ఉన్నారని వాదిస్తున్నారు. దశాబ్దాలుగా అక్కడ నివసిస్తున్న పేద గిరిజనేతరులకు భూములు కొనుగోలు చేయడానికి లేదా కౌలుకు తీసుకోవడానికి అవకాశం లేకుండాపోయిందని వారు పేర్కొంటూ సుప్రీం కోర్టు ఆశ్రయించారు. ప్రస్తుతం ఈ చట్టం న్యాయ పరిశీలనను ఎదుర్కొంటోంది. దీనితో ఆదివాసి ప్రజల్లో తీవ్ర ఆందోళన కలిగిస్తుంది. సుప్రీంకోర్టు కనుక ఈ చట్టాన్ని రద్దు చేసే ప్రయత్నం చేస్తే మా భవిష్యత్ ఏమిటి అని తీవ్ర ఆందోళనలకు దిగుతున్నారు. అలాగే అల్లూరి సీతారామరాజు జిల్లాను కొత్తగా ఏర్పడిన జోనల్‌లో ఎప్పటి నుండో జోన్ 1లో ఉంది. దానిని తీసుకోనివెళ్లి జోన్ 2లో కలిపారు. దీనివల్ల విద్య, ఉపాధి అవకాశాలలో మరింత వెనుకబడిపోతాం అని ఆదివాసిలో ఆందోళన గురవుతున్నారు. ఈ విధంగా ఆదివాసి సమాజంలో అశాంతి ఏర్పడి కొన్ని ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీలతో కలిసి నేడు పెద్ద ఎత్తున ఆందోళనలకు దిగుతున్నారు. ఆదివాసీలు ప్రస్తుతం ఆదివాసీలు కోరుకునేది జి.ఓ నెం.3 బదులుగా రాజ్యాంగ నిబంధనలు, చట్టాలు, న్యాయపరమైన అంశాలను సమగ్రంగా పరిశీలించి 'షెడ్యూల్డ్ ప్రాంత ఉద్యోగాల నియామక చట్టం' రూపొందించాలని లేక 5వ షెడ్యూల్ క్లాస్2 ప్రకారం ఆదివాసీ ప్రాంతంలో 100శాతం రిజర్వేషన్‌తో ప్రత్యేకఆర్డినెన్స్ ఇచ్చి రాష్ట్రపతి ద్వారా ఆమోదం పొందేలా చేయాలని ఆదివాసీలు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు. అలాగే షెడ్యూల్డ్ ప్రాంతాల భూ బదలాయింపు రెగ్యులేషన్ 1/70చట్టం రద్దు కోరుతూ సుప్రీం కోర్టులో ఉన్న కేసులో ఇంప్లీడ్ పిటిషన్ దాఖలుచేసి చట్టపరిరక్షణ బాధ్యతను స్వీకరించాలని,అల్లూరి సీతారామరాజు జిల్లాను జోన్1లోనే కొనసాగింపు చేయాలని డిమాండ్‌చేస్తూ ఆందోళనలు తీవ్రతరం చేస్తున్నారు.ఈ విషయాలపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి స్పందించి సంబంధిత అధికారులతో సమావేశం ఏర్పాటుచేసి అల్లూరి సీతారామరాజు జిల్లాను జోన్‌లోనే కొనసాగింపు చేసేందుకు వీలుగా అన్ని చర్యలు తీసుకోవాలని ఆదేశాలు ఇచ్చారు. జి.ఓనెం.3 బదులుగా ఆదివాసీలకు శత శాతం రిజర్వేషన్లు ఇవ్వడానికి అన్ని మార్గాలను అన్వేషించి వారికి ఉద్యోగ నియామకాలలో పూర్తిన్యాయం చేయడానికి చర్యలు తీసుకోవాలని అధికారులకు మరోసారి ఆదేశించారు. దీనితో ఆదివాసిసమాజంలో ముఖ్యమంత్రిపై గౌరవం పెరిగింది అయితే కార్యరూపం కోసం ఆదివాసి సమాజం కూటమిప్రభుత్వంపై కోటిఆశలతో ఎదురుచూస్తోంది. ఆదివాసిల సంక్షేమం అంటే కేవలం పింఛన్లు, సంక్షేమ పథకాలు మాత్రమే కాదు. రాజ్యాంగం కల్పించిన హక్కులను పరిరక్షించడం, ఉపాధి అవకాశాలను కాపాడడం, భూమిని రక్షించడం,వారి సంస్కృతిని గౌరవించడం కూడా ప్రభుత్వ బాధ్యతే. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అన్నివర్గాల అభివృద్ధికి కట్టుబడి ఉంటామని పలుమార్లు ప్రకటించింది.అదేస్ఫూర్తితో ఆదివాసీల న్యాయమైన ఆందోళనలను కూడా సానుకూలంగా పరిశీలించి, వారి హక్కులు, అవకాశాలు, భవిష్యత్తు దెబ్బతినకుండా చట్టబద్ధమైన చర్యలు తీసుకోవాలని గిరిజన సమాజం ఆశిస్తోంది. ఆదివాసీలు కోరేది ప్రత్యేక హక్కులుకాదు.రాజ్యాంగం కల్పించిన హక్కుల పరిరక్షణ మాత్రమే. అభివృద్ధి పేరిట హక్కులు కోల్పోకుండా,హక్కుల పరిరక్షణతోపాటు అభివృద్ధి కూడా అందేలా ప్రభుత్వం ముందుకుసాగితేనే ఆదివాసి సమాజానికి నిజమైన సామాజిక న్యాయం అందించినట్లవుతుంది. ●

# యువశక్తి 'భద్రత'కు ప్రామాణికాలు పాటించాలి

జానకి

ఉక్కు నరాలు, ఇనుప కండరాల వజ్ర సంకల్ప మనస్సు గల ఓ వందమంది యువతను నాకివ్వండి. ఈ దేశ తలరాతను, స్వరూప స్వభావాల్నే మార్చేస్తాను' అని స్వామి వివేకానంద అంటారు. అంటే యువత తలచుకుంటే దేన్నైనా సాధించగలదనే నమ్మకంతో ఆయన చెప్పిన మాటలవి. ప్రపంచ జనాభాలో 30 ఏళ్ల వయసు కంటే తక్కువ గలవారు సగానికి పైగా ఉన్నారు. యువశక్తి అపారం. శక్తివంతమైన మానవ వనరు. అలాంటియువశక్తి నేడు నిర్వీర్యమైపోతున్నది.ఒకప్పుడు యువత అంటే 15-25 సంవత్సరాల వయస్సుగలవారు. కానీ నేడు 15-35 యేండ్ల వయస్సు గల వారిని యువతగా పేర్కొంటారు. ఎందుకంటే, ఒకప్పటిలా బాల్య వివాహాలు జరగడం లేదు కాబట్టి. ఇంకా మనిషి జీవన ప్రమాణ స్థాయి పెరిగింది కూడా. ఆరోగ్యమే మహాభాగ్యం అన్నారు పెద్దలు. నేటి యువత మద్యపానం,ధూమపానం, గుట్కా,తంబాకు, గంజాయి, మాదకద్రవ్యాలు, మొదలగు దుర్వ్యసనాలకు బానిసలై శారీరక ఆరోగ్యాన్ని పాడుచేసుకుంటున్నారు. అర్ధరాత్రి, అపరాత్రి అనకుండా స్మార్ట్‌ఫోన్ వినియోగించడంతో నిద్రలేమితో అనారోగ్యం పాలవుతున్నారు. ప్లాస్టిక్ కలసిన ప్యాకేజ్ ఫుడ్స్, వివిధ రసాయనాలు కలగలిపిన జంక్‌ఫుడ్స్ కి ఆకర్షితులై ఎక్కువగా తినడం వల్ల అనేక జబ్బులకు గురవుతున్నారు. ఈ తిండి కూడా వేళాపాళా ఉండటం లేదు.ఏ అర్ధరాత్రి వేళకో! రాత్రి తిండి తింటే ఆరోగ్యంగాఎలా ఉండగలదు?ఇంకా ఇంటి తిండి వదిలేసి, బయట తిండికై అర్రులు చాస్తున్నారు. ఏ పూటలో ఏ ఆహారం తీసుకోవాలి? అన్న ఇంగితం లేక, ఏది పడితే అది తినటం వల్ల అనారోగ్యాన్ని కోరి తెచ్చుకుంటున్నారు. ఇవేకాక పేదరికం వల్ల సరైన పోషకాహారం అందక కూడా యువతీ యువకులు అనారోగ్యం పాలవుతున్నారు. అమ్మాయిలకు బాల్యవివాహాలు చేయడం వల్ల కూడా వారి పునరుత్పత్తి ఆరోగ్యానికి చేటు కలుగుతుంది. మరో ప్రధాన కారణం యువతలో శారీరక శ్రమ, నిర్దిష్ట వ్యాయామం లేకపోవడం. వీటన్నింటివల్ల చిన్న వయస్సులోనే మధుమేహం, రక్తపోటు, గుండెపోటు, ఊపిరితిత్తుల, జీర్ణకోశ, కాలేయ, మూత్రాశయ, నరాల, సుఖ వ్యాధులకులోనై ఆసుపత్రుల పాలవుతున్నారు. ప్రతిరోజూ మందులు వేసుకుంటే గాని బ్రతకలేని పరిస్థితిని కొని తెచ్చుకుంటున్నారు. ఇంకా కేన్సర్, ఎయిడ్స్, హెపటైటిస్ లాంటి ప్రాణాంతక వ్యాధుల బారినపడి అకాల మరణం పొందుతున్నారు. 'కండ కలవాడేను మనిషోయ్ అని మహాకవి గురజాడ అంటారు. నిజానికి కండ కలవాడంటే ఊబకాయం కలవాడు కాదు. ఎటువంటి క్రొవ్వు పేరుకుపోని కండ కలవాడని అర్థం. కానీ దీనికి విరుద్ధంగా నేడు యువత ఊబకాయంతో బాధపడుతున్నారు. వీటన్నింటికీ కారణం తినే పదార్థాలు, చేసే వ్యవహారాలు సరిగ్గా లేకపోవడమే. క్రమశిక్షణ లేని జీవితం మనిషిని పెడత్రోవకు నెడుతోంది. ఇది మనిషి శారీరక, మానసిక ఆరోగ్యం మీద కూడా ఎక్కువ ప్రభావం చూపుతోంది. ఈపరిస్థితి నేటి యువతలో ఎక్కువ శాతం కనిపిస్తోంది.అలాగే చదువు కోసం, ఉపాధికోసం జరిగే వెతుకులాటలో యువతపై తీవ్ర ఒత్తిడిపడుతున్నది. వీరు ఈ ఒత్తిడిని సాధారణంగా తల్లిదండ్రుల నుంచి తోటి సమాజం నుంచి ఎదుర్కొంటున్నారు. దీనివల్ల వీరి మానసిక ఆరోగ్యం క్షీణిస్తున్నది.ఇంకా అతివేగంగా వాహనాలను నడిపి, తమ ప్రాణాలను పణంగా పెడుతున్నది. ఆడ్రైవింగ్ లోనూ రోడ్డు భద్రత నియమాలు పాటించక ప్రమాదాలు కొనితెచ్చుకొని, చివరికి అంగవైకల్యంతోబాధపడుతున్నారు. ఈపరిస్థితి దేనికి సంకేతం? ఇది ఎటు దారితీస్తుంది?అనారోగ్యంతో నీరసించిన యువలోకం దేశాభివృద్ధికి ఏవిధంగా తోడ్పడుతుంది? ఈవిషయమై ప్రభుత్వాలే ప్రధానబాధ్యత వహించాలి. ప్రపంచ ఆరోగ్య సంస్థ యువత ఆరోగ్యంపై ఆందోళన వ్యక్తం చేస్తున్నది. అందువల్ల ఈసంస్థ సూచించే ఆరోగ్య ప్రామాణికాలను ప్రజలకు ఎరుకపరచాలి. ఇవన్నీ దేశంలో పెరుగుతున్న అంటువ్యాధులు, ప్రమాదాలు, గాయాల తీవ్రతను విపరీతంగా తగ్గిస్తాయి. ●

# పర్యావరణ పరిరక్షణకై 'చెత్త'పై పోరాటం

పాపని నాగరాజు

మహారాష్ట్రలోని మోషి వేస్ట్‌టు ఎనర్జీ ప్రాజెక్టు వద్ద భారీ వర్షాలకు ఏళ్ల తరబడి పేరుకుపోయిన లెగసీ వ్యర్థాల కొండ విరిగిపడి పరిపాలనా భవనాన్ని సజీవ సమాధిచేసిన ఘటన దేశాన్ని కుదిపేసింది. ఒక కార్మికుడు ప్రాణాలు కోల్పోయాడు. పలువురు గాయపడ్డారు. కానీ ఈ దుర్ఘటనను కేవలం ప్రకృతి వైపరీత్యంగా చూడడం వాస్తవాన్ని కప్పిపుచ్చడమే అవుతుంది. ప్రకృతి చెత్త కొండలను నిర్మించదు. పాలనా నిర్లక్ష్యం, కార్పొరేట్ లాభాల రాజకీయాలు, శాస్త్రీయ వ్యర్థాల నిర్వహణను నిర్లక్ష్యం చేసిన ప్రభుత్వాలే వాటిని నిర్మిస్తాయి. మోషిలో కూలింది చెత్త కొండ కాదు, ప్రజల భద్రత కంటే లాభాలను ముందుపెట్టిన పట్టణ అభివృద్ధి నమూనా. ఈ హెచ్చరిక మహారాష్ట్రకే పరిమితం కాదు. హైదరాబాద్‌కు ఇది మరింత దగ్గరగా వినిపించాలి. ఎందుకంటే గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ప్రతిరోజూ సుమారు 8,000 టన్నుల మున్సిపల్ ఘన వ్యర్థాలు ఉత్పత్తి అవుతున్నాయని జీహెచ్ఎంసీ స్వయంగా అంగీకరించింది. అంతేకాదు,ఈవ్యర్థాలను ప్రధానంగా జవహర్‌నగర్ సమీకృత వ్యర్థాల నిర్వహణ కేంద్రం పైనే ఆధారపడి నిర్వహించడం ఘన వ్యర్థాల నిర్వహణ నియమాలు 2016కు అనుగుణం కాదని కూడా అధికారికంగా పేర్కొంది. అంటే ప్రమాదం గురించి ప్రజలకు మాత్రమే కాదు, ప్రభుత్వానికి కూడా తెలుసు. అయినప్పటికీ పరిస్థితి ఎందుకు మారడం లేదు? కేంద్ర ప్రభుత్వం అమల్లోకి తీసుకొచ్చిన ఘన వ్యర్థాల నిర్వహణ నియమాలు-2016 స్పష్టంగా చెబుతున్నాయి. చెత్తను మూలం వద్దనే తడి-పొడి-ప్రమాదకర వ్యర్థాలుగా వేరు చేయాలి. నగరాలన్నీ వికేంద్రీకృత వ్యర్థాల నిర్వహణ వ్యవస్థను అభివృద్ధి చేయాలి. శాస్త్రీయ ల్యాండ్‌ఫిల్ చివరి ప్రత్యామ్నాయంగా మాత్రమే ఉండాలి. భారీ చెత్త కొండలను సృష్టించడం ఈ నియమాల ఆత్మకు విరుద్ధం. అయినప్పటికీ హైదరాబాద్‌లో నగరమంతా ఉత్పత్తి చేసే వ్యర్థాలను జవహర్‌నగర్‌కు తరలించే కేంద్రీకృత నమూనా కొనసాగుతూనే ఉంది. ఇదే మోషి వంటి ప్రమాదాలకు పునాది. జవహర్‌నగర్ కథ కొత్తది కాదు. ఒకప్పుడు మన్సూరాబాద్‌లో ప్రజలు చెత్త కాలుష్యాన్ని అనుభవించారు. తర్వాత సమస్యను అక్కడి నుంచి తరలించి జవహర్‌నగర్‌కు చేర్చారు. నగరం పెరిగే కొద్దీ ఆటోనగర్, సనత్‌నగర్, ఇమ్లీబన్ వంటి ట్రాన్స్‌ఫర్ స్టేషన్లు ఏర్పడ్డాయి.కానీ మూల సమస్యమాత్రం అలాగే ఉంది. వరంగల్, ఖమ్మం, కరీంనగర్, నిజామాబాద్, మహబూబ్‌నగర్ వంటి తెలంగాణ నగరాల్లోనూ ఇదే ధోరణి కనిపిస్తోంది. ఒక ప్రదేశం నిండిపోతే మరో ప్రదేశం వెతకడం తప్ప, చెత్త ఉత్పత్తి విధానాన్ని, నిర్వహణ నమూనాను మార్చే ప్రయత్నం కనిపించడం లేదు. ఇక్కడే 'చెత్త రాజకీయం' ప్రారంభమవుతుంది. ప్రతి ఎన్నికల సమయంలో జవహర్‌నగర్ ప్రజలకు హామీలు ఇవ్వని రాజకీయ పార్టీఉండదు. డంపింగ్ యార్డు తరలిస్తామని, కాలుష్యాన్ని నివారిస్తామని, ప్రజల ఆరోగ్యాన్ని కాపాడుతామని చెబుతారు. కానీ అధికారంలోకి వచ్చిన తర్వాత అదే మౌనం.



ఎందుకు? దీనికి సమాధానం కేవలం రాజకీయాల్లో కాదు, రాజకీయ ఆర్థిక వ్యవస్థలో ఉంది. ఒకప్పుడు మున్సిపల్ పారిశుద్ధ్య పనిగా ఉన్న వ్యర్థాల నిర్వహణ ఇప్పుడు వేల కోట్ల రూపాయల ఆర్థిక రంగంగా మారింది. చెత్త సేకరణ, రవాణా, ప్రాసెసింగ్, లీచేట్ శుద్ధి, ల్యాండ్‌ఫిల్ నిర్వహణ, వ్యర్థాల నుంచి విద్యుత్ ఉత్పత్తి, ప్రతిదశలో భారీ కాంట్రాక్టులున్నాయి. జవహర్‌నగర్ సమీకృత వ్యర్థాల నిర్వహణ ప్రాజెక్టులో రామ్కీ ఎన్విరో ఇంజనీర్స్ (ప్రస్తుతం రీ సస్టైనబిలిటీ గ్రూప్‌లో భాగం) దీర్ఘకాలంగా భాగస్వామిగా ఉంది. జీహెచ్ఎంసి రాంకీ భాగస్వామ్యం 2009లో కుదిరిన కన్సెషన్ ఒప్పందం కింద అమలవుతోందని ప్రభుత్వ పత్రాలే చెబుతున్నాయి. ఇక్కడ ఒక ప్రశ్న వేయడం ప్రజాస్వామ్య హక్కు. వేల కోట్ల ప్రజాధనం, దశాబ్దాల ఒప్పందాలు, కార్పొరేట్ భాగస్వామ్యాలు ఉన్న ఈరంగంలో ప్రజారోగ్యం, పర్యావరణ భద్రతకు ప్రాధాన్యం దక్కుతోందా? లేక కాంట్రాక్టుల నిరంతరత్వానికా? ఈ ప్రశ్నను మరింత తీవ్రతరం చేసింది కాగ్ నివేదిక. ప్రాసెస్ చేయని వ్యర్థాలకు కూడా భారీ మొత్తంలో చెల్లింపులు జరిగాయని, పర్యవేక్షణలో తీవ్రమైన లోపాలున్నాయని, నియంత్రణ వ్యవస్థ బలహీనంగా ఉందని అది పేర్కొంది. అంతటితో ఆగలేదు. జవహర్‌నగర్‌లో తాజా వ్యర్థాల డంపింగ్‌పై ఎన్‌జిటి ఇచ్చిన ఆదేశాల అమలులో లోపాలపై జీహెచ్ఎంసి, రాంకీ రెండింటినీ సంయుక్తంగా బాధ్యులుగా పేర్కొంటూ జరిమానా కూడా విధించింది. ఇది కేవలం పరిపాలనా లోపం కాదని, బాధ్యత ప్రశ్నను తప్పించలేమని సూచించే పరిణామం. ఇక్కడితో సమస్య ముగియదు. ఈమొత్తం వ్యవస్థను పర్యవేక్షించాల్సిన ప్రభుత్వ యంత్రాంగం పాత్ర మరింత ఆందోళన కలిగిస్తోంది. ఘన వ్యర్థాల నిర్వహణ నియమాలు 2016 అమలును నిర్ధారించడం స్థానిక సంస్థలతో పాటు తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి టిజిపిసిబిబాధ్యత కూడా. లీచేట్ శుద్ధి, భూగర్భ జలాల నాణ్యత, ల్యాండ్‌ఫిల్ గ్యాస్ నియంత్రణ, గాలి కాలుష్య ప్రమాణాలు, పర్యావరణ అనుమతుల అమలు వంటి అంశాలపై నిరంతర పర్యవేక్షణ జరగాలి. కానీ జవహర్‌నగర్ చుట్టుపక్కల ప్రజలు ఏళ్లుగా దుర్వాసన, కలుషిత నీరు, పొగ,ఈగలు, దోమలు, ఆరోగ్య సమస్యలపై ఆందోళనలు వ్యక్తంచేస్తున్నప్పటికీ,వాటికి తగిన స్థాయిలో శాశ్వత పరిష్కారాలు కనిపించడం లేదు. చెత్తలోని రసాయనాలు, లోహాలు, విషపదార్థాలు కలిసిన ఈ కలుషిత ద్రవం వర్షాల సమయంలో భూమిలోకి ఇంకితే భూగర్భ జలాలు కలుషితమయ్యే ప్రమాదం ఉంది. పర్యావరణ నిపుణులు సంవత్సరాలుగా ఇదే హెచ్చరిక చేస్తున్నారు. పైకి కనిపించేది చెత్త కొండ మాత్రమే.కానీ కింద నిశ్శబ్దంగా కలుషితమవుతున్నది నేల, నీరు, చివరకు ప్రజల ఆరోగ్యం. ఈ కాలుష్యానికి అత్యధిక మూల్యం చెల్లిస్తున్న వారు ఎవరు? నగర సంపదను నిర్మించే శ్రమజీవులే. డంపింగ్ యార్డులు, ట్రాన్స్‌ఫర్ స్టేషన్లు, వ్యర్థాల ప్రాసెసింగ్ కేంద్రాలు ఎక్కు వగా దళితులు, బీసీలు, గిరిజనులు, ముస్లింలు, వలస కార్మికులు, అసంఘటిత రంగ శ్రామికులు నివసించే ప్రాం తాలకే చేరువలో ఉన్నాయి. అదే నగరంలోని అత్యంత ఖరీదైన నివాస ప్రాంతాల్లో ఇలాంటి ప్రాజెక్టులను ఏర్పాటు చేయాలనే ఆలోచనే ఎందుకు రాదు? వ్యాధులు, చర్మసమస్యలు, కలుషిత నీటి ప్రభావాలు అణగారిన వర్గాలకా? ఇదే నేటి చెత్త రాజకీయం. ఈ రాజకీయాన్ని మార్చకుండా డంపింగ్ యార్డులు మారినా, ప్రభుత్వాలు మారినా, ప్రమాదాలు మాత్రం మారవు. అందుకే చెత్తపై పోరాటం పారిశుద్ధం కోసం మాత్రమే కాదు, ప్రజల జీవించే హక్కుకోసం, పర్యావరణ న్యాయం కోసం,రాజ్యాంగబద్ధమైన సమానత్వం కోసం సాగాల్సినప్రజాఉద్యమం. ●

# కేంద్రానికి సుప్రీంకోర్టు షాక్

## పోస్ట్-ఫ్యాక్టో పర్యావరణ అనుమతులకు బ్రేక్

### ఇష్టారాజ్యంగా అనుమతులివ్వడం కుదరదని స్పష్టీకరణ



**న్యూఢిల్లీ, జులై 29:** పర్యావరణ (పరిరక్షణ) చట్టం, 1986లోని సెక్షన్ 3 కింద జారీ చేసిన చెల్లుబాటు అయ్యే చట్టబద్ధమైన నోటిఫికేషన్ల ద్వారా పనులు పూర్తయిన తర్వాత కూడా పర్యావరణ అనుమతులు (ఇసిలు) మంజూరు చేసే అధికారం కేంద్ర ప్రభుత్వానికి ఉన్నప్పటికీ, కేవలం ఒక పరిపాలనా ఆఫీస్ మెమోరాండం ద్వారా అలా చేయలేదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. పర్యావరణ అనుమతులు లేకుండా ప్రాజెక్టులను ప్రారంభించి, ఆ తర్వాత 'పోస్ట్-ఫాక్టో' అనుమతులు పొందే ధోరణికి సుప్రీంకోర్టు చెక్ పెట్టింది. పర్యావరణ పరిరక్షణ చట్టం 1986లోని సెక్షన్-3 కింద చట్టబద్ధమైన గెజిట్ నోటిఫికేషన్ ద్వారా పరిమితంగా ప్రాజెక్టులను క్రమబద్ధీకరించే అధికారం కేంద్ర ప్రభుత్వానికి ఉన్నప్పటికీ, కేవలం ఒక సాధారణ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీస్ మెమోరాండమ్(ఒఎం) ద్వారా ఇష్టారాజ్యంగా అనుమతలు ఇవ్వడం కుదరదని సర్వోన్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్, జస్టిస్ జయమల్య బాగ్చి, జస్టిస్ విపుల్ పంచోలిలతో కూడిన ధర్మాసనం ఈ మేరకు తీర్పును వెలువరించింది. అయితే, ఈ తీర్పుకు భవిష్యత్ ప్రభావం ఉండేలా చూస్తూ, వివాదాస్పద విధానం కింద ఇప్పటికే మంజూరు చేసిన అనుమతులను కోర్టు పరిరక్షించింది. 2021 నాటి పరిపాలనా ఉత్తర్వు (ఒఎం), చట్టబద్ధమైన నోటిఫికేషన్ ద్వారా కాకుండా పరిపాలనా ఉత్తర్వు ద్వారా ఇప్పటికే ఉన్న పర్యావరణ అనుమతి చట్రాన్ని మార్చడానికి ప్రయత్నించినందున, అది 1986 నాటి పర్యావరణ (రక్షణ) చట్టానికి అతీతమైనదని ధర్మాసనం పేర్కొంది. "చట్టబద్ధమైన నోటిఫికేషన్ ద్వారా సవరించనంత వరకు, 2006 నోటిఫికేషన్ ప్రకారం ముందస్తు పర్యావరణ అనుమతి (ఒఎం) విధానం తప్పనిసర్ణి అని తీర్పు వెలువరించిన సమయంలో జస్టిస్ బాగ్చి అన్నారు. తీర్పు వెలువడిన తర్వాత ఇచ్చే పర్యావరణ అనుమతులపై చట్టపరమైన స్థితిని స్పష్టం చేస్తూ, కామన్ కాజ్, అలెంబిక్ ఫార్మాస్యూటికల్స్ కేసులలో తన మునుపటి తీర్పులు అప్పటికి అమలులో ఉన్న చట్టం నేపథ్యంలోనే ఇవ్వబడ్డాయని కోర్టు వ్యాఖ్యానించింది. ఈ తీర్పులు, తగిన సందర్భాలలో పరిమితమైన క్షమాభిక్ష పథకాన్ని రూపొందించే కేంద్ర ప్రభుత్వ అధికారంపై సంపూర్ణ నిషేధాన్ని విధించలేదు. కామన్ కాజ్, అలెంబిక్ కేసులలో, తీర్పు వెలువడిన తర్వాత ఇచ్చే పర్యావరణ అనుమతి అనేది పర్యావరణ న్యాయశాస్త్రానికి "విరుద్ధం్ణ అనే వ్యాఖ్యలను, ముందస్తు పర్యావరణ అనుమతిని తప్పనిసరి చేసిన 2006 పర్యావరణ ప్రభావ అంచనా (ఇఐఎ) నోటిఫికేషన్ చట్టబద్ధమైన నేపథ్యంలో అర్థం చేసుకోవాలని కోర్టు పేర్కొంది.

## ఎన్‌సిఎస్‌సికి ఆ అధికారం లేదు: సుప్రీంకోర్టు




**న్యూఢిల్లీ, జులై 28:** రాజ్యాంగంలోని ఆర్టికల్ 338 ప్రకారం జాతీయ షెడ్యూల్డ్ కులాల కమిషన్ (ఎన్‌సిఎస్‌సి) పాత్ర కేవలం సిఫార్సు, సలహా రూపమే తప్ప, తీర్పు చెప్పేది కాదని పేర్కొంటూ, ఆ కమిషన్ కట్టుబడి ఉండే ఆదేశాలు జారీ చేయలేదని లేదా సేవా వివాదాలను పరిష్కరించలేదని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది. ముంబై పోర్ట్ అథారిటీ ఒక షెడ్యూల్డ్ కుల ఉద్యోగికి పదోన్నతికి సంబంధించిన ఆదేశాలను అమలు చేయాలని, 30 రోజుల్లోగా బకాయిలు చెల్లించాలని ఎన్‌సిఎస్‌సి ఇచ్చిన ఆదేశాన్ని సమర్థించిన బాంబే హైకోర్టు తీర్పును జస్టిస్ సంజయ్ కరోల్, జస్టిస్ ఎ.జి. మసిహ్‌లతో కూడిన ధర్మాసనం కొట్టివేసింది. షెడ్యూల్డ్ కులాల హక్కులు, రక్షణల ఉల్లంఘనకు సంబంధించిన ఫిర్యాదులపై విచారణ జరిపి, సిఫార్సులు చేసే అధికారం ఈ రాజ్యాంగ సంస్థకు ఉన్నప్పటికీ, సేవా విషయాలలో అమలు చేయదగిన ఆదేశాలు జారీ చేయలేదని సుప్రీంకోర్టు పేర్కొంది.

"ఎన్‌సిఎస్‌సి జారీ చేసిన ఆదేశాలు రాజ్యాంగం ప్రకారం కల్పించిన అధికారాల పరిధిలోకి వస్తాయని బొంబాయి హైకోర్టు డివిజన్ బెంచ్ పొరపాటు చేసిందని తాము భావిస్తున్నాము," అని జస్టిస్ కరోల్ నేతృత్వంలోని ధర్మాసనం పేర్కొంది. ఆర్టికల్ 338 కమిషన్‌కు పరిమిత అధికారాలను మాత్రమే కల్పిస్తుందని పేర్కొంది.


## అమెరికాలో రష్యాపై ఆంక్షల బిల్లు..

### భారత్‌పై 100 శాతం టారిఫ్‌ల ప్రభావం?



**వాషింగ్టన్, జులై 29:** ఇంధన ఎగుమతులతో రష్యా ఆర్జిస్తోన్న ఆదాయాన్ని కట్టడి చేసేలా అమెరికా మరిన్ని ఆంక్షలకు సిద్ధమైంది. ఆ ఆంక్షల బిల్లును పరిశీలించేందుకు సెనెట్ సభ్యులు అంగీకరించారు. అది చట్టరూపం దాల్చితే రష్యా చమురును దిగుమతి చేసుకుంటున్న భారత్ వంటి దేశాలపై టారిఫ్‌ల ప్రభావం పడనుంది. ఈ ఆంక్షల బిల్లు ఆమోదానికి సెనెట్‌లో ప్రక్రియ ప్రారంభమైంది. దానిని పరిశీలించేందుకు 86-12 తేడాతో సభ్యులు అంగీకరించారు. సెనెట్‌తోపాటు ప్రతినిధుల సభలోనూ దీనికిఆమోదం లభించాల్సి ఉంది. ఈ దశలు దాటిన తర్వాత అది చట్టరూపం దాల్చుతుంది. అదే జరిగితే.. భారత్, చైనా వంటి దేశాలు 100 శాతం టారిఫ్‌ను ఎదుర్కోవాల్సి ఉంటుంది. రష్యా చమురు, గ్యాస్ కొనుగోలు చేస్తోన్న దేశాల నుంచి దిగుమతి చేసుకునే వస్తువులపై ఈ టారిఫ్‌లను విధించే వెసులుబాటు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు లభించనుంది. 2022 నుంచి ఉక్రెయిన్-రష్యా మధ్య యుద్ధం నడుస్తోంది. ఉక్రెయిన్‌కు ఐరోపా, అమెరికా నుంచి సహాయం అందుతున్నా రష్యాను సైనికంగా, ఆర్థికంగా దెబ్బతీయకపోయాయి. అందుకే ఇంధన ఎగుమతులతో పుతిన్ ప్రభుత్వం ఆర్జిస్తున్న ఆదాయాన్ని టార్గెట్ చేసేందుకు అమెరికా ప్రయత్నిస్తోంది. తాజా ప్రతిపాదనలు కూడా అందులో భాగమే. తమకు మద్దతు ఇవ్వాలని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ అమెరికాలో పర్యటించిన నేపథ్యంలో సెనెట్‌లో ఈ ఓటింగ్ జరగడం గమనార్హం. ఉక్రెయిన్ యుద్ధం ప్రారంభమైన దగ్గరి నుంచి పశ్చిమ దేశాల హెచ్చరికలను పట్టించుకోకుండా రష్యా నుంచి భారత్ చమురు కొనుగోలు చేస్తోన్న సంగతి తెలిసిందే. డిస్కౌంట్ ధరలో భారత రిఫైనరీలకు ముడి చమురు లభిస్తోంది. చైనా, జపాన్‌తోపాటు కొన్నిఐరోపాదేశాలు కూడా ఈ ఇంధనాన్ని కొంటున్నాయి. ఈ బిల్లు ఒకేఅయితే భారత్‌పై పరోక్షంగా టారిఫ్‌ల ప్రభావం పడనుంది. ప్రస్తుతానికి వాణిజ్య ఒప్పందాల్లో ఎలాంటి మార్పులు లేదు.

## హిందూ మహాసముద్రంలో తేలుతున్న స్పేస్ ఎక్స్ స్టార్‌షిప్



**వాషింగ్టన్, జులై 29:** ఇటీవల స్పేస్‌ఎక్స్ ప్రయోగించిన ఓ భారీ స్టార్‌షిప్ వ్యోమనౌక హిందూ మహాసముద్రంలో తేలుతోంది. ఈ విషయాన్ని స్పేస్ ఎక్స్ ధ్రువీకరించింది. విశ్లేషణ కోసం దానిని రికవరీ చేయడానికి తమ బృందాలు ప్రయత్నం చేస్తున్నట్లు తెలిపింది. ప్రయోగం తర్వాత నియంత్రణ లేకుండానే అది సముద్రంలో దిగిందని అయినప్పటికీ అందులో ఎలాంటి సమస్య తలెత్తలేదని పేర్కొంది. దానిని తిరిగి తీసుకురావడానికి ఓ నౌకు పంపుతున్నట్లు స్పేస్‌ఎక్స్ వ్యవస్థాపకుడు ఎలాన్ మస్క్ వెల్లడించారు. స్టార్‌షిప్‌లను పునర్వినియోగించేందుకు వీలుగా తమ సంస్థ చేస్తున్న ప్రయత్నాల్లో ఇదో ముఖ్యమైన మైలురాయి అని పేర్కొన్నారు. ప్రయోగం అనంతరం అంతరిక్షం నుంచి సముద్రంలో దిగడానికి ఎదురైన ఒత్తిళ్లను స్టార్‌షిప్ నిర్మాణం, దాని హీట్ షీల్డ్, ఆన్‌బోర్డు వ్యవస్థలు ఎలా ఎదుర్కొన్నాయనే విషయాన్ని శాస్త్రవేత్తలు పరిశీలించనున్నారు. రికవరీ బృందం స్టార్‌షిప్‌నకు సంబంధించిన చిత్రాలను సేకరిస్తోందని.. కీలక వ్యవస్థల పరిస్థితిని నిర్ధారించడంలో ఇవి సహాయపడతాయని స్పేస్‌ఎక్స్ పేర్కొంది.

**ఏమిటీ స్టార్‌షిప్?:** చంద్రుడు, అంగారకుడు అంతకు మించిన అంతరిక్ష యాత్రల కోసం స్పేస్ ఎక్స్ అభివృద్ధి చేస్తున్న రాకెట్ ఈ స్టార్‌షిప్. దాని సూపర్ హెవీ బూస్టర్‌తో కలిపినప్పుడు ఇది సుమారు 123 మీటర్ల ఎత్తు ఉంటుంది. వ్యోమగాములను చంద్రునిపైకి తీసుకువెళ్లేందుకు నాసా చేపట్టిన ఆర్టెమిస్ కార్యక్రమంలో ఇది కూడా కీలక పాత్ర పోషించనుంది. గతంలో ప్రయోగించిన స్టార్‌షిప్ నమూనాలు పరీక్షల సమయంలోనే ధ్వంసం కాగా ఈ ప్రయోగం అనంతరం కూడా సముద్రంలో యాక్టివ్‌గా ఉండడం గమనార్హం.

## భర్తను నెలవారీ లీజుకు ఇచ్చిన భార్య

### థాయిలాండ్‌లో ఘటన

### సోషల్ మీడియాలో వైరల్

**బ్యాంకాక్, జులై 29:** థాయిలాండ్‌కు చెందిన ఖున్ క్వాంగ్ (31) అనే మహిళ, ఒక పోలీస్ అధికారిని పదేళ్ల క్రితం ప్రేమించి పెళ్లి చేసుకుంది. వీరికి 8 ఏళ్ల కుమారుడు కూడా ఉన్నాడు. చాలా కాలం పాటు వీరి కాపురం ఎంతో సంతోషంగా సాగింది. ఇటీవల భర్త ప్రవర్తనలో మార్పు రావడం, రాత్రివేళల్లో ఆలస్యంగా ఇంటికి రావడం గమనించిన క్వాంగ్‌కు అనుమానం వచ్చింది. ఆరా తీయగా, ఒక అపరిచిత మహిళ సోషల్ మీడియాలో తన భర్తను నిరంతరం ఫాలో అవుతుండటం చూసింది. అసలు నిజం తెలుసుకోవడానికి ఆమె ఒక ప్రైవేట్ డిటెక్టివ్‌ను నియమించింది. విచారణలో తన భర్త మరో మహిళతో అక్రమ సంబంధం పెట్టుకుని, ఆమెతో కలిసి ఒక అపార్ట్‌మెంట్‌లో నివసిస్తున్నట్లు డిటెక్టివ్ ఆధారాలతో సహా బయటపెట్టాడు. దీంతో సదరు భర్త ఇంటికి వచ్చి, 'నాకు ఈ సంసారం వద్దు.. ఇల్లు, కారు, అప్పులు అన్నీ నీకే ఇచ్చేస్తున్నా.. నేను ఆమెతోనే ఉంటా్ణ అంటూ కట్టుబట్టలతో వెళ్ళిపోయాడు. భార్య సదరు ప్రియురాలి ఇంటికెళ్లి, భర్తకు సర్దిచెప్పి ఇంటికి రప్పించింది. అయితే, 'ఆమెను (ప్రియురాలిని) మర్చిపోలేకపోతున్నాను, ఆమె లేకుండా ఉండలేన్ణు అని భార్య ముందే భర్త ఆవేదన వ్యక్తం చేశాడు. ఇక చేసేదేమీ లేక, ప్రియురాలికి ఫోన్ చేసి, 'నీకు నా భర్త కావాలి, నా భర్తకు నువ్వు కావాలి. కాబట్టి నా భర్తను నీకు అద్దెకు (లీజుకు) ఇస్తాను. కానీ దానికి ప్రతిఫలంగా నెలకు 30,000 థాయ్ బాట్లు (సుమారు రూ.85,000) నాకు చెల్లించాలి. అప్పుడు అతడు నీతోనే ఉండవచ్చు. కానీ నేను చట్టపరంగా విడాకులు మాత్రం ఇవ్వన్ణు అని పేర్కొంది. ఆమె ఆఫర్ విన్న ప్రియురాలు సమ్మతించింది. 'నాకు డబ్బు సమస్య కాదు, అద్దె కట్టడానికి నేను సిద్ధం్ణ అని తెలిపింది. అయితే, సదరు భర్త మాత్రం భార్య అగ్రిమెంట్‌ను నిరాకరించాడు. ప్రస్తుతం ఈ వింత 'హజ్బెండ్ లీజ్ అగ్రిమెంట్ణ్ (భర్త అద్దె ఒప్పందం) వార్త సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.



## కోల్ స్కామ్ కేసులో మన్మోహన్‌కు క్లీన్‌చిట్

### 2015లో జారీ చేసిన సమన్లు కొట్టేసిన సుప్రీంకోర్టు

**న్యూఢిల్లీ, జులై 29:** బొగ్గు బ్లాకుల కేటాయింపుల కేసులో దివంగత మాజీ ప్రధానమంత్రి డాక్టర్ మన్మోహన్ సింగ్‌కు బుధవారం అధికారికంగా విముక్తి లభించింది. విచారణను ఎదుర్కోవాలని కోరుతూ 2015లో ప్రత్యేక సిబిఐకోర్టు జారీ చేసిన ఉత్తర్వులను సుప్రీంకోర్టు కొట్టివేసింది. సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సిబిఐ) ముగింపు నివేదికలు ఆయనకు క్లీన్ చిట్ ఇచ్చాయని, వాటిని తిరస్కరించడానికి బలమైన కారణాలు లేవని పేర్కొంది. భారత ప్రధాన న్యాయమూర్తి (సిజెఐ) సూర్యకాంత్, జస్టిస్‌లు జయమల్య బాగ్చీ, వి.మోహనలతో కూడిన ధర్మాసనం, సింగ్ అప్పీల్‌ను అనుమతించి, సిబిఐ ముగింపు నివేదికలను తిరస్కరించి, అవినీతి నిరోధక చట్టం కింద మాజీ ప్రధానిపై అభియోగాలు మోపిన పాటియాలా హౌస్ కోర్టుల ప్రత్యేక న్యాయమూర్తి మార్చి 11, 2015నాటి ఉత్తర్వును రద్దు చేసింది. దశాబ్దానికి పైగా గడిచిన తర్వాత ఆ ముగింపు నివేదికలను అంగీకరించిన సుప్రీంకోర్టు, ఇప్పుడు దివంగత మాజీ ప్రధానిపై ఉన్న క్రిమినల్ విచారణను ముగించింది.



## మళ్లీ పోరాటానికి సిద్ధం

### జంతర్‌మంతర్ అరెస్టులపై కేసులు ఇంకా ఎత్తివేయలేదు: సిజెపి సౌరవ్‌దాస్

**న్యూఢిల్లీ,జులై 29:** నీట్ ప్రశ్నాపత్రం లీక్ వ్యవహారంపై చేపట్టిన ఉద్యమాన్ని విరమించిన కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) మరోసారి కేంద్ర ప్రభుత్వానికి హెచ్చరికలు జారీ చేసింది. శాంతియుతంగా నిరసన తెలిపిన విద్యార్థులపై నమోదైన ఎఫ్ఐఆర్‌లను ఉపసంహరిస్తామని ఇచ్చిన హామీ అమలు కాకపోతే దేశవ్యాప్తంగా మళ్లీ ఆందోళనలు ప్రారంభిస్తామని స్పష్టం చేసింది. సుప్రీంకోర్టు తాజా వ్యాఖ్యలను సాకుగా చూపుతూ ప్రభుత్వం హామీల నుంచి తప్పించుకోవాలని చూస్తోందని ఆరోపించింది. నిరసనకారులపై కొత్త ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయబోమని, ఇప్పటికే నమోదైన కేసులను కూడా ఉపసంహరిస్తామని ప్రభుత్వం బహిరంగంగా హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. అయితే ఇప్పుడు కేసు కోర్టు పరిధిలో ఉందని చెబుతూ ఆ హామీ అమలును వాయిదా వేస్తోందని విమర్శించారు. సుప్రీంకోర్టు శాంతియుత నిరసనకారులపై బలవంతపు చర్యలు తీసుకోవద్దని స్పష్టం చేసిందని సౌరవ్ దాస్ చెప్పారు. నేరచరిత్ర లేని నిర్బంధితులను విడుదల చేయాలని కూడా ఆదేశించిందన్నారు. ఇప్పటికే నమోదైన ఎఫ్ఐఆర్‌లపై దర్యాప్తు కొనసాగించవచ్చని కోర్టు పేర్కొన్న విషయాన్ని ప్రభుత్వం తనకు అనుకూలంగా మార్చుకుం టోందని ఆరోపించారు. మంగళవారంలోగా ఈ విషయంపై కేంద్రం నుంచి లిఖితపూర్వక హామీ వస్తుందని ఆశించామని, కానీ అలాంటి సమాచారం ఇప్పటివరకు అందలేదని సౌరవ్ దాస్ తెలిపారు.

## కేసుల ప్రస్తావన సమయంలో లైవ్‌స్ట్రీమ్ ఆడియో మ్యూట్ చేయాలి

### సుప్రీంకోర్టు ఆదేశం

**న్యూఢిల్లీ, జులై 29:** భారత ప్రధాన న్యాయమూర్తి ఎదుట కొత్త విషయాల ప్రస్తావనల సమయంలో, తన లైవ్ వీడియో ఫీడ్ ఆడియోను మ్యూట్ చేయాలని సుప్రీంకోర్టు బుధవారం ఆదేశించింది. దీనివల్ల, అత్యవసరంగా కేసులను విచారణకు తీసుకోవాలని న్యాయవాదులు చేసే అభ్యర్థనలు, కోర్టు ఇచ్చే మౌఖిక సమాధానాలు ప్రజలకు, మీడియాకు వినిపించకుండా నిరోధించవచ్చు. అత్యవసర విషయాల ప్రస్తావన అనేది న్యాయపరమైన ప్రక్రియ కాదని, అది ఒక 'పరిపాలన్ణా చర్య అని, అందువల్ల దానిని ప్రసారం చేయకూడదని భారత ప్రధాన న్యాయమూర్తి వ్యాఖ్యానించిన కొద్ది రోజులకే ఈ నిర్ణయం వెలువడింది. ఈ తాజా ఆదేశం, కొత్త కేసుల ప్రస్తావనల సమయంలో జరిగే చర్చలు ఇకపై కోర్టు లైవ్‌స్ట్రీమ్‌లో వినిపించకుండా చేయనున్నారు. ఈ ఆదేశంతో పాటు కోర్టు వివరణాత్మక బహిరంగ వివరణను జారీ చేయనప్పటికీ, ఇటువంటి పరిపాలనాపరమైన చర్యలను నివేదించదగిన న్యాయపరమైన కార్యకలాపాలుగా పరిగణించకూడదని ప్రధాన న్యాయమూర్తి గతంలో చేసిన వ్యాఖ్యల నేపథ్యంలోనే ఈ చర్య తీసుకున్నారు.

## యేడేళ్లు నివసిస్తే చాలు..అమెరికాలో గ్రీన్‌కార్డు..

### కొత్తబిల్లును ప్రవేశపెట్టిన డెమొక్రాట్ సెనేటర్




**వాషింగ్టన్,జులై 29:** అమెరికాలో శాశ్వత నివాసం (గ్రీన్ కార్డ్) కోసం దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న లక్షలాది మంది వలసదారులకు, ముఖ్యంగా భారతీయులకు ఆశలు రేకెత్తించే ఓ కీలక పరిణామం చోటుచేసుకుంది. సుదీర్ఘకాలంగా దేశంలో నివసిస్తున్న వారికి గ్రీన్ కార్డ్ పొందేందుకు వీలు కల్పించే ఒక కొత్త బిల్లును అమెరికా సెనేట్‌లో తిరిగి ప్రవేశపెట్టారు. ఇది చట్టంగా మారితే, ముఖ్యంగా హెచ్1బీ వీసాలపై ఉండి గ్రీన్ కార్డ్ బ్యాక్‌లాగ్‌లో చిక్కుకుపోయిన భారతీయ నిపుణులకు భారీ ఊరట లభించే అవకాశం ఉంది.

కాలిఫోర్నియాకు చెందిన డెమొక్రటిక్ సెనేటర్ అలెక్స్ పడిల్లా, రిన్యూయింగ్ ఇమ్మిగ్రేషన్ ప్రొవిజన్స్ ఆఫ్ ది ఇమ్మిగ్రేషన్ యాక్ట్ ఆఫ్ 1929 పేరుతో ఈ బిల్లును మరోసారి సెనేట్ ముందుకు తెచ్చారు. అమెరికా ఇమ్మిగ్రేషన్ అండ్ నేషనాలిటీ చట్టంలోని సెక్షన్ 249లో ఉన్న రిజిస్ట్రీ అనే నిబంధనను సవరించడం ఈ బిల్లు ముఖ్య ఉద్దేశం. ప్రస్తుత చట్టం ప్రకారం 1972 జనవరి 1కు ముందు అమెరికాలోకి ప్రవేశించిన వారు మాత్రమే ఈ నిబంధన కింద గ్రీన్ కార్డ్ కోసం దరఖాస్తు చేసుకోవడానికి అర్హులు. గత 50ఏళ్లుగా ఈ తేదీ మారకపోవడంతో ఈ మార్గం దాదాపు నిరుపయోగంగా మారింది. తాజా ప్రతిపాదన ప్రకారం ఈ పాత తేదీని తొలగించి, దాని స్థానంలో సరికొత్త నిబంధనను తీసుకువస్తారు. దీని ప్రకారం ఎలాంటి నేరచరిత్ర లేకుండా, చట్టపరమైన ఇతర షరతులను సంతృప్తి పరిచే వలసదారులు, దరఖాస్తు చేసుకునే నాటికి కనీసం ఏడు సంవత్సరాలుగా నిరంతరాయంగా అమెరికాలో నివసిస్తూ ఉంటే గ్రీన్ కార్డ్‌కు అర్హులవుతారు.

## బాబ్రీ మసీదు కూల్చివేతను వ్యతిరేకించడం దేశ వ్యతిరేక చర్య కాదు

### బాంబే హైకోర్టు కీలక వ్యాఖ్యలు

**ముంబై, జులై 29:** అయోధ్యలోని బాబ్రీ మసీదును కూల్చివేతను వ్యతిరేకించడమన్నది 'దేశ వ్యతిరేక చర్య' కిందకు రాదని బాంబే హైకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. సోషల్ డెమొక్రటిక్ పార్టీ ఆఫ్ ఇండియా (ఎస్‌డిపిఐ)కి చెందిన ఇద్దరు సభ్యులపై ముంబై పోలీసులు జారీ చేసిన నగర బహిష్కరణ ఉత్తర్వులను రద్దు చేసింది. కాగా ఎస్‌డిపిఐ కార్యకర్తలు ఫిరోజ్ అబ్దుల్ వహాబ్ ఖాన్, మహమ్మద్ రఫిక్ గులాం రసూల్ అన్సారీలను ఏడాది కాలంపాటు నగరం నుంచి బహిష్కరిస్తూ ముంబై పోలీసులు 2025 డిసెంబర్ 3న ఉత్తర్వులు జారీచేశారు. వక్ఫ్ సవరణ బిల్లు, చెంబూర్ గోవండి ప్రాంతంలోని సిమెంట్ గోడౌన్‌ల వల్ల కలుగుతున్న వాయు కాలుష్యం, బాబ్రీ మసీదు కూల్చివేతకు వ్యతిరేకంగా చేపట్టిన నిరసనలకు సంబంధించి 2024, 2025 సంవత్సరాల్లో నమోదైన మూడు ఎఫ్ఐఆర్‌ల ఆధారంగా పోలీసులు ఈ చర్య చేపట్టారు. ఈ ఉత్తర్వులను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లను విచారించిన జస్టిస్ మాధవ్ జమ్దార్ పోలీసుల చర్యలపై తీవ్ర అసహనం వ్యక్తంచేశారు. 'వారి అభిప్రాయం ప్రకారం, బాబ్రీ మసీదును కూల్చివేసి ఉండకూడదు. అది వారి వ్యక్తిగత అభిప్రాయం. అది దేశవ్యతిరేక చర్య ఎలా అవుతుంది? ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరికీ భిన్నాభిప్రాయాలు కలిగిఉండే హక్కు ఉంది'అని జస్టిస్ జమ్దార్ వ్యాఖ్యానించారు. కేవలం ఊహాజనిత భయాల ఆధారంగా పౌరుల ప్రాథమిక హక్కులను హరించలేమని, నగర బహిష్కరణ అనేది అసాధారణ చర్యఅని, ఇటువంటి సందర్భాల్లో చట్టపరమైన నిబంధనలను కచ్చితంగా పాటించాలని న్యాయస్థానం తేల్చిచెప్పింది.

## పేపర్ లీక్‌కేసులో కీలక నిందితుడి అరెస్టు

### పరీక్షకు ముందే రూ.1.2 కోట్లు వసూలు చేసినట్లు వెల్లడి

**పాట్నా,జులై 29:** బీహార్‌ను కుదిపేసిన బీపీఎస్‌సీ టీచర్ రిక్రూట్‌మెంట్ (టీఆర్‌ఈ3) పేపర్ లీక్ కేసులో ఆర్థిక నేరాల విభాగం (ఈవోయూ) దర్యాప్తును వేగవంతం చేసింది. ఈ కుంభకోణంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న డాక్టర్ మనీశ్ కుమార్‌ను అధికారులు అరెస్ట్ చేశారు. పరీక్షకు ముందే 30 మంది అభ్యర్థులకు ప్రశ్నాపత్రాలు అందించి, సుమారు రూ.1.2 కోట్లు వసూలు చేసినట్లు దర్యాప్తులో తేలింది. ఈవోయూ అధికారుల కథనం ప్రకారం డాక్టర్ మనీశ్ కుమార్ ఎలాంటి ఆనవాళ్లు లేకుండా సీల్డ్ ప్రశ్నాపత్రాల బాక్సులను తెరిచి, తిరిగి మూసివేయడంలో నైపుణ్యం సంపాదించాడు.

## ఎమర్జెన్సీలో నన్ను కూడా పలుసార్లు అరెస్టులు చేసారు

### రాజ్యసభలో విపక్ష సభ్యుల విమర్శలపై మంత్రి జెపి నడ్డా కౌంటర్



**న్యూఢిల్లీ,జులై 29:** రాజ్యసభలో బుధవారం ఢిల్లీ పోలీసుల చర్యలపై అధికార, ప్రతిపక్షాల మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. కేంద్ర మంత్రి జెపినడ్డా మాట్లాడుతూ, తాను కూడా ఒకప్పుడు విద్యార్థి నాయకుడినేనని గుర్తుచేశారు. ఎమర్జెన్సీ కాలంలో పలుమార్లు అరెస్టయ్యానని చెప్పారు. చట్టాన్ని అమలు చేయడం పోలీసుల బాధ్యతని పేర్కొన్నారు. ఉద్యమాల్లో పాల్గొనాలనుకునే విద్యార్థులు పోలీసు చర్యలను కూడా ఎదుర్కోవాల్సి ఉంటుందని వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలతో ప్రతిపక్ష సభ్యులు మరింత ఆగ్రహం వ్యక్తం చేశారు. సభలో నినాదాలు కొనసాగడంతో గందరగోళం నెలకొంది. చివరకు ఛైర్మన్ సభను మధ్యాహ్నం వరకు వాయిదా వేశారు. ఢిల్లీలోని సీపీఎం కేంద్ర కార్యాలయంలోకి పోలీసులు వెళ్లి మాజీ జేఎన్‌యూ విద్యార్థి సంఘం అధ్యక్షురాలు ఐషే ఘోష్‌ను అరెస్టు చేసేందుకు ప్రయత్నించిన ఘటనను ప్రతిపక్ష సభ్యులు ప్రస్తావించారు. ఈ సందర్భంగా సభలో ఆందోళన, నినాదాలు కొనసాగాయి. దీనిపై స్పందించిన రాజ్యసభ సభానేత, కేంద్ర మంత్రి జేపీ నడ్డా చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి. ఉద్యమాలు చేయాలనుకునే ఏ విద్యార్థైనా పోలీసులను ఎదుర్కోవాల్సిందే అని అన్నారు. సీపీఎం సభ్యుడు జాన్ బ్రిట్టాస్ ఈ అంశాన్ని సభ దృష్టికి తీసుకొచ్చారు. జంతర్‌మంతర్‌లో జరిగిన విద్యార్థుల నిరసనలో పాల్గొనడమే ఐషే ఘోష్ చేసిన తప్పని పేర్కొన్నారు. 2020-21 కేసులను చూపిస్తూ పోలీసులు ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండానే జాతీయ రాజకీయ పార్టీ కార్యాలయంలోకి వెళ్లడం ఆందోళన కలిగించే విషయమని అన్నారు. ఈ ఘటనపై కేంద్ర హోంమంత్రి వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే కూడా దీన్ని ఖండిస్తూ, పార్టీ కార్యాలయంలోకి వెళ్లి నాయకురాలిని అరెస్టు చేయడానికి ప్రయత్నించడం సిగ్గుచేటని అన్నారు. సంబంధిత పోలీసు అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

## సంక్షిప్త వార్తలు

### వయస్సు నిర్ధారణకు ఆధార్ ప్రమాణం కాదు: ఛత్తీస్‌గఢ్ హైకోర్టు

**రాయ్‌పూర్, జులై 29:** మోటారు ప్రమాద పరిహార క్లెయిమ్‌ల కేసుల్లో బాధితుల లేదా క్లెయిమ్ దారుల వయస్సును నిర్ధారించడానికి ఆధార్ కార్డును ఒక నమ్మదగిన అధికారిక పత్రంగా పరిగణించలేమని ఛత్తీస్‌గఢ్ హైకోర్టు స్పష్టం చేసింది. వయస్సు నిర్ధారణకు సంబంధించి కేవలం ఆధార్ కార్డుపై ఉన్న వివరాలను మాత్రమే ప్రామాణికంగా తీసుకోలేమని ఉన్నత న్యాయస్థానం కీలక వ్యాఖ్యలు చేసింది. ఈ మేరకు జస్టిస్ సంజయ్ కె. అగర్వాల్‌తో కూడిన న్యాయస్థానం ఒక మోటారు వాహన ప్రమాద బీమా కేసు విచారణ సందర్భంగా ఈ సంచలన తీర్పును వెలువరించింది.

### తమిళనాడు విద్యార్థులకు చికెన్ బిర్యానీ!



**చెన్నై,జులై 29:** పాఠశాల విద్యార్థులకు మరింత పౌష్టికాహారం అందించడంతో పాటు భోజనాన్ని ఆసక్తికరంగా మార్చేందుకు తమిళనాడులోని విజయ్ ప్రభుత్వం ఒక కీలక ప్రతిపాదనను పరిశీ లిస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకంలో భాగంగా వారానికి ఒకసారి చికెన్ బిర్యానీ అందించే అంశాన్ని ప్రభుత్వం తీవ్రంగా యోచిస్తోంది. ఈ ప్రతిపాదనకు ఆమోదం లభిస్తే, దేశంలోనే సుదీర్ఘకాలంగా అమలవుతున్న ఈ పథకంలో ఇదొక ముఖ్యమైన మార్పు అవుతుంది. ప్రస్తుతం ఈ ప్రతిపాదన ప్రభుత్వ పరిశీలనలో ఉంది.

### జపాన్ భూకంపంలో 13 మంది మృతి, వందల మందికి గాయాలు



**టోక్యో,జులై 29:** జపాన్ నైరుతి ప్రాంతంలోని క్యుషూ ద్వీపాన్ని మంగళవారం సాయంత్రం సం భవించిన 7.1 తీవ్రత గల భారీ భూకంపం అతలాకుతలం చేసింది. ఈ ఘటనలో ఇప్పటివరకు కనీసం 13 మంది మృతి చెందగా, వందల మంది గాయపడ్డారు. పలువురు ఇంకా శిథిలాల కింద చిక్కుకుని ఉండడంతో సహాయక బృందాలు రాత్రంతా సహాయక చర్యలు కొనసాగించాయి. ఈ విషయాన్ని జపాన్ ప్రధాని సనాయే తకైచి బుధవారం వెల్లడించారు. స్థానిక కాలమానం ప్రకారం మంగళవారం సాయంత్రం 4:27 గంటలకు కుమమోటో ప్రాంతంలో భూకంపం సంభవించింది. రిక్టర్ స్కేలుపై దీని తీవ్రత 7.1గా నమోదైంది.

### బస్సుడ్రైవర్ ఇంట్లో పెద్ద ఎత్తున బంగారం, నోట్ల కట్టలు

**బీర్‌భూమ్(బెంగాల్),జులై 29:** పశ్చిమబెంగాల్‌లో బస్సు డ్రైవర్‌ఇంట్లో పెద్దఎత్తున నోట్ల కట్టలు, బంగారం బిస్కెట్లు బయటపడ్డాయి. ఇసుక, క్వారీ మాఫియా పై దర్యాప్తులో భాగంగా చేపట్టిన సోదాల్లో ఈ సొమ్మును పోలీసులు గుర్తించారు. ఇప్పటివరకు రూ.5.5 కోట్ల నగదు, 15 కిలోల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. బీర్‌భూమ్ జిల్లాకు చెందిన మీనా మండల్ నివాసంలో పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఇసుక మాఫియాపై దర్యాప్తులో భాగంగా పక్కా సమాచారంతో ఈ సోదాలు జరిపారు. ఈ క్రమంలోనే అతడి ఇంట్లో భారీగా అక్రమ నగదు బయటపడింది.




### ఒక అధికారికి ఇకపై ఒకే ప్రభుత్వ కారు

**న్యూఢిల్లీ,జులై 29:** ప్రభుత్వ వనరుల దుర్వినియోగం, వృథా ఖర్చులకు కళ్లెం వేసే దిశగా కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై అర్హులైన ఒక అధికారికి ఒకే ప్రభుత్వవాహనాన్ని కేటాయించాలని స్పష్టం చేసింది. ఈ మేరకు కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని వ్యయ విభాగం ఒక అధికారికిఒకే కారు విధానాన్ని అమల్లోకి తెస్తూ అధికారిక మెమో జారీ చేసింది. ప్రభుత్వ వాహనాలను కేవలం అధికారిక ప్రయోజనాల కోసమే వినియోగించేలా చూడటమే ఈ చర్య ముఖ్య ఉద్దేశం.

### మోస్ట్ వాంటెడ్ జాబితాలో టెలిగ్రామ్ సిఇఒ పావెల్ దురోవ్

**మాస్కో,జులై 29:** టెలిగ్రామ్ వ్యవస్థాపకుడు, సీఈఓ పావెల్ దురోవ్‌పై రష్యా తీవ్ర ఆరోపణలు చేసింది. ఉక్రెయిన్ నిఘా సంస్థలు టెలిగ్రామ్‌ను ఉపయోగించి రష్యాలో దాడులు నిర్వహించేందుకు యువకులను నియమించుకున్నప్పటికీ ఆ కార్యకలాపాలను అడ్డుకోకుండా ఉగ్రవాద చర్యలకు సహకరించారని రష్యా ఫెడరల్ సెక్యూరిటీ సర్వీస్ ఆరోపించింది. ఈ కేసును మరింత తీవ్రతరం చేసిన రష్యాదర్యాప్తు సంస్థలు దురోవ్‌పై ఉగ్రవాద కార్యకలాపాలకు సహకరించినట్లు క్రిమినల్ కేసు నమోదు చేసి, అంతర్జాతీయ వాంటెడ్ జాబితాలో చేర్చినట్లు పేర్కొన్నాయి.

### చైనాలో ఒక్కనెలలోనే 79 వేల కరోనాకేసులు

**బీజింగ్,జులై 29:** చైనాలో మరోసారి కోవిడ్19 కేసులు పెరుగుతుండటంతో సర్వత్రా ఆందోళన వ్యక్తం అవుతోంది. చైనా వ్యాధి నియంత్రణ, నివారణ కేంద్రం వివరాల ప్రకారం జూలై 13 నుంచి 19వరకు నిర్వహించిన పరీక్షల్లో కోవిడ్19 పాజిటివిటీ రేటు 16.3శాతానికి చేరుకుంది. ఇది అంతకుముందు వారంతో పోలిస్తే 4.3 శాతం పాయింట్లు ఎక్కువ. అదే సమయంలో ఫ్లూ పాజిటివిటీ రేటు 12.6 శాతంగా నమోదైంది. జూన్ 2026లో దేశవ్యాప్తంగా 79 వేల కొత్త కరోనా కేసులు నమోదవగా, వాటిలో 130 మంది పరిస్థితి విషమంగా మారింది.



సినీనటి పూనమ్‌కౌర్‌కు ప్రసాదాన్ని అందిస్తున్న ఉజ్జయినీ మహాకాళీ ఆలయ కమిటీ ట్రస్ట్ బోర్డు మెంబరు దేవీవరప్రసాద్

## ఉజ్జయినీ మహాకాళీ అమ్మవారికి చీరె సమర్పించిన సినీనటి పూనమ్‌కౌర్

**హైదరాబాద్ (బేగంపేట), జులై 29, ప్రభాతవార్త:** సికింద‌రాబాద్ ఉజ్జయినీ మహాకాళీ అమ్మవారి దేవాలయాన్ని బుధవారం సినీనటి పూనమ్‌కౌర్ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆమె అమ్మవారికి ప్రత్యేకమైన చీరెను సమర్పిం చారు. అనంతరం పూనమ్‌కౌర్‌తో ఆలయ అర్చకులు పూజలు నిర్వహింపజేసారు. ఇఒ గుత్తా మనోహార్‌రెడ్డి, ఉజ్జయినీ మహాకాళీ ఆలయ కమిటీ ట్రస్ట్ బోర్డు మెంబర్ దేవీవరప్రసాద్ ప్రసాదాన్ని అందజేసారు.

## గురుపౌర్ణమి శుభాకాంక్షలు తెలిపిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,జులై29:** పవిత్రమైన గురుపౌర్ణమి సందర్భంగా ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి గురువులందరికీ హృదయపూర్వక నమస్సు మాంజలులు తెలిపారు. గురుపౌర్ణమి కేవలం ఒక పండుగ మాత్రమే కాదు. మన జీవితాన్ని మలిచిన గురువుల పట్ల కృతజ్ఞతను వ్యక్తం చేసే పవిత్రమైన రోజు. గురువు చూపిన మార్గాన్ని అనుసరిస్తూ, వారి బోధనలను ఆచరిస్తే ప్రతి అడుగూ విజయానికి నాంది అవుతుంది అని పేర్కొన్నారు. తల్లిదండ్రులు మనకు జన్మనిస్తే, గురువు జీవితానికి అర్థాన్ని, లక్ష్యాన్ని అందిస్తారని అన్నారు. జీవితానికి దిశానిర్దేశం చేసి, అజ్ఞానాంధ కారాన్ని తొలగించి జ్ఞాన జ్యోతిని వెలిగించి మనలోని సామర్థ్యాన్ని గుర్తించి, క్రమశిక్షణ, విలువలు, ధైర్యం, ఆత్మవిశ్వాసం వంటి అమూల్యమైన సంపదను ప్రసాదిస్తారని పేర్కొన్నారు.

### పులుల సంరక్షణ సామాజిక బాధ్యతగా స్వీకరించాలి: సిఎం రేవంత్‌రెడ్డి

రాబోయే తరాలకు సంపన్నమైన ప్రకృతి వారసత్వాన్ని అందించేందుకు పులుల సంరక్షణను ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా స్వీకరించాలని అంతర్జాతీయ పులుల దినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. పులి అడవికి ప్రతీక మాత్రమే కాదని, ప్రకృతి సమతుల్యతను కాపాడే రారాజు. పులులు సురక్షి తంగా ఉంటే అడవులు సురక్షి తంగా ఉంటాయని, తద్వారా జీవవైవిధ్యం, నీటి వనరులు, పర్యావరణం కూడా రక్షి ంచబడుతాయి అని పేర్కొన్నారు. పులుల నివాస ప్రాంతాలను కాపాడడం, అడవుల విధ్వంసాన్ని అరికట్టడం, వన్యప్రాణుల అక్రమ వేటను నిరోధించడం, పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించడం అత్యంత అవసరమని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

## వ్యవసాయ వర్సిటీలో డిగ్రీ ప్రవేశాల దరఖాస్తు గడువు పొడిగింపు

### ఉపకులపతి అల్దాస్ జానయ్య

**అత్తాపూర్ జులై 29, ప్రభాతవార్త :** 2026-27 విద్యా సంవత్సరానికి ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణా వ్యవసాయ విశ్వవిద్యాలయం అందిస్తున్న బీ ఎస్సీ (ఆనర్స్) అగ్రికల్చర్ మరియు ఇతర కోర్సుల్లో ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకునే గడువుని ఆగస్టు 13 వ తేదీ వరకూ పొడిగించినట్లు ఉప



ఉపకులపతి అల్దాస్ జానయ్య

కులపతి అల్దాస్ జానయ్య తెలిపారు. బుధవారం ఆయన ఓ ప్రకటనలో మాట్లాడుతూ.. తెలంగాణ ఎప్‌సెట్-2026లో అర్హత సాధించిన విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచిం చారు. ఈ ఏడాది మరో 360 బీ ఎస్సీ (ఆనర్స్) అగ్రికల్చర్ సీట్లు అందు బాటులోకి వచ్చాయని గత ఏడాది కొత్తగా ప్రారం భించిన కొడంగల్, హు జూర్‌నగర్, డిచ్‌పల్లి కళాశాలల్లో ఈ యేడాది నుంచి ఒక్కో కళాశాలలో అదనంగా 120 సీట్లు భర్తీ చేయనున్నట్లు అల్దాస్ జానయ్య వివరించారు. అభ్యర్థులు పూర్తి వివరాల కోసం విశ్వ విద్యాలయం వెబ్ సైట్‌ని సందర్శించ వలసిందిగా ఆయన సూచించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం కొత్త కోర్సులు అపార ఉద్యోగ అవకాశాలుమారుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని ఎప్పటికప్పుడు అందిపుచ్చుకుంటూ విశ్వ విద్యాలయం ముందుకు వెళ్తోందని తాను ఉప కులపతిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి అమలు చేస్తున్న అనేక సంస్కరణల వల్ల విశ్వ విద్యాలయం 37 వ ర్యాంకు నుండి మెరుగు పడి 19 వ ర్యాంక్‌లో నిలిచిందన్నారు.

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డిజిటల్ అగ్రికల్చర్ తదితర అధునాతన పరిజ్ఞానాలలో కొత్త కోర్సులు ప్రవేశ పెడుతు న్నామని మారుతున్న అవసరాలకి అనుగుణంగా కోర్సుల సిలబస్‌లో కూడా ఎప్పటికప్పుడు మార్పులు, చేర్పులు తీసుకునివస్తున్నామని వివరించారు.



## రాష్ట్ర అభివృద్ధికి ముందుకు రావాలి

### నార్త్ కరోలినాలో ప్రవాస తెలుగువారితో మండలి చైర్మన్ సుఖేందర్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,జులై29:** అమెరికాలోని నార్త్ కరోలినా రాష్ట్రం, ర్యాలీ నగరంలో గ్లోబల్ తెలంగాణ అసోసియేషన్ ఆధ్వర్యంలో తెలంగాణ శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, తెలంగాణ డైరీ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డి అక్కడ స్థిరపడిన తెలుగు ప్రజలతో సమావేశం అయ్యారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి, ప్రవాస భారతీయుల పాత్ర, భవిష్యత్తులో తెలంగాణ రాష్ట్ర అభ్యున్నతికి ప్రవాసుల సహకారం వంటి పలు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా గుత్తా సుఖేందర్ రెడ్డి మాట్లాడుతూ ఎక్కడ స్థిరపడిన, ఎంత స్థాయికి ఎదిగిన మన మాతృభూమిని మరచిపోవద్దని తెలిపారు. మన రాష్ట్ర అభివృద్ధికి ప్రవాస తెలుగువారందరు ముందుకు రావాలని, తెలంగాణ అభివృద్ధి లో భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో రాష్ట్రం ప్రగతిపథంలో నడుస్తోందని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రవాస భారతీయిలు, అసోసియేషన్ సభ్యులు పలువురు ప్రముఖులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# వేట, అడవుల నరికివేత, అక్రమ రవాణాతో తగ్గిన పులుల సంఖ్య

### పులుల సంరక్షణ పట్ల సమాజంలోని అన్ని వర్గాలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలి

### తెలంగాణ స్టేట్ ఫారెస్ట్ అకాడమీలో అంతర్జాతీయ పులుల దినోత్సవంలో మంత్రి కొండా సురేఖ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జులై 29:** పులుల సంరక్షణ పట్ల సమాజంలోని అన్ని వర్గాలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ గారు పిలుపునిచ్చారు. ఈ భూమి కేవలం మనుషుల ఆవాసం మాత్రమే కాదని, సమస్త జీవరాశుల ఉమ్మడి నివాసం అని గుర్తించి ప్రకృతి పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతతో ముందుకు రావాలని కోరారు. బుధవారం అంతర్జాతీయ పులుల దినోత్సవాన్ని పురస్కరించుకుని మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా దూలపల్లిలోని తెలంగాణ స్టేట్ ఫారెస్ట్ అకాడమీలో నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి కొండా సురేఖ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అంతర్జాతీయ పులుల దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన ఫోటో ఎగ్జిబిషన్ ను మంత్రి పరిశీలించారు. పులుల సంరక్షణకు సంబంధించిన లఘు చిత్రాన్ని మంత్రి వీక్షించారు. ఈ కార్యక్రమంలో అటవీదళాల ప్రధాన సంరక్షణాధికారి వినయ్ కుమార్, కొండా లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయం వైస్ ఛాన్స్‌లర్ దండా రాజిరెడ్డి, పిసిసిఎఫ్ (డెవలప్ మెంట్) రత్నాకర్ జౌహరి, సిసిఎఫ్ టిజిఎస్ఎఫ్ఎ డైరెక్టర్ ప్రియాంక వర్గీస్, సిసిఎఫ్ ఎన్ క్షితిజ, టైగర్ సెల్ రీసర్చ్ సైంటిస్ట్ అయాన్ సాధు, అమ్రాబాద్ ఫీల్డ్ డైరెక్టర్ ప్రసాద్, కవాల్ టైగర్ రిజర్వ్ ఫీల్డ్ డైరెక్టర్ శాంతారాం పలువురు అటవీశాఖ అధికారులు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ సభను ఉద్దేశించి ప్రసంగించారు. ప్రతి సంవత్సరం జూలై 29న ప్రపంచ పులుల దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని తెలిపారు. పులుల సంరక్షణ ప్రాధాన్యతపై ప్రపంచవ్యాప్తంగా అవగాహన పెంపొందించేందుకు 2010లో రష్యాలోని సెయింట్ పీటర్స్ బర్గ్‌లో ప్రారంభమైన ఈ కార్యక్రమం నేడు ప్రకృతి పరిరక్షణకు ఒక గొప్ప వేదికగా నిలిచిందన్నారు. పులి అటవీ సంపదకు ప్రతీక అని, పులిని పరిరక్షించడమంటే అడవిని, పర్యావరణాన్ని, జీవవైవిధ్యాన్ని, భావితరాల భవిష్యత్తును పరిరక్షించడమేనని అన్నారు. వేట, అడవుల నరికివేత, అక్రమ రవాణా వంటి కారణాలతో వాటి సంఖ్య తీవ్రంగా తగ్గిపోయిందని మంత్రి సురేఖ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితిని మార్చేందుకు నాటి ప్రధాని ఇందిరాగాంధి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం 1972లో వన్యప్రాణి సంరక్షణ చట్టాన్ని, 1973లో ప్రాజెక్ట్ టైగర్‌ను ప్రారంభించి దేశవ్యాప్తంగా పులుల సంరక్షణకు బలమైన చర్యలు చేపట్టిందని వివరించారు. ఈ చర్యల ఫలితంగానే నేడు భారతదేశం ప్రపంచ పులుల సంరక్షణలో అగ్రగామిగా నిలిచిందని మంత్రి తెలిపారు. ప్రస్తుతం ప్రపంచంలోని మొత్తం పులుల్లో సుమారు 75 శాతం పులులు భారతదేశంలోనే ఉన్నాయని, దేశంలో ప్రస్తుతం 58 టైగర్ రిజర్వులు విజయవంతంగా పనిచేస్తున్నాయని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రానికి కూడా ఈ విషయంలో విశిష్టమైన స్థానం ఉందని మంత్రి అన్నారు. అమ్రాబాద్, కవ్వాల్ టైగర్ రిజర్వులు దేశంలోనే ప్రాముఖ్యత కలిగిన పులుల అభయారణ్యాలుగా గుర్తింపు పొందాయని మంత్రి తెలిపారు. అమ్రాబాద్ టైగర్ రిజర్వులో నీటి వనరుల అభివృద్ధి, వాటి ఆవాసాల మెరుగుదల, ఆధునిక రక్షణ చర్యల వల్ల పులుల సంఖ్య గణనీయంగా పెరిగిందని మంత్రి స్పష్టం చేశారు. కవ్వాల్ టైగర్ రిజర్వు లో పులుల సంఖ్యను వృద్ధి చేసేందుకు టైగర్ రీఇంట్రడక్షన్ ను చేపట్టినట్లు మంత్రి సురేఖ తెలిపారు. ఇందులో భాగంగా కవ్వాల్ టైగర్ రిజర్వ్ ను మహారాష్ట్రలోని తడోబా టైగర్ రిజర్వుతో అనుసంధానించి పులుల సహజ సంచారానికి అనుకూల పరిస్థితులు కల్పించినట్లు వివరించారు. దీంతోపాటు ప్రజల్లో పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంపొందించడం వంటి కార్యక్రమాలను అటవీ శాఖ అమలు చేస్తున్నదని మంత్రి తెలిపారు.

## మహిళల పట్ల అనుచిత వ్యాఖ్యలు బిజెపి ఎంపి కంగనాకు తగదు

### పిసిసి మహిళా రాష్ట్ర అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ

**హైదరాబాద్,జులై 29,ప్రభాతవార్త:** జంతర్ మంతర్ వద్ద నిరసన చేస్తున్న జెన్ జి ఉద్యమ మహిళలపై బిజెపి ఎంపి కంగనా రనౌత్ చేసిన వ్యాఖ్యలు అత్యంత దారుణంగా, బాధ్యతారహితంగా ఉన్నాయని తెలంగాణ రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షులు ఎర్రబెల్లి స్వర్ణ విమర్శించారు. అక్కడ ఉన్న మహిళలు చదువుకోలేదు, అన్పడ్, గవార్, మంచి హౌస్ వైఫ్ కూడా కాలేరు, వాళ్ళు గటార్ చాప్ అంటూ ఒక మహిళ, పైగా ప్రజాప్రతినిధి అయి ఉండి ఇంత దిగజారుడు భాష మాట్లాడడం సిగ్గుచేటనీ ఆగ్రహం వ్యక్తంచేశారు. జెన్ జి అమ్మాయిలు తమ హక్కుల కోసం పోరాడుతుంటే పోలీసులు అమా నుషంగా లాఠీచార్జ్ చేసి దాడి చేస్తే కంగనా రనౌత్ గటార్ చాప్ అని కించపర చడం ఆమె సంస్కారాన్ని తెలియజేస్తుంది ఆవేదన చెందారు.

రైతు ఉద్యమం సమయంలో మహిళా అన్నదాతలను ఐదువందలకు అద్దెకు వచ్చిన మహిళలుగా కంగనా రనౌత్ తునాడారని అంతేకాదు మహిళపట్ల అమర్యాదగా వ్యవహరించినందుకు ఎయిర్‌పోర్ట్‌లో తగిలిన చెంపదెబ్బను మర్చి పోయావా ? మర్చిపోయినట్టు నటిస్తున్నావా !ఒక పార్లమెంట్ సభ్యురాలిగా ఆమె సంసద్‌లో తన ధర్మాన్ని, బాధ్యతను నిర్వర్తించాలి. లేనిపక్షంలో నైతిక బాధ్యత వహించి పదవికి రాజీనామా చేసి మండి నియోజకవర్గానికి వెళ్లాలని అన్నారు.

కంగన జెన్ జి మహిళలకు బహిరంగంగా క్షమాపణ చెప్పాలనీ, ఇలాంటి అసభ్య భాష మానుకోవాలనీ హితవు చెప్పారు. మహిళల ఆత్మ గౌరవాన్ని దెబ్బతీసే ఎవరినీ మేము వదిలిపెట్టము అని ఎర్రబెల్లి స్వర్ణ హెచ్చరించారు.



## ఎల్‌నినో పరిస్థితుల్లో ప్రత్యామ్నాయ పంటలు లాభం

### రైతును చైతన్యపరిచే దిశగా ప్రభుత్వ యంత్రాంగం

### గాంధీభవన్‌లో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ముఖాముఖి

**హైదరాబాద్,జులై 29,ప్రభాతవార్త:** బంగాళఖాతంలో మునిగిపోయిన వాళ్ళే హైడ్రాను అందులో వేస్తామని బిఆర్ఎస్‌వర్కింగ్ ప్రసిడెంట్ కెటిఆర్ చేసిన వ్యాఖ్యలకు అర్థంలేదని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఎద్దేవా చేశారు. గాంధీభవన్‌లో ప్రజలతో ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొని ప్రజల నుంచి వచ్చిన విన్నపాలను స్వీకరించారు. వర్షాకాలం వచ్చినా ఇప్పటికి 30శాతం లోటు వర్ష పాతం నమోదైందనీ,150 ఏండ్ల నుండి చూడని ప్రకృతి వైపరీత్యం ప్రస్తుతం కొనసాగుతోందని ఆయన ఆవేదన చెందారు. ఎలినినో ప్రభావం ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబర్ లో కూడా తీవ్రంగా ఉండబోతుందని ప్రకృతి వైపరిత్యాన్ని గ్రామ,గ్రామాన ప్రజలకు తెలియజేస్తున్నామనీ చెప్పారు. ప్రత్యామ్నయ పంటలు మాత్రమే వేసుకొంటే ప్రతికూల వాతావర్ణంలో లాభదాయకంగా ఉంటుందని ఆయన వివరించారు. రైతులను చైతన్యపరిచే దిశలో తెలంగాణ ప్రభుత్వ యంత్రాంగం కదిలిందని సాంప్రదాయ పంటల సాగు విస్తీర్ణం తగించడానికి రైతులు కూడా మొగ్గుచూపుతున్నారని చెప్పారు. ఎల్‌నినో ఎదుర్కొనేందుకు అన్ని శాఖల సమన్వయం తో పని చేస్తున్నామనీ చెప్పారు. రైతులు మెట్ట పంటలు వేస్తున్నారనీ, ఆయిల్ పామ్ వైపు ఎక్కువగా రైతులు మొగ్గుచూపుతున్నారనీ అన్నారు. గాంధీ భవన్ ను దేవాలయం గా భావించి నమ్మకంతో ప్రజలు సమస్యలు చెప్పుకోవడానికి వస్తున్నారనీ ఆయన అన్నారు. ప్రజల నుండి వచ్చిన ఫిర్యాదులు సంబందిత అధికారులకు పంపిస్తున్నామని ఏ పార్టీ నిర్వహించని ముఖాముఖిని కాంగ్రెస్ నిర్వహిస్తుందని చెప్పారు.

## బిసిలకు రిజర్వేషన్లు సాధించే దాకా ఉద్యమం ఆగదు

### అఖిలపక్ష బిసి నేతలు వెల్లడి

**హైదరాబాద్, జులై 29, ప్రభాతవార్త:** దేశంలో అసమానతలు, కుల వివక్ష, అస్పృశ్యత కొనసాగుతున్నంత కాలం రిజర్వేషన్లు కొనసాగాల్సిందేనని, బీసీలకు జనాభా దామాషా ప్రకారం రాజకీయ రిజర్వేషన్లు దక్కే వరకు జాతీయ స్థాయిలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేయాలని అఖిలపక్ష బీసీ నేతలు బుధవారం పిలుపునిచ్చారు. ఆగస్టు 7న బెంగళూరులో జరగనున్న జాతీయ ఓబీసీ మహాసభకు పార్టీలకు అతీతంగా బీసీలు భారీ సంఖ్యలో హాజరు కావాలని కోరారు. బుధవారం హైదరాబాద్‌లో బీసీ కుల సంఘాల జేఏసీ ఛైర్మన్ కుందారం గణేష్ చారి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్, బీఆర్ఎస్ నాయకులు వి. శ్రీనివాస్ గౌడ్, సిరికొండ మధుసూదనాచారి, కాంగ్రెస్ నేత ఈరావత్ అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ మాట్లాడుతూ దేశంలోని బీసీల సంక్షేమం కోసం ప్రత్యేక కేంద్ర మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి లేఖ రాస్తానని తెలిపారు. బీసీలకు చట్టసభల్లో రాజకీయ రిజర్వేషన్లు కల్పించాల్సిన అవసరం ఉందని పేర్కొంటూ, బెంగళూరులో జరిగే జాతీయ ఓబీసీ మహాసభకు తాను కూడా హాజరవుతానని, అన్ని వర్గాల బీసీలు పాల్గొనాలని పిలుపునిచ్చారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు దేశ నలు మూలల నుంచి బీసీలు బెంగళూరుకు తరలివచ్చి మహాసభను విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో చిన్న శ్రీశైలం యాదవ్, గుజ్జ కృష్ణ, శేఖర్‌సాగర్, తాటికొండ విక్రమ్‌గౌడ్, కనకాల శ్యాంకుర్మా, భూదాని సదానందం తదితర బీసీ నాయకులు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, జాజుల శ్రీనివాస్‌గౌడ్, మాజీమంత్రి శ్రీనివాస్‌గౌడ్, గుజ్జ కృష్ణ

## నాలుగు ఇండస్ట్రియల్ పార్కుల ఏర్పాటుకు కేంద్రానికి ప్రతిపాదనలు

### వాటి పురోగతిపై సిఎస్ సంజయ్‌జాజు అధికారులతో సమీక్ష

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,జులై29:** భారత్ ఔద్యోగిక్ వికాస్ యోజన (భవ్య) పథకంలో భాగంగా రాష్ట్రంలో 4 ఇండస్ట్రియల్ పార్కుల ఏర్పాటుకు ప్రతిపాదనలు కేంద్ర ప్రభుత్వానికి సమర్పిస్తున్నామని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వ భవ్య పథకంలో భాగంగా రాష్ట్రంలో ఏర్పాటు చేసే ఇండస్ట్రియల్ పార్క్‌ల పురోగతిపై బుధవారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో సంబంధిత ఉన్నతాధికారులతో సిఎస్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి అహ్మద్ నదీమ్, పరిశ్రమలు వాణిజ్య శాఖ ప్రత్యేక కార్యదర్శి కృష్ణ ఆదిత్య, చేనేత, పరిశ్రమల శాఖ డైరెక్టర్ నిఖిల్ చక్రవర్తి, సిక్తా పట్నాయక్ తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సి.ఎస్ మాట్లాడుతూ, భవ్య పథకంలో మొదటి దశలో భాగంగా రాష్ట్రంలో ఏర్పాటు చేసే 4 ఇండస్ట్రియల్ పార్కులకు సంబందించిన పూర్తి ప్రాజెక్ట్ రిపోర్ట్‌ను కేంద్రానికి ఈనెలాఖరులోగా అందచేస్తున్నామని తెలిపారు. ఒక్కో పార్కు 500 ఎకరాలకన్నా అధిక విస్తీర్ణంలో ఉంటుందని, ఇందుకుగాను భూసేకరణ ఇతర ఏర్పాట్లన్నీ పూర్తి చేశామని తెలిపారు. వీటిలో కందుకూరు మండలం తిమ్మాపూర్, ఇబ్రహీంపట్నం ఎలిమినేడు, ఘట్కేసర్ మండలం మాదారం, చౌటుప్పల్ మండలం దండు మైలారం ఉన్నాయన్నారు. వీటిలో ఎలక్ట్రానిక్, సాఫ్ట్‌వేర్ తదితర రంగాలకు చెందిన పరిశ్రమల ఏర్పాటుకు పలు ప్రముఖ కంపెనీలు ముందుకు వచ్చాయని అన్నారు. వీటితోపాటు,మరో 16 ప్రాంతాల్లో ఇండస్ట్రియల్ పార్కుల ఏర్పాటుకు ప్రతిపాదనలు రూపొందిస్తున్నామని ఆయన వివరించారు.

### దేశంలోనే అత్యుత్తమ డిజిటల్ పౌర సేవల

# వేదికగా మీసేవను తీర్చిదిద్దాలి

### ప్రధాన కార్యదర్శి సంజయ్‌జాజు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జులై 29:** ప్రజలకు ప్రభుత్వ సేవలను మరింత సులభతరంగా, వేగవంతంగా, పారదర్శకంగా అందించేందుకు మీసేవ వ్యవస్థను దేశంలోనే అత్యుత్తమ డిజిటల్ పౌర సేవల వేదికగా తీర్చిదిద్దాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు సంబంధిత అధికారులను ఆదేశించారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో బుధవారం మీసేవ విభాగం పనితీరుపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో శాఖ అమలు చేస్తున్న వివిధ కార్యక్రమాలు, ఈ గవర్నెన్స్ ప్రాజెక్టులు, డిజిటల్ సేవల పురోగతిని సిఎస్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ఆగస్టు 15 నాటికి మీసేవ ద్వారా అందించే సేవల పరిధిని మరింత విస్తరించాలని అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం 33 ప్రభుత్వ శాఖలకు సంబంధించిన అనేక సేవలు మీసేవ ద్వారా ప్రజలకు అందుబాటులో ఉన్నాయని, ప్రజల అవసరాలకు అనుగుణంగా మరిన్ని సేవలను ఈ వేదికలో చేర్చేందుకు కార్యాచరణ చేపట్టాలని సూచించారు. ప్రస్తుత ఆధునిక సమాచార సాంకేతికత, కృత్రిమ మేధస్సు (ఎఐ), డేటా ఆధారిత పరిష్కారాలను మీసేవ వ్యవస్థతో అనుసంధానించి, ఈగవర్నెన్స్ సేవలను ప్రజల ముంగిటకు మరింత సమర్థవంతంగా తీసుకెళ్లే విధంగా ప్రణాళికలు రూపొందించాలని తెలిపారు. పౌరులు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా వీలైనన్ని ఎక్కువ సేవలను పూర్తిస్థాయిలో ఆన్‌లైన్‌లో అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. ప్రజలకు నాణ్యమైన, పారదర్శకమైన, సమయానుకూలమైన సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్న ప్రధాన కార్యదర్శి, మీసేవను దేశంలోనే ఆదర్శవంతమైన పౌర సేవల వేదికగా తీర్చిదిద్దేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. సమావేశంలో ఐటీ శాఖ జాయింట్ సెక్రటరీ అనుదీప్ దూరిశెట్టి, మీ సేవ డైరెక్టర్ రవికిరణ్‌తో పాటు సంబంధిత శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు



# ఫీజు బకాయిలు వెంటనే చెల్లించాలి

### రేపు రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థుల తరగతుల బహిష్కరణ

### కలెక్టరేట్-ఆర్డీఒ-ఎంఆర్ఒ కార్యాలయాల ముట్టడికి పిలుపు : ఎంపి ఆర్. కృష్ణయ్య

**హైదరాబాద్, జులై 29, ప్రభాతవార్త:** విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ల బకాయిలను వెంటనే విడుదల చేసి, ప్రస్తుతం అమలులో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని ఎలాంటి మార్పులు లేకుండా యథాతథంగా కొనసాగించాలని రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య బుధవారం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై స్పందించిన ఆయన, విద్యార్థుల సమస్యలపై ఉద్యమాలు చేయడం తన రాజ్యాంగబద్ధమైన హక్కు అని స్పష్టం చేశారు. తెలంగాణలో సుమారు 14 లక్షల మంది విద్యార్థులు ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు అందక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆర్. కృష్ణయ్య పేర్కొన్నారు. బాధిత విద్యార్థుల తరఫున ఉద్యమాలు నిర్వహిస్తుంటే, వాటిపై విమర్శలు చేయడం ముఖ్యమంత్రి స్థాయికి తగదని అన్నారు. గత 50 సంవత్సరాలుగా విద్య, ఉపాధి, బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల సంక్షేమం కోసం 16 వేలకుపైగా ఉద్యమాలు నిర్వహించినట్లు తెలిపారు. ఉద్యమాల ఫలితంగానే గురుకుల పాఠశాలలు, ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ వంటి పథకాలు అమల్లోకి వచ్చాయని గుర్తు చేశారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు చెల్లిం చాల్సిన ఫీజుల బకా యిలు సుమారు రూ.8 వేల కోట్లు ఉన్నాయని, వాటిని ఎందుకు విడుదల చేయడం లేదని ప్రశ్నించారు. ఒకవైపు కాంట్రాక్టర్లకు చెల్లింపులు చేస్తూ, మరోవైపు విద్యార్థుల భవిష్యత్తుతో నిర్లక్ష్యంగా వ్యవహరిం చడం సరికాద న్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం లోకి వచ్చి 32 నెలలు గడిచినా బకాయిలు చెల్లించక పోవడం ఆందోళన కలిగించే విషయమని పేర్కొన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకంలో మార్పులు చేస్తూ వరుసగా జీవోలు జారీ చేయడం వల్ల విద్యార్థుల్లో అయోమయం నెలకొందని ఆర్. కృష్ణయ్య విమర్శించారు. ఈ పరిస్థితుల కారణంగా ఈ యేడాది ఇంజినీరింగ్ కౌన్సెలింగ్‌కు సుమారు 30 వేల మంది విద్యార్థులు హాజరు కాలేదని, డిగ్రీ కళాశాలల్లో కూడా వేలాది సీట్లు ఖాళీగా మిగిలి పోయా యని తెలిపారు. 31న రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థులు తరగతులను బహిష్కరించి, అన్ని జిల్లాల్లో కలెక్టరేట్‌లు, ఆర్డీవో, ఎమ్మార్వో కార్యాలయాల వరకు ర్యాలీలు, ప్రదర్శనలు నిర్వహించి సంబంధిత అధికారులకు వినతిపత్రాలు సమర్పించాలని ఆర్. కృష్ణయ్య పిలుపునిచ్చారు. 14 లక్షల మంది విద్యార్థుల ఫీజు బకాయిలు రూ.8 వేల కోట్లు వెంటనే విడుదల చేసి, ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని పాత విధానంలోనే కొనసాగించాలని ప్రభుత్వాన్ని ఆయన మరోసారి డిమాండ్ చేశారు.



మీడియాతో మాట్లాడుతున్న ఎంపి ఆర్.కృష్ణయ్య

## ఫీజు రీయింబర్స్‌మెంట్ గత బకాయిల సంగతేంటి?

### ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శి మణికంఠరెడ్డి, పుట్ట లక్ష్మణ్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,జులై29:** సిఎం రేవంత్‌రెడ్డి ఇక నుంచి ప్రతి ఏడాది ఫీజు రియంబర్స్మెంట్ విడుదల చేస్తామని మాట్లాడటం సరైనదే కానీ విద్యార్థుల చదువులకు ఆటంకం లేకుండా పెండింగ్ బకాయిలన్నింటినీ మొత్తం ఒకేసారి విడుదల చేయాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శి కసిరెడ్డి మణికంఠ రెడ్డి, పుట్ట లక్ష్మణ్ ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లక్షలాది మంది విద్యార్థులకు గత నాలుగు విద్యా సంవత్సరాల నుంచి పెండింగ్‌లో ఉన్న ఫీజు రీఎంబర్స్మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు విడుదల చేయకుండా విద్యార్థుల చదువులతో జీవితాలతో చెలగాటం ఆడటం ఎందుకని? అని ప్రశ్నించారు. గత 4 విద్యా సంవత్సరాలుగా విద్యా సంవత్సరం పూర్తి చేసుకున్న విద్యార్థులు ఫీజు రియంబర్స్మెంట్ రాక సర్టిఫికెట్ల కోసం కళాశాలల వారికి ఫీజులు కట్టి మరి సర్టిఫికెట్లు తీసుకున్నారని చెప్పారు. దాదాపు రూ.10వేల కోట్ల ఫీజు బకాయిలు పెండింగ్ లో ఉన్నాయని ఆ బకాయిల సంగతి ఏందో సీఎం రేవంత్ రెడ్డి చెప్పాలని, గత విద్య సంవత్సరం కూడా పూర్తయిన విద్యార్థులు ఇప్పటికి సర్టిఫికెట్లు తీసుకోవడానికి చాలా ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఇకపై ఫీజు రియంబర్స్మెంట్ ప్రతి సంవత్సరం విడుదల చేస్తామని ప్రకటించడం మాత్రమే కాకుండా అమలు చేయాలని, గతంలో పెండింగ్‌లో ఉన్న ఫీజు రియంబర్స్‌మెంట్ స్కాలర్‌షిప్ బకాయిలను ఒకేసారి విడుదల చేయాలని డిమాండ్ చేశారు.



చినజీయర్‌స్వామి ఆశీస్సులు తీసుకుంటున్న భక్తులు

## భక్తిశ్రద్ధలతో ప్రారంభమైన చాతుర్మాస్యదీక్ష

**శంషాబాద్, జులై 29, ప్రభాతవార్త :** ఆధ్యాత్మిక చైతన్యానికి కేంద్ర బిందువుగా నిలిచే త్రిదండి చిన శ్రీమన్నారాయణ రామానుజ జీయర్ స్వామి వారి 46వ చాతుర్మాస్య దీక్ష అత్యంత భక్తిశ్రద్ధలతో ప్రారంభమైంది. దీనికితోడు పవిత్రమైన గురుపూర్ణిమ పర్వదినం, చాతుర్మాస్య దీక్షను పురస్కరించుకుని భక్తుల సమక్షంలో విష్ణు సహస్రనామ పారాయణం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ ఆధ్యాత్మిక వేడుకల్లో భాగంగా చిన్న జీయర్ స్వామి వారి దివ్య సనిల్నో వేద పండితులు, రుత్వికులు మరియు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని సంయుక్తంగా విష్ణు సహస్రనామ పారాయణం చేశారు. భగవన్నామ స్మరణతో ప్రాంగణమంతా మార్మోగింది. ఈ సందర్భంగా గురు పూజల ప్రాధాన్యతను, చాతుర్మాస్య దీక్షా నియమాలను వివరిస్తూ... గురువే సర్వస్వమని, భగవంతుని చేరుకోవడానికి గురుకృప ఎంతో అవసరమని ఉద్ఘాటించారు.

## దక్షిణ అయోధ్యలో దమ్మక్క భక్తి వైభవం

### ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్న భద్రాద్రి

### శ్రీరామ సేవలో పోకల దమ్మక్క స్ఫూర్తి

### వేలాది భక్తుల ఆధ్యాత్మిక యాత్ర

**భద్రాచలం, జులై 29, ప్రభాతవార్త:** దక్షిణ అయోధ్యగా ఖ్యాతి గాంచిన భద్రాచలం సీతారామచంద్రస్వామి వారి దేవస్థానం ఆషాఢ శుద్ధ పూర్ణి మ సందర్భంగా మరోసారి అపూర్వ ఆధ్యాత్మిక వైభవానికి వేదికైంది. శ్రీరాముని తొలి భక్తురాలిగా ఆరాధించబడే పోకల దమ్మక్క జ్ఞాపకార్థం నిర్వహించిన శోభాయాత్ర మునుపెన్నడూ లేని రీతిలో భక్తి, సంస్కృతి, సంప్రదాయాల సమ్మేళనంగా బుధవారం అంగరంగ వైభవంగా సాగింది. భద్రాచలం పురవీధులన్నీ "జై శ్రీరాం" నినాదాలతో మారుమోగి, క్షేత్రం అంతా భక్తి పారవశ్యంలో మునిగిపోయింది. ఈ మహోత్సవాన్ని మరింత వైభవంగా నిర్వహించేందుకు శ్రీరామ భక్తుడు, భద్రాచలం గ్రామ సర్పంచ్ పూనం కృష్ణ ప్రత్యేక చొరవ తీసుకోగా, ముర్ల రమేష్ విశేషంగా కృషి చేశారు. దేవస్థానం అధికారుల సహకారంతో గిరిజన భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనేలా ప్రత్యేకంగా తొమ్మిది ఆర్టీసీ బస్సులను ఏర్పాటు చేయడం విశేషంగా నిలిచింది. ఈ ఏర్పాట్లతో వందలాది మంది గిరిజన భక్తులు స్వామివారి దర్శనం, శోభాయాత్ర, ఉత్సవాల్లో పాల్గొనే అదృష్టాన్ని పొందారు. వేదపండితుల వేదఘోషలు, మంగళ వాయిద్యాలు, భజనలు, హరినామ సంకీర్తనలు, కోలాటాలు, గిరిజనుల సంప్రదాయ కొంగు నృత్యాలు, డోలు వాయిద్యాల నడుమ సాగిన శోభాయాత్ర భద్రాచలం పురవీధులకు ఆధ్యాత్మిక శోభను తీసుకొచ్చింది. సంప్రదాయ వస్త్రధారణలో పాల్గొన్న గిరిజన కళాబృందాల ప్రదర్శనలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. గిరిజన భక్తులు అడవుల నుంచి తీసుకొచ్చిన పూలు, పండ్లు, పవిత్ర కానుకలను సీతారాముల పాదాల వద్ద సమర్పించి తమ భక్తిని చాటుకున్నారు. అనంతరం మారుతి సదనంలో నిర్వహించిన శ్రీ సీతారాముల నిత్య కళ్యాణ మహోత్సవంలో గిరిజన భక్తులు భక్తిశ్రద్ధలతో పాల్గొని కళ్యాణాన్ని వీక్షించారు.

## ఐఐటి ఖరగ్‌పూర్‌లో హైదరాబాద్ అసిస్టెంట్ ప్రొఫెసర్ అనుమానాస్పద మృతి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,జులై29:**ఐఐటి ఖరగ్‌పూర్‌లో అసిస్టెంట్ ప్రొఫెసర్ అనుమానాస్పద స్థితిలో మృతి చెందారు. హైదరాబాద్‌కు చెందిన పుల్లగురం దీపక్‌రెడ్డి(36) బుధవారం మధ్యాహ్న సమయంలో క్యాంపస్‌లోని స్టాఫ్ క్వార్టర్స్‌లో ఉరివేసుకున్న స్థితిలో కనిపించారు. సమాచారం అందుకున్న హిజ్లీ ఔట్ పోస్టు పోలీసులు వెంటనే క్యాంపస్‌లోని బిసి రాయ్ అసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఈ విషయాన్ని దీపక్ రెడ్డి కుటుంబ సభ్యులకు చేరవేసినట్లు పోలీసులు తెలిపారు. ఆయన గదిని పోలీసులు సీల్ చేసి దర్యాప్తు చేపట్టారు.

## రూ.2 కోట్ల గోల్డ్ స్కామ్ కేసు టాలీవుడ్ నిర్మాత అరెస్ట్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,జులై29:**గోల్డ్ స్కామ్ కేసులో టాలీవుడ్ నిర్మాతను పోలీసులు అరెస్ట్ చేశారు. ఇప్పటికే ఐదు కేసుల్లో ప్రధాన నిందితుడిగా ఉన్నట్లు గుర్తించారు. వివరాల్లోకి వెళ్తే రూ.2.21 కోట్ల గోల్ స్కామ్ కేసులో 'లఫూట్ గ్యాంగ్' నిర్మాత కే.లక్ష్మీకాంత్ రెడ్డిని హైదరాబాద్ సిసిఎస్ పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుడిని నాంపల్లి 12వ అదనపు చీఫ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కోర్టులో హాజరు పరచగా కోర్టు 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించింది. బాధితుడు రాకేష్ బలరాం గౌడ్ తరఫున హైకోర్టు అడ్వకేట్ నాగూర్‌బాబు తెలంగాణ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. 24 క్యారెట్ల బంగారు బిస్కెట్లు తక్కువ ధరకు ఇప్పిస్తానని నమ్మించి, విడతల వారీగా రూ.2.21 కోట్లు తీసుకుని, బంగారం ఇవ్వకుండా, డబ్బు తిరిగి చెల్లించకుండా మోసం చేసినట్లు కంప్లైంట్‌లో ఆరోపించారు. తన డబ్బు తిరిగి ఇవ్వాలని అడిగితే... తనతో పాటు తన కుటుంబ సభ్యులు కూడా తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని బెదిరించినట్లు బాధితుడు తెలిపారు.

## నా పొలిటికల్ డిజైన్‌ను నవంబర్‌లో వెల్లడిస్తా

### పిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి

**సంగారెడ్డి బ్యూరో, జులై 29, ప్రభాతవార్త :**మూడున్నరేళ్ల క్రితం రాహుల్ గాంధీకి ఇచ్చిన మాటను నేటికీ నిలబెట్టుకుంటున్నానని,ఆనాడు రాహుల్ గాంధీకి మాట ఇచ్చాన ప్రకారం, ముడున్నరేళ్ళ మా పార్టీ ప్రభుత్వ, రాజకీయ వ్యవహారాల గురించి మాట్లాడలేదని,నేనేదైనా మాట్లాడాలి అనుకుంటే ఢిల్లీ ట్రైన్ ఎక్కి రాహుల్ గాంధీతో మాట్లాడిన తర్వాతే బయటికి వచ్చి మాట్లాడుతనని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి అన్నారు బుధవారం సంగారెడ్డిలో నియోజకవర్గంలోని బిఎల్‌ఎలతో నిర్వహించిన ఎస్ ఐ ఆర్ సమీక్ష సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మనసులో ఒకటి పెట్టుకుని బయట మరొకటి మాట్లాడే వ్యక్తిని కానని, మూడున్నరేళ్ల క్రితం మా పార్టీలో లోపాలు ఉంటే బయట మాట్లాడాను, కార్యకర్తల వ్యవహారం, పార్టీ అంశాలపై అంతర్గతంగా, బహిరంగంగాను చర్చించాను.ఎన్నికలకు ముందు రాహుల్ గాంధీ 40 మంది కాంగ్రెస్ నేతలను ఢిల్లీకి పిలిచారు..అందులో నాకు ఆహ్వానం అందింది,ఆ సమావేశంలో రాహుల్ గాంధీతో 15 నిమిషాలు మాట్లాడాను. నేను సంగారెడ్డి రాం నగర్ లోని రాం మందిర్ నుంచి విద్యార్థి నేతగా నా రాజకీయ ప్రయాణం మొదలయి...నేడు ఢిల్లీలో మీ నివాసానికి వచ్చి మీ ముందు కూర్చునే వరకు సాగిందని చెప్పాను. మీ ముందు ఒక రోజు ఇలా కూర్చొని మాట్లాడాలని అనుకున్నా.. ఇప్పుడు మాట్లాడుతున్నా నేను అనుకున్నది సాధించాను అని చెప్పానన్నారు. ఏ పార్టీ నుంచి ప్రధాన మంత్రి ఉన్నా అధికారంలో ఉన్నన్ని రోజులే గుర్తుపెట్టుకుంటారని చెప్పా, పదవులతో పని లేకుండా గుర్తు పెట్టుకునే వారిలో మీ కుటుంబమే ఉంటుందని చెప్పా నన్నారు.రాజకీయంగా నాకు మనసులో ఓ కోరిక ఉందని,నాకు ఓ పొలిటికల్ డిజైన్ ఉంది...అది నవంబర్ లో చెబుతా నన్నారు.ఈ మూడు నెలల కాలంలో రాజకీయంగా నాకు ఓ క్లారిటీ వస్తుందని అన్నారు.

# దేవాదాయ శాఖలో ఉద్యోగులకు పదోన్నతులు

### ఉత్తర్వులు అందజేసిన మంత్రి కొండా సురేఖ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జులై 29:** దేవాదాయశాఖ ఉద్యోగుల హక్కుల పరిరక్షణ, అర్చకుల సంక్షేమం, దేవాలయాల అభివృద్ధికి ప్రత్యేక కార్యా చరణను అమలు చేస్తున్నామని అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ తెలిపారు. బుధవారం బొగ్గులకుంటలోని తెలంగాణ సారస్వత పరిషత్(ఆడిటోరియం (దేవులపల్లి రామానుజరావు కళామందిరం) వేదికగా జరిగిన ఉద్యోగుల పదోన్నతుల కార్యక్రమానికి మంత్రి కొండా సురేఖ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వీరిలో 48 మంది ఉద్యోగులు గ్రేడ్ 3 ఈవోలుగా, ఇద్దరు గ్రేడ్ 2 ఈవోలుగా, ఒకరు గ్రేడ్ 1 ఈవోలుగా మంత్రి సురేఖ చేతులు మీదుగా పదోన్నతుల ఉత్తర్వులను అందుకున్నారు. వీరితో పాటు అర్చక సంక్షేమ నిధి ద్వారా అర్హులైన 15 మంది అర్చకులకు (వారి కటుంబ సభ్యులు) పదవీ విరమణ, మరణ గ్రాట్యుటీ, వివాహ రుణం మంజూరు ఉత్తర్వులను మంత్రి సురేఖ అందించారు. ఈ కార్యక్రమంలో దేవాదాయశాఖ డైరక్టర్ హనుమంతరావు, రాష్ట్ర దేవాలయ పాలనా సంస్థ డైరక్టర్ చిలకపాటి విజయ రాఘవాచార్యులు, ఆర్జెసి రామకృష్ణారావు, డిప్యూటి కమిషనర్ వినోద్ రెడ్డి, అడిషనల్ కమిషనర్లు జ్యోతి, శ్రీనివాస్, ఈవోల సంఘం అధ్యక్షుడు నరేందర్, టెంపుల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడు రంగారెడ్డి, తెలంగాణ దేవాదాయ శాఖ అర్చక ఉద్యోగ జాక్ కన్వీనర్ డి.వి.ఆర్.శర్మ, పలువురు దేవాదాయ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇవాళ గ్రేడ్ 3 ఈవోలుగా పదోన్నతులు అందుకున్నవారితో కలిపి, గతంలో గ్రేడ్ 1, గ్రేడ్ 2 కేటగిరీల్లోనూ పదోన్నతులు ఇవ్వడం ద్వారా మొత్తం 168 మంది ఉద్యోగులకు కార్యనిర్వహణాధి కారులుగా పదోన్నతి కల్పించి, ఉద్యోగుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపామని మంత్రి సురేఖ స్పష్టం చేశారు. సరిగ్గా పది రోజుల క్రితం రవీంద్రభారతి వేదికగా వేదపండితులు, అర్చకులు, పరిచారకులు, డోలు, సన్నాయి కళాకారులు తదితర 191 ధార్మిక నియామక ఉత్తర్వులు అందజేసిన విషయాన్ని మంత్రి సురేఖ గుర్తు చేశారు. తెలంగాణ ప్రజా ప్రభుత్వ నిబద్ధతకు ఇది నిదర్శనమని మంత్రి సురేఖ స్పష్టం చేశారు.అర్చక సంక్షేమ నిధి కింద పదవీ విరమణ, మరణ గ్రాట్యుటీని రూ.8 లక్షల నుంచి రూ.12 లక్షలకు పెంచడంతో పాటు అంత్యక్రియల సహాయాన్ని రూ.20 వేల నుంచి రూ.30 వేలకు పెంచి అర్చక కుటుంబాలకు మరింత భరోసా కల్పించామని మంత్రి తెలిపారు. సరస్వతి నది ఆది, అంత్య పుష్కరాలను విజయవంతంగా నిర్వహించామని, గోదావరి పుష్కరాలు (2027), కృష్ణ పుష్కరాలు (2028) కోసం ఇప్పటికే ప్రణాళికాబద్ధంగా కార్యాచరణను అమలు చేస్తున్నామని మంత్రి స్పష్టం చేశారు.

సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు పుష్కరాలు అంటే తెలంగాణ అనే స్థాయిలో రానున్న పుష్కరాలు చేపడతామని మంత్రి సురేఖ అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో దేవాదాయ శాఖలో సంస్కరణల యుగానికి శ్రీకారం చుట్టామని, నియామకాలు, పదోన్నతులు, ఉద్యోగుల సంక్షేమం, భక్తులకు మెరుగైన సేవలు, ఆలయాల అభివృద్ధి కార్యక్రమాలను సమన్వయం చేస్తూ ముందుకు



సాగుతున్నట్లు మంత్రి తెలిపారు. రాబోయే రోజుల్లో దేవాదాయశాఖ ప్రతిష్టను మరింత ఇనుమడింపచేస్తూ, దేవాదాయశాఖను మరో స్థాయిలో నిలబెట్టేలా కార్యక్రమాలు చేపడతామని మంత్రి సురేఖ స్పష్టం చేశారు. దశాబ్దాల నిరీక్షణకు తెరపడడంతో ఈవోలుగా పదోన్నతులు అందుకున్న ఉద్యోగులు భావోద్వేగానికి లోనయ్యారు. తమ ఉద్యోగ జీవితంలో ఎన్నో ఏళ్లుగా ఎదురు చూసిన గుర్తింపు లభించడంతో వారంతా మంత్రి కొండా సురేఖకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

# పిఎం అపాయింట్‌మెంట్ కోరిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**ఆయిల్‌పామ్ రైతుల సమస్యలు, విధాన నిర్ణయాలపై చర్చకు అవకాశం కల్పించాలని విజ్ఞప్తి**

**దక్షిణాది రాష్ట్రాల వ్యవసాయ మంత్రులతో సమావేశానికి సమయం ఇవ్వాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు లేఖ**

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జులై 29:**ఆయిల్‌పామ్ రైతుల ప్రయోజనాల పరిరక్షణ తో పాటు దేశంలో ఆయిల్‌పామ్ సాగు విస్తరణకు అవసరమైన విధానపరమైన నిర్ణయా లపై చర్చించేందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అపాయింట్‌మెంట్ కల్పించాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కోరారు. ఈ మేరకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి, కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు బుధవారం లేఖలు రాశారు. ప్రధానమంత్రి ప్రారంభించిన నేషనల్ మిషన్ ఆన్ ఎడిబుల్ ఆయిల్స్- ఆయిల్‌పామ్ (ఎన్‌ఎంఈఓ-ఓపి) దేశాన్ని వంట నూనెల ఉత్పత్తిలో స్వయం సమృద్ధి దిశగా తీసుకెళ్తున్న కీలక కార్యక్రమమని పేర్కొన్నారు. ఈ మిషన్ అమలులో దక్షి ణాది రాష్ట్రాలు ముందం జలో ఉన్నాయని, దేశవ్యాప్తంగా ఇప్పటివరకు సాగులోకి వచ్చిన ఆయిల్‌పామ్ విస్తీర్ణంలో 75 శాతం వాటా దక్షి ణాది రాష్ట్రాలదేనని తెలిపారు. తెలంగాణకు కేంద్రం నిర్దేశించిన 1.45 లక్షల హెక్టార్ల లక్ష్యానికి గాను ఇప్పటికే 0.98 లక్షల హెక్టార్లలో ఆయిల్‌పామ్ సాగు చేపట్టి దేశంలోనే అగ్రస్థానంలో నిలిచిందని వివరించారు. అయితే, కనీస హామీ ధర (ఎంజిపి), దిగుమతి సుంకాల స్థిర విధానం, నాణ్యమైన మొలకల లభ్యత, ఎన్‌ఎంఈఓ-ఓపికింద ఆర్థిక సహాయాలు వంటి అంశాల్లో విధానపరమైన నిర్ణయాలు అవసరమని మంత్రి పేర్కొన్నారు. రైతులకు స్థిరమైన విధాన భరోసా కల్పిస్తేనే ఆయిల్‌పామ్ సాగు విస్తరణ వేగవంతమై, దేశం వంటనూనెల దిగుమతులపై ఆధారపడే పరిస్థితి తగ్గుతుందని తెలిపారు. ఈ నేపథ్యంలో పార్లమెంట్ సమావేశాలలోనే దక్షిణాది రాష్ట్రాల వ్యవసాయ మంత్రు లతో కూడిన బృం దానికి ప్రధానమంత్రిని కలిసే అవకాశం కల్పించాలని మంత్రి విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశం ద్వారా రాష్ట్రాల ఉమ్మడి సమస్యలను, రైతుల అభిప్రాయాలను, ఆయిల్‌పామ్ రంగ అభివృద్ధికి అవసరమైన విధాన సూచనలను కేంద్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా.. కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ కూడా మంత్రి లేఖ రాశారు. ప్రధానమంత్రితో సమావేశం ఏర్పాటు చేయడంలో సహకరించాలని లేఖ ద్వారా కోరారు. దక్షి ణాది రాష్ట్రాల వ్యవసాయ మంత్రు లతో జరిగే ఈ సమావేశం ఆయిల్‌పామ్ రంగాన్ని మరింత బలోపేతం చేయడంతో పాటు రైతుల ఆదాయాన్ని పెంచేందుకు దోహద పడుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

## సాహితీ శిఖరం 'విశ్వంభర' డా. సి.నారాయణరెడ్డి

### త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డి

### ప్రముఖ మలయాళం కవి డా. కె.సచ్చిదానందన్‌కు సినారె జాతీయ పురస్కారం ప్రదానం

**హైదరాబాద్ (రవీంద్రభారతి), జులై 29, ప్రభాతవార్త :** డా. సినారె కేవలం కవి మాత్రమేకాదు.. రచయితగా, సినీ కవిగా, ఆచార్యులుగా, వక్తగా బహుముఖ ప్రజ్ఞాశాలి, విశ్వవిఖ్యాత సాహితీ శిఖరం విశ్వంభరుడని త్రిపుర రాష్ట్ర గవర్నరు నల్లు ఇంద్రసేనారెడ్డి అన్నారు. అప్పటి నిజాం పాలనతో ఉర్దూలో చదువుకున్నా తెలుగు సాహిత్యంలో అత్యున్నత శిఖరాలను అధిరోహించి సాహిత్యానికి చేసిన సేవ ఎనలేనిదని కొనియాడారు. ఆయన ఉర్దూ గజల్స్‌ని తెలుగుభాషలోని అనువదించి తెలుగు గజల్స్‌కి ప్రాముఖ్యతను తీసుకొచ్చారన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని నాటకాలు, భాగవతాలు, చిరుతల రామాయణం, భజన తదితర కార్యక్రమాల్లో పాలుపంచుకుంటూ అక్కడి ప్రకృతిని అర్థం చేసుకుని అక్షరరూపంలో వ్రాయడం మొదలు పెట్టారన్నారు. సినారె వ్రాసిన పాటలు తెలుగుజాతి హృదయాల్లో కలకాలం పదిలంగా ఉంటాయని స్పష్టం చేశారు. శ్రీమతి సుశీలా నారాయణరెడ్డి ట్రస్టు హైదరాబాద్ ఆధ్వర్యంలో జ్ఞానపీఠ పురస్కార గ్రహీత, పద్మభూషణ్ డా. సి. నారాయణరెడ్డి 95వ జయంతిని పురస్కరించుకుని బుధవారం రాత్రి రవీంద్రభారతి ప్రధాన మందిరంలో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన నల్లు ఇంద్రసేనరెడ్డి విశిష్ట అతిథులు నడిమెళ్ల భాస్కర్, డా. పత్తిపాక మోహన్, చేతన, సంస్థ అధ్యక్షురాలు సి.గంగ, మనవడు లయచరణ్‌రెడ్డి, మనుమరాలు మనస్వినిరెడ్డి తదితరులతో కలిసి ప్రముఖ మలయాళం కవి డా. కె.సచ్చిదానందన్‌ను ఘనంగా సత్కరించి విశ్వంభర డా. సి.నారాయణరెడ్డి జాతీయ సాహిత్య పురస్కారం, 5లక్షల రూపాయల నగదు, జ్ఞాపిక, ప్రశంసాపత్రం ప్రదానం చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. సభకుముందు డా. సినారె రచించిన మీరాబాయి కావ్యం ఆధారంగా రూపొందించిన నృత్యగీత ప్రదర్శన ప్రదీప్‌రెడ్డి, బృందం నృత్యకల్పనలో అద్భుతంగా ప్రదర్శింపబడి ఆహుతులను ఎంతగానో ఆకట్టుకుంది.



డా. కె.సచ్చిదానందన్‌ను సినారె జాతీయ సాహిత్య పురస్కారంతో సత్కరిస్తున్న త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డి, గంగ, భాస్కర్, మనస్విని, లయచరణ్‌రెడ్డి తదితరులు

## తుమ్మిడిహట్టి ఆనకట్ట నిర్మాణంపై ప్రీ ఫీజబిలిటీ నివేదిక సిద్ధం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,జులై29:** ఉత్తర తెలంగాణలో తుమ్మిడిహట్టి వద్ద ఆనకట్ట నిర్మాణ కసరత్తును రాష్ట్ర ప్రభుత్వం వేగవంతం చేసింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆనకట్ట ప్రీ ఫీజబిలిటీ నివేదిక సిద్ధమవుతోంది. 152 నుంచి 148 అడుగుల ఎత్తుతో నిర్మిస్తే లభ్యమయ్యే జలాలతో నివేదిక సిద్ధం చేసినట్లు సమాచారం. అటు మహారాష్ట్రతో వీలైనంత త్వరగా చర్చలు జరపాలన్న ఆలోచనలో రాష్ట్ర ప్రభుత్వం ఉంది. ప్రభుత్వ ఆదేశాల మేరకు తుమ్మిడిహట్టి వద్ద ఆనకట్ట నిర్మాణం కోసం ప్రీ ఫీజబిలిటీ నివేదికను ఆర్‌వీ అసోసియేట్స్ సంస్థ ఇప్పటికే సిద్ధం చేసి ప్రభుత్వానికి అందించినట్లు సమాచారం. అయితే అందులో కొన్ని మార్పులు, చేర్పులు చేయాలని సూచించినట్లు తెలిసింది. వాటిని పరిగణలోకి తీసుకొని నివేదికకు తుది మెరుగులు దిద్దుతున్నట్లు సమాచారం.

తుమ్మిడిహట్టి వద్ద రెండు ఆనకట్టలుగా ప్రాజెక్టును నిర్మించాలని ప్రతిపాదించినట్లు తెలిసింది. వైన్‌గంగ, వార్ధా నదులపై రెండు వేర్వేరు బ్యారేజీలను నిర్మించి కాంక్రీట్ బండ్‌తో అనుసంధానించాలని పేర్కొన్నట్లు సమాచారం. 152 మీటర్ల ఎత్తుతో ఆనకట్ట నిర్మించాలని మొదటి నుంచి భావిస్తున్నారు. ఆ ఎత్తులో బ్యారేజ్ నిర్మిస్తే అక్కడ 165 టీఎంసీల వరకు నీటి లభ్యత ఉంటుందని నివేదించినట్లు తెలిసింది. 150 మీటర్ల ఎత్తులో 129 టీఎంసీలు, 149 మీటర్ల ఎత్తులో 80 టీఎంసీలు, 148 మీటర్ల ఎత్తులో నిర్మిస్తే 58 టీఎంసీల వరకు నీటి లభ్యత ఉంటుందని పీఎఫ్‌ఆర్‌లో పేర్కొన్నట్లు సమాచారం.తుమ్మిడిహట్టి నుంచి మైలారం వరకు 71.5 కిలోమీటర్ల మేర గతంలోనే నిర్మించిన కాల్వ ఉంది. అక్కడి నుంచి బొగ్గు బ్లాకులున్న మార్గాన్ని తాకకుండా మరో అలైన్‌మెంట్‌ను సూచించినట్లు తెలిసింది. 22 కిలోమీటర్ల మేర సొరంగ మార్గం, ఐదు కిలోమీటర్ల ఓపెన్‌కెనాల్‌ద్వారా సుందిళ్ల జలాశయం వరకు నీటిని తరలించాలని పేర్కొన్నట్లు సమాచారం. ప్రీ ఫీజబిలిటీ నివేదికలోని కొన్ని అంశాలకు మార్పులు, చేర్పులు చేయాలని నీటిపారుదల శాఖ వర్గాలు సూచించినట్లు తెలిసింది. ప్రీ ఫీజబిలిటీ నివేదికను త్వరలోనే ప్రభుత్వానికి తిరిగి సమర్పించనున్నట్లు సమాచారం. తుమ్మిడిహట్టి వద్ద ఆనకట్ట నిర్మాణం విషయమై మహారాష్ట్ర ప్రభుత్వంతో వీలైనంత త్వరగా చర్చలు జరపాలన్న ఆలోచనలో రాష్ట్ర ప్రభుత్వం ఉంది.

## పెద్ది సుదర్శన్‌రెడ్డికి గన్‌మెన్లను ఎందుకు తొలగించారు?

### బిఆర్‌ఎస్ ప్రధాన కార్యదర్శి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,జులై29:** సెక్యూరిటీ రివ్యూ అని సమావేశం పెట్టి పెద్ది సుదర్శన్‌రెడ్డికి ఉన్న గన్‌మెన్లను ఎందుకు తొలగించారని బిఆర్‌ఎస్ ప్రధాన కార్యదర్శి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ ప్రశ్నించారు. ఆయనకు థ్రెట్ ఉన్నది అని 25 సంవత్సరాల నుండే సెక్యూరిటీ ఉన్నది దీనిపై కోర్టుకు వెళ్లారు. కోర్టులో స్టే ఇచ్చారు. దీనితో వరంగల్ జిల్లా సీపీ వద్దకు వెళ్తే నాకు సంబంధం లేదు స్టేట్ ఇంటలిజెన్స్ వాళ్లు చూస్తారని చెప్పారు. ఈ నేపథ్యంలో పెద్ది సుదర్శన్‌రెడ్డి తీవ్ర ఒత్తిడికి లోనయ్యారని చెప్పారు. బుధవారం తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. డీజీపీ నాకు కూడా ఒక్క నోటీస్ ఇచ్చారు. నీకు బుల్లెట్ ప్రూఫ్ వాహనం తొలగిస్తున్నాం. సెక్యూరిటీ తగ్గిస్తున్నాం అని లేఖ రాశారు. ఏమైనా థ్రెట్ ఉంటే మాత్రమే సెక్యూరిటీ ఇస్తామని చెప్పారు. సరే బాగానే ఉన్నది మరి మైనంపల్లి హన్మంతరావు ఏం కూంబింగ్ ఆపరేషన్లు చేశాడని, ఏ తీవ్రవాద సంస్థ, ఏ మావోయిస్టులు ఆయనను టార్గెట్ చేశారని 2+2 సెక్యూరిటీ ఇచ్చారు..? అని ప్రశ్నించారు.

కొండా మురళీ ఎమ్మెల్సీ కాదు, కార్పొరేషన్ చైర్మన్ కాదు. ఆయనకు 2+2 సెక్యూరిటీ ఇచ్చారు.. ఆయనకు ఏ హోదా ఉందని 2+2 సెక్యూరిటీ ఇచ్చారు..? అనుముల తిరుపతి రెడ్డి, అనుముల కొండల్ రెడ్డి ఏం కూంబింగ్ ఆపరేషన్లు చేశారని, ఏ ఉగ్రవాద సంస్థతో ముప్పు ఉందని, విదేశాల నుంచి దిగుమతి చేసుకున్న అత్యాధునిక సెమీ ఆటోమేటెడ్ వెపన్స్ ఇచ్చారు..? అని ప్రశ్నించారు. అనుములు తిరుపతి రెడ్డికి ఉన్న అర్హత ఏంటి..?పెద్ది సుదర్శన్ రెడ్డి లేని అర్హత ఏంటీ? చెప్పాలన్నారు. సత్యవతి రాథోడ్ తెలంగాణ రాష్ట్రంలో తొలి గిరిజన మహిళా మంత్రి.. ఆమె ఇప్పుడు మాజీ మంత్రి, మాలోతు కవిత మాజీ ఎంపీ.. వారి గన్‌మెన్లను తీసేశారు. జోగు రామన్న మాజీ మంత్రి ఆయన గన్‌మెన్లను తొలగిం చారు. అదే జిల్లాలో ఇంద్రకరణ్ రెడ్డికి 2+2 గన్‌మెన్లను ఇచ్చారు ఎందుకు..? అని అడిగారు. కుందూరు జానారెడ్డి ప్రస్తుత హోదా ఏంటి..? ఆయనకు 2+2 గన్‌మెన్లను ఇచ్చి, అత్యాధునిక బుల్లెట్‌ప్రూఫ్ వాహనం ఇచ్చారు. జానారెడ్డి మాజీ మంత్రి అయితే సత్యవతి రాథోడ్, జోగు రామన్న కూడా మాజీ మంత్రులే కదా. మరి వీళ్లకు ఎందుకు సెక్యూరిటీ తొలగించారు..? బీఆర్‌ఎస్ నాయకులకు ఒక న్యాయం.. కాంగ్రెస్ నాయకులకు ఒక న్యాయమా..? ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్ అని ప్రశ్నించారు.




బుధవారం తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతున్న ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్

## రాష్ట్రంలో చక్కెర పరిశ్రమల పునరుద్ధరణకు సమగ్ర కార్యాచరణ

### సిఎస్ సంజయ్‌జాజు సమీక్ష

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,జులై29:**రాష్ట్రంలో చెరకు పంట విస్తీర్ణాన్ని గణనీయంగా పెంచడంతో పాటు చక్కెర పరిశ్రమల పునరుద్ధరణ, వాటి ఉత్పాదక సామర్థ్యాన్ని మరింత మెరుగుపరిచేందుకు సమగ్ర కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు సంబంధిత అధికారులను ఆదేశించారు.రాష్ట్రంలో షుగర్ పరిశ్రమల పునరుద్ధరణ, చెరకు పంట విస్తీర్ణం పెంపు కోసం ప్రభుత్వం జారీ చేసిన జి.ఓ. నెం.86 ప్రకారం ఏర్పాటు చేసిన కమిటీ సమావేశం బుధవారం సచివాలయంలో ప్రధాన కార్యదర్శి అధ్యక్షతన జరిగింది. సమావేశంలో వ్యవసాయ శాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్, పరిశ్రమల శాఖ ప్రత్యేక కార్యదర్శి కృష్ణ ఆదిత్య, చెరకు రైతు ప్రతినిధులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ రాష్ట్రంలో మొత్తం 12 చక్కెర కర్మాగారాలు ఉండగా ప్రస్తుతం 7 కర్మాగారాలు మాత్రమే పనిచేస్తున్నాయని తెలిపారు. ప్రస్తుతం పనిచేస్తున్న పరిశ్రమలు పూర్తి సామర్థ్యంతో పనిచేయాలంటే ఏటా సుమారు 50 లక్షల మెట్రిక్ టన్నుల చెరకు అవసరమవుతుందని, ప్రస్తుతం రాష్ట్రంలో కేవలం 20 లక్షల మెట్రిక్ టన్నుల చెరకు మాత్రమే ఉత్పత్తి అవుతోందని వివరించారు.వరి పంటతో పోలిస్తే చెరకు సాగుకు తక్కువ నీరు అవసరమవుతుందని, డ్రిప్ ఇరిగేషన్ వంటి ఆధునిక సాగు పద్ధతులను అవలంబిస్తే దిగుబడులు పెరగడంతో పాటు సాగు వ్యయం కూడా తగ్గుతుందని పేర్కొన్నారు. 2026-27 వ్యవసాయ సీజన్‌లో రాష్ట్రవ్యాప్తంగా 19 వేల మంది రైతులు 26 వేల హెక్టార్లలో చెరకు సాగు చేస్తున్నట్లు తెలిపారు.చెరకు సాగు విస్తీర్ణాన్ని పెంచేందుకు,చక్కెర పరిశ్రమలకు అవసరమైన ముడి చెరకు లభ్యతను మెరుగుపరచేందుకు ఇతర రాష్ట్రాల్లో అమలు చేస్తున్న ప్రోత్సాహకాలు, విధానాలను సమగ్రంగా అధ్యయనం చేసి నివేదికను తక్షణమే సమర్పించాలని అధికారులను ప్రధాన కార్యదర్శి ఆదేశించారు.

## 'సర్' ప్రక్రియను కాంగ్రెస్ బిఎల్‌ఎలు వేగవంతం చేయాలి

### ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజలకు చేరువ చేసేందుకు యాక్షన్ ప్లాన్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,జులై29:** ప్రత్యేక సమగ్ర సవరణ(సర్) ప్రక్రియను కాంగ్రెస్ బీఎల్‌ఏలు వేగవంతం చేయాలని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆదేశించారు. ప్రభుత్వ కార్యక్రమాలు ప్రజలకు చేరువ చేసేందుకు యాక్షన్ ప్లాన్ సిద్ధం చేస్తున్నామని వెల్లడించారు. ఎమ్మెల్సీ గ్రాడ్యుయేషన్ ఎలక్షన్‌పై జిల్లా ఇన్‌చార్జ్, జిల్లా పీసీసీలతో చర్చించి ముగ్గురు సభ్యులతో ప్యానల్ ఏర్పాటు చేసి నివేదిక అందించాల్సి ఉంటుందని తెలిపారు. ప్రతి ఒక్కరికి ఓటు హక్కు ఉండాలని సూచించారు. బీఎల్‌ఏలు బాగా పనిచేస్తున్నారని అభినందించారు. ఏఐసీసీ కార్యాలయంలో తెలంగాణ కోఆర్డినేషన్ కమిటీ సమావేశం బుధవారం జరిగిందని మల్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు.

**ఢిల్లీలో తెలంగాణ కోఆర్డినేషన్ కమిటీ సమావేశం**

కాగా, ఢిల్లీ ఇందిరా భవన్‌లో కాంగ్రెస్ పార్టీ తెలంగాణ కోఆర్డినేషన్ కమిటీ సమావేశం బుధవారం జరిగింది. ఈ సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, సీతక్క , సీడబ్ల్యూసీ సభ్యులు మంత్రి దామోదర్ రాజానర్సింహ, వంశీ చంద్ పాల్గొన్నారు. ఏఐసీసీ తెలంగాణ ఇన్‌చార్జ్ మీనాక్షినటరాజన్ అధ్యక్షతన ఈ సమావేశం జరిగింది.

## సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘటన కేసు ఆగస్టు 17కు వాయిదా

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,జులై29:**నగరంలోని సంధ్యా థియేటర్ తొక్కిసలాట ఘటనపై నమోదైన కేసు విచారణను ఆగస్టు 17కి నాంపల్లి కోర్టు వాయిదా వేసింది. కేసు విచారణ సందర్భంలో న్యాయస్థానం పలు కీలక ఆదేశాలు జారీ చేసింది. అనారోగ్య సమస్యల కారణంగా ఈ కేసులోని ముగ్గురు నిందితులు కోర్టుకు హాజరుకాలేకపోతున్నారని నిందితుల తరఫు న్యాయవాదులు కోర్టుకు వెల్లడించారు. హీరో అల్లు అర్జున్‌కు ఇప్పటికే వ్యక్తిగత హాజరు నుంచి మినహాయింపు లభించిన విషయం విదితమే. విచారణలో భాగంగా ఛార్జిషీట్‌తో పాటు కేసులోని డిజిటల్ పరికరాలు, ఎలక్ట్రానిక్ పరికరాలు, సిసిటివి ఫుటేజీలను తమకు ఇంకా అందజేయలేదని నిందితుల తరఫు న్యాయవాదులు కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఈ విజ్ఞప్తిని పరిశీలించిన న్యాయస్థానం ఛార్జిషీట్‌లో పేర్కొన్న అన్ని డిజిటల్ ఆధారాలు, వీడియో ఫుటేజీలు, పత్రాలకాపీలను తదుపరి విచారణ నాటికి నిందితుల న్యాయవాదులకు సమర్పించాలని పోలీసులను ఆదేశించింది. అనంతరం కేసు తదుపరి విచారణను ఆగస్టు 17కి వాయిదా వేస్తున్నట్లు ప్రకటించింది.

# పార్టీ లైన్ దాటి మాట్లాడొద్దు

**● టిడిపి నేతలకు ఎపి అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు**



**విజయవాడ, జులై 29 ప్రభాతవార్త ప్రతినిధి:** టిడిపి నేతలు కొంతమంది చేస్తున్న వ్యాఖ్యలతో కార్యకర్తలు ఇబ్బంది పడుతున్నారని ఆంధ్రప్రదేశ్ తెలుగుదేశం అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు పేర్కొన్నారు. అందువల్ల నేతలు పార్టీ లైన్ దాటి మాట్లాడవద్దని ఆదేశించారు. ఎవరైనా గీత దాటితే మాత్రం చర్యలు చాలా కఠినంగా ఉంటాయని హెచ్చరించారు. కూటమి ధర్మాన్ని అందరు తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు. ఈ విషయాన్ని అందరు దృష్టిలో పెట్టుకోవాలని దిశానిర్దేశం చేశారు. బుధవారం అమరావతిలోని టిడిపి కార్యాలయంలో పల్లా శ్రీనివాసరావు మీడియాతో మాట్లాడుతూ, బోండా ఉమామహేశ్వరరావు ఇచ్చిన వివరణతో హైకమాండ్ సంతృప్తి చెందిందని తెలిపారు. పార్టీ లైన్ దాటి మాట్లాడిన వారిపై చర్యలు మాత్రం తప్పవని హెచ్చరించారు. పార్టీ నియమావళికి అందరు కట్టుబడి ఉండాలని ఆదేశించారు. వైసిపి నేతలతో టిడిపి నేతలు ఎవరు వేదిక పంచుకోవద్దని హుకుం జారీ చేశారు. ఎక్కడైనా నివాళి అర్పించాల్సి వేస్తే వెళ్లి రావాలని సూచించారు. టిడిపి అధినేత చంద్రబాబు ఈ విషయంలో చాలా సీరియస్‌గా ఉన్నారని తెలిపారు. అందరు ఈ విషయాన్ని గుర్తు పెట్టుకోవాలని పల్లా శ్రీనివాసరావు పేర్కొన్నారు.

# రాష్ట్ర పునర్ నిర్మాణం కోసం ప్రభుత్వం ప్రయత్నం: మంత్రి నిమ్మల



**విజయవాడ, జులై 29 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్ర పునర్ నిర్మాణం కోసం కూటమి ప్రభుత్వం ప్రయత్నిస్తోందని జలవనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు వ్యాఖ్యానించారు. రాష్ట్రం కోసం నాడు కూటమి ఏర్పడిందని పేర్కొన్నారు. టిడిపి రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ గొడ్డలి పార్టీ రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిందని ధ్వజమెత్తారు. టిడిపి నాయకులు, కార్యకర్తలు అందరు కూడా అధినేతకు మద్దతు ఇవ్వాలని సూచించారు. పార్టీ సిద్ధాంతాలకు, లైన్‌కు కట్టుబడి పని చేయాలని ఆదేశించారు. మనకు వచ్చిన గౌరవం, అధికారం పార్టీ ద్వారా, చంద్రబాబు ద్వారా వచ్చిందని నేతలు అందరు తెలుసుకోవాలని తెలిపారు. పార్టీ లైన్ దాటిన వారిని, పార్టీకి నష్టం కలిగించే వారు ఎవరైనా కూడా ఎంతటివారు అయినా కూడా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు కూడా బాధ్యతాయుతంగా ఉండాలని మంత్రి నిమ్మల సూచించారు. కూటమి ధర్మాన్ని పాటించకపోతే మాత్రం ఎంతటివారైనా కూడా ఉపేక్షించేది లేదని సీఎం చంద్రబాబు హెచ్చరించారని అన్నారు. కొంతమంది నేతలను పిలిపించి మాట్లాడుతున్నామని తెలిపారు. వ్యక్తుల కంటే పార్టీ ముఖ్యమనేది అందరు తెలుసుకోవాలని స్పష్టం చేశారు. పార్టీకి, కూటమికి ఎవరైనా విఘాతం కలిగిస్తే మాత్రం హై కమాండ్ ఊరుకోదని హెచ్చరించారు. అంతర్గత ప్రజాస్వామ్యం ఉందని ఎవరైనా మాట్లాడితే మాత్రం ఉపేక్షించవద్దని చంద్రబాబు స్పష్టం చేశారని మంత్రి నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు.

# కంగనా రనౌత్ వ్యాఖ్యలు సరికాదు

**● సిపిఐ క్రమశిక్షణా సంఘం చైర్మన్ కె. నారాయణ**



**విజయవాడ, జులై 29 ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రదర్శనకారుల మనోభావాలను దెబ్బతీసిన తన గత 'బొద్దింకల్లు' వ్యాఖ్యల విషయంలో సుప్రీంకోర్టు ఛీఫ్ జస్టిస్ సూర్యకాంత్ సానుకూలంగా స్పందించడం అభినందనీయమని సిపిఐ జాతీయ సమితి క్రమశిక్షణా సంఘం చైర్మన్ డాక్టర్ కె. నారాయణ వ్యాఖ్యానించారు. ఆందోళనకారులపై చేసిన వ్యాఖ్యల వల్ల కలిగిన బాధను గుర్తించి, వాటిని సరిదిద్దుకునే వైఖరి న్యాయవ్యవస్థ ఔన్నత్యాన్ని ప్రతిబింబి స్తుందన్నారు. జెన్ జెడ్ యువత, మహిళలను ఉద్దేశించి కంగనా రనౌత్ చేసిన అవమానకరమైన, అభ్యంతరకరమైన వ్యాఖ్యలు ఏమాత్రం సమర్థనీయమైనవి కావని నారాయణ పేర్కొన్నారు. ప్రజా జీవితంలో ఉన్న వ్యక్తులు తమ అభిప్రాయాలను వ్యక్తంచేసే సమయంలో బాధ్యతాయుతంగా, సంయ మనంతో వ్యవహరించాలి. ఇటువంటి వ్యాఖ్యలు సమాజంలో విభేదాలను మరింత పెంచడమే కాకుండా ప్రజాస్వామ్య విలువలను దెబ్బతీస్తాయన్నారు. కంగనా రనౌత్ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నా. ఆమె అవమానించిన యువతకు, మహిళలకు బేషరతుగా బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

# కరవు మండలాలు ప్రకటించాలి

**● సిఎంకు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి ఈశ్వరయ్య లేఖ**



**అనంతపురం, జులై 29 ప్రభాతవార్త బ్యూరో:** ఆంధ్రప్రదేశ్‌లో ఎల్‌నినో ప్రభావంతో ఏర్పడిన తీవ్ర వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో రాష్ట్రంలోని అన్ని వర్షాభావ మండలాలను తక్షణమే కరువు మండలాలుగా ప్రకటించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు బుధవారం లేఖ రాశారు. సాధారణంగా 225 మి.మీ. వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా కేవలం 104 మి.మీ. మాత్రమే కురిసిందని, రాష్ట్రవ్యాప్తంగా 56 శాతం వర్షపాతం లోటు నమోదైందని లేఖలో పేర్కొన్నారు. ఖరీఫ్‌లో 30.84 లక్షల హెక్టార్ల సాధారణ సాగుకు బదులుగా ఇప్పటివరకు కేవలం 16.35 లక్షల హెక్టార్లలో మాత్రమే సాగు జరిగిందని, వరి, పత్తి, వేరుశనగ, కంది, మొక్కజొన్న, టమాటా తదితర పంటలు ఎండిపోతుండగా ఉద్యాన పంటలు కూడా తీవ్రంగా దెబ్బతిన్నాయని వివరించారు. ప్రత్యామ్నాయ పంట విత్తనాలను రైతులకు 100శాతం ఉచితంగా పంపిణీ చేయాలని, అన్ని పంటలకు ఉచిత పంటల బీమాను పునరుద్ధరించి బీమా ప్రీమియాన్ని ప్రభుత్వమే భరించాలని, పంటల బీమా గడువును ఆగస్టు 31 వరకు పొడిగించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే పంట రుణాలను మాఫీ చేయాలని కోరారు. ఉపాధి హామీ పనులు వెంటనే ప్రారంభించడం, పశుగ్రాసం, మంచినీటి సరఫరా కల్పించడం, వ్యవసాయ ఇన్‌పుట్‌ల ధరలు తగ్గించడం, పొగాకు రైతులకు మద్దతు నిధి, రొయ్యలకు కనీస మద్దతు ధర నిర్ణయించడం, ఎరువుల యాప్‌ను రద్దు చేయడం వంటి 14 ప్రధాన డిమాండ్లను ప్రభుత్వం అత్యవసరంగా అమలు చేయాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య తన లేఖలో కోరారు.

# ఎర్రచందనం స్మగ్లర్‌కు ఐదేళ్ల జైలు



**తిరుపతి, జులై 29 ప్రభాతవార్త ప్రతినిధి:** ఎర్రచందనం అక్రమ రవాణా చేస్తూ పట్టుబడిన స్మగ్లర్‌కు ఐదేళ్ల జైలు శిక్ష, రూ.6లక్షలు జరిమానా విధిస్తూ ఆర్‌ఎస్‌ఎస్ ఎడిజె న్యాయస్థానం న్యాయమూర్తి నరసింహామూర్తి బుధవారం తీర్పు నిచ్చారు. ఆంధ్రప్రదేశ్ శేషాచలం రిజర్వు అటవీ ప్రాంతంలో జరుగుతున్న ఎర్రచందనం అక్రమ రవాణాను అరికట్టే లక్ష్యంతో ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధక దళం కఠిన చర్యలు అమలు చేస్తోంది. 2019 సంవత్సరంలో కేసులో ముద్దాయి తమిళనాడు తిరువన్నామలై జిల్లా పోలూరు తాలూకా పాదిరి గ్రామానికి చెందినదొరసామి ఏలుమలై ఎర్రచందనం దుంగలతో పట్టుబడ్డాడు. ఇతనిపై నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి ఈ స్మగ్లర్‌కు ఐదేళ్ల జైలు శిక్షతో బాటు రూ.6లక్షలు జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు.

# విద్యుత్ ఉత్పత్తిలో రాజీ లేదు

**● పూర్తి సామర్థ్యంతో యూనిట్ల నిర్వహణ.. పిఎల్ఎఫ్ పెంపు ● 10 రోజుల బొగ్గు నిల్వలు, ఆర్అండ్ఎం పనులు వేగవంతం ● ఎపి జెన్‌కో ఎండి ఎస్.నాగలక్ష్మి**



**విజయవాడ, జులై 29 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్ర ప్రజలకు 24 గంటల పాటు నాణ్యమైన, నిరంతర విద్యుత్ సరఫరా అందించాలంటే థర్మల్ విద్యుత్ కేంద్రాలు పూర్తి సామర్థ్యంతో పనిచేయడం అత్యంత కీలకమని ఆంధ్రప్రదేశ్ పవర్ జనరేషన్ కార్పొరేషన్ (ఎపి జెన్‌కో) మేనేజింగ్ డైరెక్టర్ ఎస్.నాగలక్ష్మి స్పష్టం చేశారు. విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా అన్ని ఉత్పత్తి యూనిట్లను గరిష్ట సామర్థ్యంతో నిర్వహిస్తూ రాష్ట్ర గ్రిడ్‌కు నిరంతర విద్యుత్ అందించేందుకు అధికారులు అప్రమత్తంగా పనిచేయాలని ఆదేశించారు. బుధవారం విజయవాడ సమీపంలోని ఇబ్రహీంపట్నంలో ఉన్న డాక్టర్ నార్ల తాతారావు థర్మల్ పవర్ స్టేషన్ (విటిపిఎస్)ను థర్మల్ డైరెక్టర్ అశోక్ కుమార్ రెడ్డితో కలిసి ఆమె క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు. విద్యుత్ ఉత్పత్తి యూనిట్లు, బొగ్గు నిర్వహణ వ్యవస్థ, బాయిలర్లు, టర్బైన్లు, స్విచ్‌యార్డులు, నిర్వహణ ప్రమాణాలు, భద్రతా ఏర్పాట్లు, పర్యావరణ పరిరక్షణ చర్యలను పరిశీలించిన అనంతరం ప్లాంట్ పనితీరుపై ఉన్నతాధికారులతో ఎండి సమగ్ర సమీక్ష నిర్వహించారు. ప్లాంట్ లోడ్ ఫ్యాక్టర్ (పిఎల్ఎఫ్)ను మరింత పెంచడంతో పాటు ముందస్తు నిర్వహణ చర్యలను పటిష్టం చేయాలని ఆదేశించారు. ట్రిప్పింగ్‌లు, సాంకేతిక లోపాలు, బ్రేక్‌డౌన్‌లు తగ్గించేలా నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని, హీట్‌రేట్‌ను మెరుగుపరచి ఇంధన వినియోగ సామర్థ్యాన్ని పెంచడం ద్వారా విద్యుత్ ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించాలని సూచించారు. వాల్మెట్ డిఎన్‌ఏ డిసిఎస్ వ్యవస్థ ఆధునికరించటం యూనిట్4 జనరేటర్, బాయిలర్ పనులను పరిశీలించిన నాగలక్ష్మి, నిర్దేశిత గడువులోగా అన్ని పనులను పూర్తి చేయాలని అధికారులకు స్పష్టం చేశారు. సాంకేతిక లేదా పరిపాలనా సమస్యలు ఎదురైతే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ పెరుగుతున్న నేపథ్యంలో కనీసం 10 రోజుల అవసరాలకు సరిపడా బొగ్గు నిల్వలు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బొగ్గు సరఫరా సంస్థలు, రైల్వే శాఖతో నిరంతర సమన్వయం కొనసాగించాలని సూచించారు. ఎల్‌నినో పరిస్థితుల కారణంగా విద్యుత్ వినియోగం మరింత పెరిగే అవకాశం ఉందని పేర్కొన్న ఎండీ, పెరుగుతున్న డిమాండ్‌కు అనుగుణంగా అన్ని యూనిట్లలో స్థిరమైన విద్యుత్ ఉత్పత్తి కొనసాగించేలా అధికారులు, సాంకేతిక సిబ్బంది సమన్వయం తో పనిచేయాలని సూచించారు. రాష్ట్రంలోని ప్రతి ఇంటికి, ప్రతి రైతుకు, ప్రతి పరిశ్రమకు నిరంతర నాణ్యమైన విద్యుత్ అందించేందుకు ఏపీజెన్‌కో పూర్తిస్థాయిలో కట్టుబడి ఉందని నాగలక్ష్మి తెలిపారు.

# విద్యుత్ బిల్లుల చెల్లింపు మరింత సులభతరం

**● యుపిఐ యాప్‌లతో నేరుగా చెల్లించే అవకాశం ● ఎస్‌పిడిసిఎల్ సిఎండి శివశంకర్ లోతేటి**






**తిరుపతి, జులై 29 ప్రభాతవార్త ప్రతినిధి:** విద్యుత్ వినియోగదారులకు మరింత మెరుగైన సేవలను అందించేందుకు ఆంధ్రప్రదేశ్ దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఎస్‌పిడిసిఎల్) కృషి చేస్తోంది. వినియోగదారులు సులభంగా విద్యుత్తు బిల్లును చెల్లించే ప్రక్రియను మరింత సరళతరం చేసింది. ఈ ప్రక్రియలో భాగంగానే యూపీఐ యాప్‌ల నుండి నేరుగా విద్యుత్ బిల్లులను చెల్లించే విధానాన్ని అందుబాటులోకి తీసుకువచ్చింది. ఎపిఎస్‌పిడిసిఎల్‌లో ఇప్పటి వరకు అధికారిక వెబ్‌సైట్, మొబైల్ యాప్, డైనమిక్ క్యూ ఆర్ కోడ్, వాట్సాప్ గవర్నెన్స్ (మనమిత్ర) ద్వారా మాత్రమే విద్యుత్ బిల్లులను చెల్లించేందుకు అవకాశం ఉండేది. అయితే వినియోగదారుల సౌలభ్యాన్ని దృష్టిలో ఉంచుకొని ఫోన్ పే, పేటీఎం, గూగుల్ పే, అమెజాన్ పే తదితర యూపిఐ యాప్‌ల నుండి నేరుగా బిల్లుల చెల్లింపు ప్రక్రియ ద్వారా వేగవంతమైన, సురక్షితమైన, పారదర్శకమైన చెల్లింపు వ్యవస్థను అమలు చేస్తోంది. యూపిఐ యాప్‌ల ద్వారా వినియోగదారులు కొన్ని క్షణాల్లో విద్యుత్ బిల్లులను సులభంగా చెల్లించే అవకాశం ఏర్పడింది. సంస్థ పరిధిలోని నెల్లూరు, తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య, కడప, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల్లో డిజిటల్ చెల్లింపులను మరింత ప్రోత్సహించే దిశగా సంస్థ చర్యలు చేపట్టడం జరుగుతోంది. ఈ నేపథ్యంలోనే ఎలక్ట్రిసిటీ రెవెన్యూ కార్యాలయాల (ఇఆర్‌ఓ)లో కూడా డిజిటల్ చెల్లింపులకే ప్రాధాన్యతనివ్వడం జరుగుతోంది. నగదు లావాదేవీలను పూర్తిస్థాయిలో తగ్గించేందుకు వీలుగా విద్యుత్తు బిల్లు వసూళ్ల కేంద్రాలను మూసివేసే ప్రక్రియను వేగవంతం చేస్తోంది.

**విద్యుత్ బిల్లుల చెల్లింపు మరింత సులభం:** విద్యుత్ బిల్లుల ఆన్‌లైన్ చెల్లింపుల ప్రక్రియను మరింత సులభతరంగా తీర్చిదిద్దాం. ఆన్లైన్ చెల్లింపులపై వినియోగదారుల్లో విస్తృత అవగాహన కల్పించేందుకు ఇప్పటికే చర్యలు చేపట్టాం. యూపీఐ యాప్‌ల నుండి నేరుగా సామాన్యులు కూడా సులభంగా బిల్లులను చెల్లించే అవకాశం ఏర్పడడంతో డిజిటల్ చెల్లింపులు త్వరలోనే వంద శాతానికి చేరుకుంటాయి. డిజిటల్ చెల్లింపుల శాతాన్ని మెరుగుపరిచేందుకు తీసుకుంటున్న చర్యల్లో భాగంగానే దశలవారీగా బిల్లు వసూళ్ల కేంద్రాలను మూసివేస్తాం. డిజిటల్ చెల్లింపుల సందర్భంగా గుర్తు తెలియని లింకులు, సందేశాలు లేదా నకిలీ యాప్‌లను నమ్మి మోసపోవద్దు. సురక్షితమైన, వేగవంతమైన, పారదర్శకమైన బిల్లుల చెల్లింపు కోసం వినియోగదారులు డిజిటల్ విధానానికి ప్రాధాన్యం ఇవ్వాలని ఎస్‌పిడిపిఎల్ సిఎండి శివశంకర్ లోతేటి తెలిపారు.

# చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి

**పోలవరం పూర్తి కోసం యజ్ఞం చేస్తున్నారు: భువనేశ్వరి**



**కుప్పం, జులై 29 ప్రభాతవార్త:** రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్లేది సిఎం చంద్రబాబు నాయుడు మాత్రమేనని ఆయన సతీమణి, ఎన్టీఆర్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్ట్ నారా భువనేశ్వరి పేర్కొన్నారు. బుధవారం కుప్పం మండలం వసనాడు గ్రామంలో ఆమె మహిళలతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నారా భువనేశ్వరి మాట్లాడుతూ ఐదేళ్ల వైసిపి పాలనలో ఖజానా ఖాళీ చేశారని పేర్కొన్నారు. అలాగే వారి పాలనలో రాష్ట్ర ప్రజలు తీవ్రంగా నష్టపోయారన్నారు. వైసిపి పాలనలో ఏ అభివృద్ధి జరిగిందో ప్రజలకు తెలుసన్నారు. చివరకు రోడ్లపై ఏర్పడ్డ గుంతలకు మట్టి సైతం వేసి పూడ్చలేని దుస్థితి అప్పట్లో ఉండేది అన్నారు. వైసిపి పాలనలో రాష్ట్రం వెనక్కి వెళ్లిపోయిందని పేర్కొన్నారు. సిఎం చంద్రబాబు నాయుడు రాష్ట్రం కోసం ఆలోచిస్తున్నారని, ప్రజలు, పిల్లల భవిష్యత్తుపై పనిచేస్తున్నారని పేర్కొన్నారు. చంద్రబాబును నమ్మి ప్రజలు ఓట్లేసారని పేర్కొన్నారు. రాష్ట్రానికి జీవనాడి అయిన పోలవరం ప్రాజెక్టు పూర్తికి సిఎం చంద్రబాబు యజ్ఞం చేస్తున్నారన్నారు. ఐదేళ్ల వైసిపి పాలనలో పోలవరం ప్రాజెక్టును పట్టించుకోక నిధులను వారి సొంత అవసరాలకు వాడుకున్నారని పేర్కొన్నారు. ఆచరణలో సాధ్యమయ్యే హామీలను మాత్రమే సిఎం చంద్రబాబు ఇస్తారని పేర్కొన్నారు. ఇచ్చిన హామీలను ఎగ్గొట్టరని పేర్కొన్నారు. మహిళలు కష్టపడి ఆర్థికంగా పైకి ఎదగాలని సూచించారు. పిఫోర్ కార్యక్రమాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రజలు కూడా తమ గ్రామం తమ పిల్లల భవిష్యత్తు గురించి ఆలోచించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆర్టీసీ వైస్ చైర్మన్ పిఎస్ మునిరత్నం, పికెఎం అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్ డాక్టర్ బి.ఆర్ సురేష్ బాబు, టిటిడి బోర్డు సభ్యుడు వైద్యం శాంతారామ్, ఎపిఐఐసి డైరెక్టర్ ప్రేమ్ కుమార్, సిఎం పిఎ శ్రీకాంత్, టిడిపి మండల అధ్యక్షుడు రాజగోపాల్, క్లస్టర్ ఇంచార్జ్ శ్రీనివాసులు రెస్కో చైర్మన్ ప్రతాప్, ఎఎంసి చైర్మన్ జిఎం రాజు, ఏరియా ఆసుపత్రి వైస్ చైర్మన్ భాగ్యలక్ష్మి త్రిలోక్, స్థానిక నేతలు మునికృష్ణ, వల్లెప్ప, సికె సుబ్రహ్మణ్యం, బాబు, రెస్కో మణి తదితరులు పాల్గొన్నారు.

# ఆగస్టు 3 నుంచి డిపిటి టీకా కార్యక్రమం

**● పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో ప్రత్యేక శిబిరాలు**

**● రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ కార్యదర్శి జి. వీరపాండియన్**

**విజయవాడ, జులై 29 ప్రభాతవార్త ప్రతినిధి:** గొంతువాపు(డిఫ్తీరియా), కోరింత దగ్గు (పెర్టురిస్), ధనుర్వాతం (టెటానస్) వంటి ప్రాణాంతక బ్యాక్టీరియా వ్యాధుల నుంచి పిల్లలు, కౌమార దశ యువతకు సంపూర్ణ ఆరోగ్య రక్షణ కల్పించేందుకు ఆగస్టు 3 నుంచి 8 వరకు రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక టీకా (డిపిటి, టిడి) కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ కార్యదర్శి, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమీషనర్ జి. వీరపాండియన్ తెలిపారు. సాధారణ టీకా కార్యక్రమాల్లో టీకాలు వేసుకోలేకపోయిన పిల్లలకు ఈ ప్రత్యేక కార్యక్రమం ద్వారా టీకాలు వేయడమే ప్రధాన ఉద్దేశమని ఆయన నేడొక ప్రకటనలో తెలిపారు. ఈ స్పెషల్ డ్రైవ్‌లో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో చదువుతున్న అర్హులైన విద్యార్థులతో పాటు పాఠశాలలకు వెళ్లని అర్హులైన పిల్లలను కూడా గుర్తించి టీకాలు వేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి మహిళా, శిశు సంక్షేమ శాఖ, విద్యాశాఖ, మైనారిటీ సంక్షేమ శాఖ, పంచాయతీరాజ్, పురపాలక శాఖలతో సమన్వయం చేసుకుని జిల్లా, మండల టాస్క్‌ఫోర్స్ సమావేశాలు నిర్వహించాలని సూచించారు. తల్లిదండ్రులకు ముందుగానే టీకాలు వేసే తేదీల సమాచారం అందేలా చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. జిల్లా స్థాయిలో ప్రత్యేక పరిశీలకులను నియమించి కార్యక్రమాన్ని నిరంతరం పర్యవేక్షించాలని, ఎలాంటి సమస్యలు తలెత్తినా వెంటనే పరిష్కరించాలని డిఎంహెచ్‌ఒలు, డిఐఓలను కమీషనర్ ఆదేశించారు.

## తిరుమల సమాచారం



# గరుడునిపై మలయప్ప అభయం

**తిరుమల, జులై 29 ప్రభాతవార్త ప్రతినిధి:** పవిత్రమైన గురుపౌర్ణమి ఘడియల్లో పున్నమివెలుగుల్లో బుధవారం రాత్రి మలయప్పస్వామి గరుడ వాహనాన్ని అధిరోహించి భక్తులకు దర్శనమిచ్చారు. సాయంత్రం నిత్య కైంకర్యాలు ముగించుకుని సహస్ర దీపాలంకరణసేవలో వయ్యారంగా పూజలందుకున్నారు. అక్కడ నుంచి బయలుదేరి వాహనమండపం చేరుకున్నారు. వాహన మండపం వద్ద ఆలయ అర్చకులు విశేష అలంకార భూషితుడైన మలయప్పను కొలువుదీర్చి వేదమంత్రాల నడుమ కర్పూర హారతులిచ్చారు. అనంతరం భక్తుల గోవింద నామస్మరణల మధ్య గరుడ వాహనం మెల్లగా ఆలయం ముందునుంచి కదులుతూ మాఢవీధుల్లో ఊరేగారు. ఈ కార్యక్రమంలో టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు, బోర్డు సభ్యులు, ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం, పేష్కార్ రామకృష్ణ, పారుపత్తేదార్ హిమత్‌గిరి, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

**సర్వదర్శనానికి 18 గంటలు:** తిరుమలేశుని దర్శనం కోసం భారీగా పెరిగిన భక్తులతో ఏడుకొండలు కిటకిటలాడుతున్నాయి. మంగళవారం ఉదయానికి వైకుంఠమ్2లో 31 కంపార్ట్‌మెంట్లు నిండిపోయాయి. శ్రీవారి దర్శనానికి భక్తుల రద్దీ కొనసాగుతోంది. టోకెన్లు లేని భక్తులకు సర్వదర్శనానికి సుమారు 18 గంటల సమయం పడుతోంది. సోమవారం రాత్రివరకు 78 వేల మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. హుండీ ఆదాయం 4.76 కోట్లు చేకూరింది. భక్తుల రద్దీ దృష్ట్యా దర్శనం కోసం గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తోంది.

# శాస్త్రోక్తంగా జీయర్ల చాతుర్మాస్యదీక్ష సంకల్పం



**తిరుమల, జులై 29 ప్రభాతవార్త ప్రతినిధి:** వైష్ణవ సంప్రదాయకర్త రామానుజాచార్యుల పారంపర్యంలో చాతుర్మాసదీక్ష విశేషమైందని టిటిడి పెద్దజీయంగారు తెలిపారు. ఆషాడ శుద్ధఏకాదశిన శ్రీమహావిష్ణువు యోగనిద్రలోకి వెళ్ళి తిరిగి కార్తీక శుద్ధ ఏకాదశిన మేల్కొంటారు. ఈ నాలుగునెలల కాలాన్ని చాతుర్మాస్యం అంటారన్నారు. చాతుర్మాస్యదీక్షలో భాగంగా బుధవారం తిరుమలలోని పెద్దజీయర్‌స్వామి మఠంలో కలశ స్థాపన, కలశపూజ, విశ్వక్సేనారాదన, మేధినపూజ, మృత్సంగ్రహణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. తరువాత పుట్టమన్ను సేకరించి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం చాతుర్మాస సంకల్పం స్వీకరించారు. అక్కడ నుండి పెద్దజీయర్‌స్వామి మఠం వద్ద నుండి చిన్నజీయంగారు, శిష్య బృందంతో కలసి మంగళవాయిద్యాల నడుమ బయలుదేరి తొలుత వరాహస్వామిని, అక్కడ నుండి దేవదేవుని ఆలయంలోనికి చేరుకున్నారు. ఆలయ మహద్వారం వద్ద టిటిడి ఇఒ ముద్దాడ రవిచంద్ర,ఆలయ అర్చకులు సంప్రదాయంగా స్వాగతం పలికారు. శ్రీవారి దర్శనానంతరం పెద్దజీయర్‌కు మేల్‌ఛాట్ వస్త్రాన్ని, చిన్నజీయర్‌కు నూలువస్త్రాన్ని బహుకరించారు. అలాగే టిటిడి ఇఒ,ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథంను జీయంగార్లు శాలువతో సన్మానించారు. శ్రావణ, భాద్రపద, ఆశ్వయుజ, కార్తీక పవిత్ర మాసాలలో ఆచార్య పురుషులు స్నాన, జప, హోమ, వ్రత దానాదులను నిర్వహించడం ఆనవాయితీ. ఈ కార్యక్రమాల్లో ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం, ఆలయ పేష్కార్ రామకృష్ణ, జీయంగార్లు పాల్గొన్నారు.

# ఏకం క్షేత్రంలో వైభవంగా గురుపూర్ణిమ వేడుకలు





**వరదయ్యపాలెం (తిరుపతి జిల్లా), జులై 29 ప్రభాతవార్త:** చెన్నై- తిరుపతి మధ్య ఉన్న పాలరాతి ఆలయమైన ఏకం క్షేత్రం, పవిత్ర గురు పూర్ణిమ సందర్భంగా రోజంతా ముక్తిగురు దర్శనాన్ని అందించింది. సూర్యాస్తమయం నాటికి, సుమారు 70వేల మంది ఈ ప్రాంగణంలో చేరుకున్నారు. ప్రతి ఒక్కరూ ముక్తి గురు శ్రీకృష్ణాజీ ముందు ఒక క్షణం నిలబడాలని, ఆయన చూపుతో లభించే ఇచ్ఛా సిద్ధి ఆశీర్వాదాల కోసం ఎదురుచూశారు. జార్ఖండ్, బీహార్, మహారాష్ట్ర వంటి సుదూర ప్రాంతాల నుండి ప్రత్యేక రైళ్లు వచ్చాయి. ఆంధ్రప్రదేశ్ నుండి వచ్చిన భక్తులు తమ ప్రయాణ సమయాన్ని ఆరాధనగా మలచుకుని, యాత్ర పొడవునా మంత్రాలు జపించారు. కర్ణాటక, తమిళనాడు నుండి బస్సులు, ప్రైవేట్ వాహనాల నిరంతర తాకిడి కొనసాగింది. పేద, ధనిక అనే తేడా లేకుండా అందరూ ఉచితంగా దర్శనానికి తరలివచ్చారు. హైకోర్టు జడ్జి లక్ష్మణ రావు, నెల్లూరు జిల్లా జడ్జి శ్రీనివాస్, కృష్ణ జిల్లా ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ జడ్జి శ్రీనివాస రావు, సత్యవేడు నియోజకవర్గ టిడిపి ప్రోగ్రాం కోఆర్డినేటర్ కూరపాటి శంకర్ రెడ్డి, ఎమ్మెల్సీ బల్లి కల్యాణ చక్రవర్తి, శ్రీ కాళహస్తీశ్వరస్వామి దేవస్థానం ట్రస్ట్ బోర్డు చైర్మన్ కొట్టె సాయిప్రసాద్, తిరుపతి జిల్లా బిజెపి అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్, కదూరు పిఎసిఎస్ చైర్మన్ ఆణిముత్యం నందాకిషోర్, రాష్ట్ర దేవాంగ కార్పొరేషన్ మాజీ డోరేటర్ బొప్పన తిలక్ బాను, తెలుగుదేశం పార్టీ వరదయ్యపాలెం మండలం అధ్యక్షుడు పిన్నమనేని యుగంధర్ రెడ్డి, టిడిపి క్లస్టర్ ఇన్చార్జ్ పి.నిర్మల్ తదితర ప్రముఖులు పాల్గొన్నారు.

# నకిలీ వెబ్‌సైట్‌పై అప్రమత్తంగా ఉండాలి: టిటిడి




**తిరుమల, జులై 29 ప్రభాతవార్త ప్రతినిధి:** ఏడుకొండల వేంకటేశ్వరస్వామి దర్శనాల పేరుతో భక్తులను కొందరు మోసగాళ్ళు పలు రకాలుగా మోసం చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని అలాంటి వారిపట్ల అప్రమత్తంగా ఉండాలని టిటిడి హెచ్చరించింది. సామాజిక మాధ్యమంలో వైరల్ అవుతున్న "టిటిదేవస్థానమ్. ఆన్‌లైన్" అనే నకిలీ వెబ్‌సైట్‌ను టిటిడి విజిలెన్స్ విభాగం గుర్తించింది. ఈ వెబ్ సైట్ టిటిడి అధికారిక ఆన్‌లైన్ సేవలను పోలి ఉండేలా రూపొందించిన కొందరు వ్యక్తులు భక్తులను మోసం చేసే ప్రయత్నం చేస్తున్నారు. టిటిడి అధికారిక వెబ్‌సైట్ మాదిరిలోనే ఉండేలా, కేవలం డొమైన్ పేరులో స్వల్ప మార్పులతో ఈ నకిలీ వెబ్‌సైట్ రూపొందించారు. ఇందులో ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబర్ నెలలకు శ్రీవారి దర్శనం, సేవా టికెట్లు అందుబాటులో ఉన్నట్లు తప్పుడు సమాచారం ప్రదర్శిస్తున్నారు. దర్శన టికెట్ల పేరుతో భక్తుల నుంచి నగదు వసూలు చేయడం ద్వారా వారిని మోసం చేయడంతో పాటు, టిటిడి ప్రతిష్ఠను దెబ్బతీయడమే ఈ నకిలీ వెబ్‌సైట్ ఉద్దేశం. ఈ నకిలీ వెబ్‌సైట్‌ను వెంటనే తొలగించాలని సంబంధిత డొమైన్ ప్లాట్‌ఫారమ్ నిర్వాహకులకు టిటిడి ఇప్పటికే ఫిర్యాదు చేసింది. ఈ ఘటనపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని తిరుమల టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడం జరుగుతోంది. అంతేకాకుండా భవిష్యత్తులో కూడా భక్తులను మోసం చేసే వారిపై చట్టపరంగా కఠినమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలియజేశారు. టిటిడి సేవలు, దర్శనం, వసతి, ఆన్‌లైన్ టికెట్లకు సంబంధించి భక్తులు అధికారిక టిటిడి వెబ్‌సైట్. అధికారిక మొబైల్ యాప్ ద్వారా మాత్రమే బుకింగ్‌లు చేసుకోవాలని భక్తులకు విజ్ఞప్తి చేసింది. సామాజిక మాధ్యమాల్లో ప్రచారంలో ఉన్న అనధికారిక వెబ్‌సైట్లు, లింకులను నమ్మి మోసపోవద్దని కోరింది.

# రాష్ట్ర వ్యాప్తంగా వైభవంగా గురు పూర్ణిమ వేడుకలు

**విజయవాడ, జులై 29 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో గురు పూర్ణిమ వేడుకలు వైభవంగా జరుగుతున్నాయి. శిర్డీ సహా రాష్ట్రంలోని వివిధ ఆలయాల్లో భక్తుల రద్దీ నెలకొంది. గురువును పూజించే రోజే గురు పూర్ణిమగా, వ్యాస పూర్ణిమగానూ గురు పూర్ణిమకు పేరు ఉంది. నారాయణుని స్వరూపమైన వ్యాసుడి పుట్టినరోజు సందర్భంగా గురు పూర్ణిమ జరుపుకున్నారు. ఆ నేపథ్యంలో సాయిబాబా ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. భక్తిశ్రద్ధలతో భక్తులు విశేష పూజలు నిర్వహించారు. ఆలయా పరిసర ప్రాంతాలు గురునామా స్మరణతో మార్మోగాయి. వివిధ సాయిబాబా ఆలయాల్లో కాకడ హారతి, అభిషేకాలు, పూజలు ఘనంగా నిర్వహించారు. రాష్ట్రమంతటా సాయిమందిరాలో గురుపూర్ణిమ వేడుకలు ప్రత్యేకంగా నిర్వహించారు.

# ఆగస్టు 4 నుంచి ఆడికృత్తిక మహోత్సవాలు

**శ్రీకాళహస్తి, జులై 29 ప్రభాతవార్త:** శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా నిర్వహిస్తున్న కుమారస్వామి కొండపై ఆగస్టు 4 నుంచి ప్రారంభమయ్యే ఆడికృత్తి మహోత్సవాలను విజయవంతం చేయటానికి అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేద్దామని ఆలయ ఇఒ బికె వెంకటేశులు పిలుపునిచ్చారు. చెంగల్వ రాయ స్వామి ధ్వజారోహణంతో ఆడికృత్తిక మహోత్సవాలు ప్రారంభమౌతాయని ఇఒ వివరించారు. డిఎస్‌పి నరసింహామూర్తి, మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి, సిఐ వెంకటేశ్, డిప్యూటి ఇఒ ఎన్ఆర్ కృష్ణారెడ్డి, ప్రధానార్చకులు కరుణాకర్ గురుకుల్, పౌరోహితులు అర్ధగిరి, ఎఇఒ లోకేష్‌బాబు, హేమామాలిని, డిఇఇ శ్రీనివాసు లురెడ్డి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ హరియాదవ్, రవి, శ్రీహరి, తహశీల్దార్ సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

30- 7 pg 9 ...:30- 7 pg 9 ....qxd 7/29/2026 5:52 PM Page 1





# సంగీత బాణీల జర్నీలో జ్యోతిర్మయి!

హిందూస్థానీ శాస్త్రీయ సంగీతమంటే చెవికోసుకునే జ్యోతిర్మయి తన జర్నీలో మొదటి మైలురాయిని దాటుకుని రెండో మైలురాయి దగ్గరకు చేరుకున్నారు. మ్యూజిక్ షో 'ఇండియన్ ఐడల్ సీజన్ 16' గ్రాండ్ ఫినాలేలో ఒడిశాకు చెందిన జ్యోతిర్మయి నాయక్ ట్రోఫీని కైవసం చేసుకున్నారు. ఈ విజయంతో ఆమె రూ.20 లక్షల నగదు బహుమతి గెలుచుకున్నారు. ఇండియన్ ఐడల్ చరిత్రలో ఒడిశా నుంచి టైటిల్ గెలుచుకున్న తొలి కంటెస్టెంట్‌గా ఆమె రికార్డు సృషించారు. పాతికేళ్ల జ్యోతిర్మయి ఇండియన్ ఐడల్ ద్వారా దేశవ్యాప్తంగా గుర్తింపు పొందకముందే ఒడిశా ప్రాంతీయ సంగీత పరిశ్రమకు సుపరిచితురాలు. ఆమె ఒక గాయని మాత్రమే కాదు, శిక్షణ పొందిన మ్యూజిక్ థెరపిస్ట్ కూడా. సంగీతం ద్వారా మానసిక, భావోద్వేగ సమస్యలకు చికిత్స అందించడంలో ఆమెకు నైపుణ్యం ఉంది. జ్యోతిర్మయి భువనేశ్వర్‌లోని కీట్ యూనివర్సిటీ నుంచి కంప్యూటర్ సైన్స్ బిటెక్ పూర్తి చేశారు. ఆ తర్వాత చెన్నై స్కూల్ ఆఫ్ మ్యూజిక్ థెరపీ నుంచి సర్టిఫికేషన్ పొందారు. గురు శారదా ప్రసన్నసాహు వద్ద బాలీవుడ్ పాటలపై ప్రత్యేక శిక్షణ తీసుకున్న జ్యోతిర్మయి పాటల భావాలను తెలుసుకుని బాణీలను పలికించడాన్ని నేర్చుకొన్నారు. ఎప్పటికైనా అలియాభట్, దీపికా పడుకొణెలకు నేపథ్య గాయనిగా పాడగలగడమే తన జీవితాశయంగా చెబుతుంటారు. జర్నీ సాగుతున్న కొద్దీ సంగీతంలో అత్యున్నత స్థాయిని చేరుకోవాలని ఆకాంక్షతో ఆమె ముందడుగు వేస్తున్నారు. ◻

# చీడ వదిలిద్దాం ..

మొక్కలు పెంచే వాళ్లకి వచ్చే చీడపీడల్ని నివారించడం పెద్ద సవాలనే చెప్పాలి. ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా కొన్ని రకాల తెగుళ్ల ఒకపట్టాన వదలవు. అలాంటి వాటిలో పేనుబంక ఒకటి. కొన్ని చిట్కాలు పాటిస్తే మొక్కల నుంచి దీన్ని సులువుగా దూరం చేయొచ్చు. ✦ వేపనూనె లేదా డిష్‌వాష్ లిక్విడ్లు అఫిడ్స్‌ను నియంత్రించడానికి బాగా పనిచేస్తాయి. ఈ రెండిటినీ చెంచా చొప్పున ఒక లీటరు నీటిలో కలపాలి. ఈ మిశ్రమాన్ని మొక్కలపై ప్రతిరోజూ సాయంత్రం స్ప్రే చేయాలి.



✦వెల్లుల్లి సహజ క్రిమి సంహారిణిగా పనిచేస్తుంది. నాలుగైదు వెల్లుల్లి రెబ్బల్ని దంచి నీటిలో కలిపి సోకిన మొక్కలపై పిచికారీ చేయాలి.

✦ వీటితోపాటు పసుపు రంగు అట్టముక్కలకు కొద్దిగా ఆముదం లేదా నూనె రాసి మొక్క దగ్గర వేలాడదీయాలి కర్రకు అతికించి మట్టిలో గుచ్చిన అఫిడ్స్ దానికి అతుక్కుంటాయి. ✦ సమస్య మరీ ఎక్కువగా ఉంటే మొక్కలను నీటితో కడిగి ఆపై వేపనూనెను స్ప్రే చేసినా చక్కగా పనిచేస్తుంది. ఇంటి తోటను శుభ్రం చేయడం, ఎండిన మొక్కల్నీ, తెగులు సోకి వాడిపోయిన వాటిని వేరు చేయాలి. ఈ జాగ్రత్తలుతీసుకుంటే మొక్కలు ఆరోగ్యంగా పెరుగుతాయి. ◻

# ఆపిల్: మంచి బ్యాక్టీరియా



**ఒక రోజు ఒక ఆపిల్ తింటే..** ఎన్నో రకాల వ్యాధుల నుంచి తప్పించుకోవచ్చని పెద్దలు చెబితే విప్పపంటుంటాము. కానీ, ఒక్క ఆపిల్‌ను తింటే 10 కోట్ల బ్యాక్టీరియాలు మన పొట్టలోకి చేరినట్టే అని మీకు తెలుసా! మరీ అంత ఆశ్చర్యపోకండి. అదంతా మనకు మంచి చేసే బ్యాక్టీరియానే! 240 గ్రాముల బరువున్న ఒక ఆపిల్‌లో సుమారు 10 కోట్ల బ్యాక్టీరియా ఉంటుందట. తాజాగా ఆస్ట్రియాలోని గ్రాజ్ యూనివర్సిటీ ఆఫ్ టెక్నాలజీ చేసిన పరిశోధనలో ఈ విషయం వెల్లడైంది. ఆపిల్‌లోని కాడ, గుజ్జు, విత్తనాలు, తొక్క.. ఇలా ప్రతి భాగమూ.. బ్యాక్టీరియా మయమేనట. ఇక గుజ్జు, విత్తనాలైతే బ్యాక్టీరియా హాట్‌స్పాట్‌లే. అయితే, సేంద్రియ పద్ధతుల్లో పండించిన ఆపిల్ రకాలే ఉత్తమం అంటున్నారు పరిశోధనలు. ఎందుకంటే, ఈ రెండు రకాల ఆపిల్ పండ్లలో బ్యాక్టీరియా సంఖ్యలో పెద్దగా మార్పు లేనప్పటికీ, అందులో ఉండే మంచి బ్యాక్టీరియాలో మాత్రం తేడా ఉంటుందట. పంట పండే ప్రాంతం, భద్రపరిచే విధానాలను బట్టి వాటిలోని మైక్రోబయోమ్‌ల కంపోజిషన్ మారి పోతుందట. దాన్నిబట్టే ఆపిల్ రంగూ, రుచీ, రూపంలోనూ మార్పులొస్తాయట. ఏదిఏమైనా ఈ ఆపిల్‌లో ఓ బ్యాక్టీరియా సామ్రాజ్యమే ఉందన్నమాట! ◻

# వృథ పీడకలలు బాధిస్తున్నాయి !



ఎన్.బి.సుధాకర్‌రెడ్డి
సైకాలజిస్టు


ప్రశ్న: నా వయస్సు 40 ఏళ్లు. ప్రభుత్వ సంస్థలో అధికారిగా పనిచేస్తున్నాను. ఇటీవల కొంతకాలంగా రోజంతా నీరసం, నిస్సత్తువగా అనిపిస్తోంది. తరచూ తలనొప్పి వస్తోంది. ఒక్కోసారి రాత్రిళ్లు పీడకలలు వస్తున్నాయి. ఎనిమిది గంటలు నిద్రపోయినా అలసట, ఒత్తిడి తగ్గడం లేదు. స్నేహితులు ఒక్కొక్కరు ఒక్కో సలహా ఇస్తున్నారు. కౌన్సెలింగ్ తీసుకోమని ఒకరు, విటమిన్ బి12 లేదా విటమిన్ డి లోపం కావచ్చని మరొకరు, హార్మోన్ల సమస్య కూడా ఉండొచ్చని ఇంకొకరు చెప్పారు. నేను ముందుగా వైద్యుడిని కలవాలా? లేక సైకాలజిస్టును సంప్రదించాలా?

– ఒక సోదరి, నెల్లూరు



**జవాబు:** అమ్మా, మీరు చెప్పిన లక్షణాలను బట్టి ఒకే కారణాన్ని ఖచ్చితంగా చెప్పడం సాధ్యం కాదు. మీ సమస్యకు శారీరక కారణాలు, మానసిక కారణాలు లేదా ఈ రెండూ కలిసి కారణమై ఉండవచ్చు. అందువల్ల ఊహాగానాలపై ఆధారపడకుండా సరైన పరీక్షలు చేయించుకుని అసలు కారణాన్ని గుర్తించడం చాలా ముఖ్యం.మీకు ఉన్న నీరసం, నిస్సత్తువ, తలనొప్పి, తగినంత నిద్రపోయినా అలసట, పీడకలలు వంటి లక్షణాలు విటమిన్ బి12 లేదా విటమిన్ డి లోపం, రక్తహీనత, థైరాయిడ్ లేదా ఇతర హార్మోన్ల అసమతుల్యత, మధుమేహం వంటి శారీరక సమస్యల వల్ల రావచ్చు. అదే సమయంలో అధిక మానసిక ఒత్తిడి, ఆందోళన, డిప్రెషన్ లేదా బర్నౌట్ సిండ్రోమ్ వంటి మానసిక పరిస్థితుల్లో కూడా ఇలాంటి లక్షణాలు కనిపిస్తాయి. అందువల్ల ముందుగా ఒక ఫిజీషియన్‌ను సంప్రదించడం మంచిది. ఆయన మీ ఆరోగ్య పరిస్థితిని పరిశీలించి, అవసరమైన రక్తపరీక్షలు, విటమిన్ బి12, విటమిన్ డి, థైరాయిడ్, రక్తహీనత తదితర పరీక్షలు సూచిస్తారు. పరీక్షల ద్వారా శారీరక కారణం ఉందో లేదో నిర్ధారించవచ్చు. పరీక్షల్లో ప్రత్యేకమైన శారీరక సమస్య కనిపించకపోయినా, ఒత్తిడి, ఆందోళన, నిద్రలో ఇబ్బందులు, పీడకలలు కొనసాగితే క్లినికల్ సైకాలజిస్టు లేదా కౌన్సెలింగ్ సైకాలజిస్టును సంప్రదించండి. అవసరమైతే వారు సైకాలజికల్ అసెస్‌మెంట్ చేసి, కౌన్సెలింగ్, రిలాక్సేషన్ టెక్నిక్స్, కాగ్నిటివ్ బిహేవియరల్ థెరపీ వంటి చికిత్సా విధానాలను సూచిస్తారు. ఒకవేళ తీవ్రమైన డిప్రెషన్ లేదా ఆందోళన రుగ్మత ఉన్నట్లు తేలితే సైకియాట్రిస్ట్ వద్దకు రిఫర్ చేస్తారు.రోజూ కనీసం 30 నిమిషాలు నడక లేదా వ్యాయామం చేయండి. సమతుల ఆహారం తీసుకోండి. కాఫీ, టీ అధికంగా తీసుకోవద్దు. నిద్రపోయే ముందు మొబైల్, ల్యాప్‌టాప్ వినియోగాన్ని తగ్గించండి. పనిలో మధ్య మధ్యలో చిన్న విరామాలు తీసుకోండి. సమస్యలను మనసులో దాచుకోకుండా కుటుంబ సభ్యులు లేదా నమ్మకమైన వ్యక్తులతో పంచుకోండి. వైద్యుల సలహా లేకుండా స్వయంగా విటమిన్ మాత్రలు లేదా ఇతర మందులు వాడకండి. మీ లక్షణాలు రోజువారీ పనితీరుపై ప్రభావం , లేదా నిరాశ, జీవితంపై విరక్తి వంటి భావనలు కలిగితే ఆలస్యం మానసిక వైద్యుడు లేదా నిపుణుడిని సంప్రదించండి. సరైన నిర్ధారణ, సమయానికి చికిత్సతో ఇటువంటి సమస్యలు చాలా వరకు పూర్తిగా నియంత్రణలోకి వస్తాయి. ◻

# ఓం సాయి లీల



శిరిడీ సాయిబాబాను ఆరాధించే భక్తులు అశేషమైన సంఖ్యలో వున్నారు. ఆపదల నుంచి .. అనారోగ్యాల నుంచి .. ఆర్థిక పరమైన ఇబ్బందుల నుంచి తమని ఆయనే కాపాడుతూ ఉంటాడని వాళ్లంతా విశ్వసిస్తూ వుంటారు. బాబా చూపిన లీలావిశేషాలను కథలు కథలుగా చెప్పుకుంటూ వుంటారు. బాబా శిరిడీలో తిరుగాడుతున్నప్పుడు మహిమలెన్నో చూపాడు .ఒకసారి బాబా భక్తుడైన శ్యామా పాము కాటుకు గురవుతాడు. పాముకాటుకు మంత్రం వేసే వాళ్లు .. మందిచ్చే వాళ్లు వేరే వున్నా, ఆయన బాబా దగ్గరికే వస్తాడు. ఆయనని చూడగానే కిందికి దిగిపొమ్మనీ .. పైకి వస్తే ఏం చేస్తానో చూడమని బాబా కోపంగా అంటాడు. బాబా ధోరణి శ్యామాకి ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. బాబా ఆ మాట అన్నది శ్యామా శరీరంలో పైకి ఎక్కుతోన్న విషాన్ని అనే విషయం ఆ తరువాత అక్కడి వాళ్లకి అర్థమవు తుంది. బాబా మాట .. ఆయన కంటి చూపే విషానికి విరుగుడుగా పనిచేశాయని గ్రహిస్తారు. తనకి ప్రాణ భిక్ష పెట్టిన బాబా పాదాలపై పడి శ్యామా కృతజ్ఞతలు తెలియజేస్తాడు. ◻

# పుదీనా పూరి



**కావలసినవి:** పుదీనా: ఒక కప్పు, గోధుమ పిండి: రెండు కప్పులు, పచ్చిమిర్చి: నాలుగు, అల్లం: అంగుళం ముక్క, జీలకర్ర: ఒక టీస్పూన్, గరం మసాలా: అర టీస్పూన్, ఉప్పు: తగినంత, నూనె: వేయించడానికి సరిపడా.

**తయారీ :** పుదీనా ఆకును శుభ్రంగా కడిగి పెట్టు కోవాలి. మిక్సీ గిన్నెలో పుదీనా, పచ్చిమిర్చి, అల్లం, జీలకర్ర, గరంమసాల, ఉప్పు వేసి మెత్తగా రుబ్బుకోవాలి. ఒక గిన్నెలో గోధుమపిండి, పుదీనా మిశ్రమం, ఒక టేబుల్ స్పూన్ నూనె వేసి తగినన్ని నీళ్లు పోసి చపాతీ పిండిలా కలిపి అరగంట పాటు నాననివ్వాలి. స్టవ్‌మీద కడాయి పెట్టి వేయించడానికి సరిపడా నూనెపోసి వేడిచేయాలి. పిండిని కొద్దికొద్దిగా తీసుకుని పూరీలు ఒత్తుకుని కాగిన నూనెలో దోరగా వేయించుకుంటే పుదీనా పూరి సిద్ధం.

# ఆదర్శ కుటుంబం హౌస్ నెం: 47 - AK47e చిత్రం నుంచి 'సంపూర్ణ'గా యువినా పార్థవి



'ఆదర్శ కుటుంబం హౌస్ నెం: 47 – AK47e చిత్ర బృందం కుటుంబంలోని మరో సభ్యురాలిని పరిచయం చేసింది.ఈ చిత్రంలో చిట్టిబాబు, స్వర్ణ దంపతుల ముద్దుల కుమార్తె 'సంపూర్ణ పాత్రలో బాలనటి యువినా పార్థవి నటిస్తోంది. అమాయకత్వం, చిలిపితనం, అల్లరితో నిండిన సంపూర్ణ పాత్ర చిట్టిబాబు జీవితంలో నవ్వులు పూయించడంతో పాటు, అనూహ్యమైన చిన్న చిన్న సంఘటనలకు కూడా కారణమవుతుంది. ఈ పాత్ర ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకునేలా ఉండనుందని చిత్ర బృందం తెలిపింది. పాత్రల పరిచయాలతో సినిమాపై రోజురోజుకూ ఆసక్తిని పెంచుతున్న మేకర్స్, తదుపరి˝సర్వ పాత్రలో నటిస్తున్న రాజా ప్రజ్వల్ను పరిచయం చేయ నున్నారు. రచన,దర్శకత్వం త్రివిక్రమ్ శ్రీనివాస్ వహిస్తున్న ఈ చిత్రాన్ని హారిక హాసిని క్రియేషన్స్ పతాకంపై ఎస్. రాధాకృష్ణ (చినబాబు) అత్యంత ప్రతి ష్ఠాత్మకంగా నిర్మిస్తున్నారు.ఈ చిత్రానికి ఎస్. థమన్ సంగీతం అందిస్తుండగా, రవి. కె. చంద్రన్ సినిమాటోగ్రఫీ, శ్రీకర్ ప్రసాద్ ఎడిటింగ్ బాధ్యతలు నిర్వహిస్తు న్నారు.ఆదర్శ కుటుంబం హౌస్ నెం: 47 – AK47e చిత్రం 2026 అక్టోబర్ 2న ప్రపంచవ్యాప్తంగా ఘనంగా థియేటర్లలో విడుదల కానుంది.

తెర

# 'ఇరుముడి' చిత్రం ఆగస్టు 21న రిలీజ్




మాస్ మహారాజా రవితేజ ఎమోషనల్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'ఇరుముడి'పై భారీ అంచనాలు ఉన్నాయి. శివ నిర్వాణ దర్శకత్వంలో, మైత్రీ మూవీ మేకర్స్ నిర్మాణంలో రూపొందుతున్న ఈ చిత్రం 'ఫస్ట్ గ్లింప్స్', చార్ట్‌బస్టర్ అయ్యప్ప భక్తి పాట 'ఇరుముడి కట్టు'తో ప్రేక్షకులను అలరించిన ఈ చిత్రం, ఇప్పుడు మరో కీలక అప్‌డేట్‌తో ముందు కొచ్చింది. విడుదల తేదీకి సంబంధించి నెలకొన్న ఊహాగానాలకు తెరదించుతూ, అనుకున్న సమయానికే అంటే ఆగస్టు 21న 'ఇరుముడి' ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుందని చిత్ర బృందం అధికారికంగా అనౌన్స్ చేసింది. విడుదల షెడ్యూల్‌లో ఎలాంటి మార్పు లేదని స్పష్టం చేస్తూ, "25 Days To Go" పోస్టర్‌ను విడుదల చేశారు.కొత్తగా విడుదలైన ఈ పోస్టర్ సినిమాలోని ఎమోషన్ ని అద్భుతంగా ఆవిష్కరించింది. ఇందులో రవితేజ, చిన్నారి నక్షత్ర మధ్య తండ్రీకూతుళ్ల అనుబంధం ఎంతో ఆప్యాయంగా కనిపిస్తోంది. రవితేజ పేకాటలో నిమగ్నమై ఉండగా, ఆ చిన్నారి వెనుక నుండి ఆప్యాయంగా అతన్ని కౌగిలించుకోవడం, ఈ కథలోని ఎమోషన్‌ని ప్రజెంట్ చేస్తోంది. కుటుంబ కథా చిత్రాలను తెరకెక్కించడంలో దర్శకుడు శివ నిర్వాణకు మంచి పేరుంది; ఆయన 'ఇరుముడి'ని ఒక కంప్లీట్ ఎంటర్‌టైనర్‌గా తీర్చిదిద్దుతున్నారు. ఇప్పటివరకు విడుదలైన ప్రచార చిత్రాలు, వీడియోలు ఆయన ఈ సినిమాను ఎంత శ్రద్ధతో రూపొందిస్తున్నారో తెలియజేస్తున్నాయి. ప్రియా భవాని శంకర్ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రాన్ని నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి అత్యుత్తమ సాంకేతిక నిపుణుల బృందం పని చేస్తోంది. విష్ణు శర్మ సినిమాటోగ్రఫీని, సాహి సురేష్ ప్రొడక్షన్ డిజైన్‌ను, ప్రవీణ్ పూడి ఎడిటింగ్ ను పర్యవేక్షి స్తుండగా, జి.వి. ప్రకాష్ కుమార్ సంగీతం ఈ చిత్రానికి ప్రధాన బలాలుగా నిలుస్తోంది.

# 'శ్రీనివాస మంగాపురం' నా కెరీర్‌లో బెస్ట్ ఫిల్మ్ : దర్శకుడు అజయ్ భూపతి



**ఈ సినిమా ప్రయాణం ఎలా మొదలైంది?**
నేను జెమినీ కిరణ్ గారికి ఒక సినిమా చేయాలి. ఈ సినిమా అనుకున్నప్పుడు దత్ గారిని వెళ్లి కలిశాను. తర్వాత జై కృష్ణను రెండు, మూడు సార్లు కలిశాను. తనపై కాన్ఫిడెన్స్ వచ్చిన తర్వాత మొదలు పెట్టాను.
**కృష్ణ కుటుంబం నుంచి ఒక హీరోని పరిచయం చేయడం అంటే కచ్చితంగా బాధ్యత, ఒత్తిడి ఉంటుంది కదా?**
నేను మొదట్లో అది పట్టించుకోలేదు. నిజానికి నేను ఎప్పుడూ నా స్టైల్‌లోనే సినిమాలు చేసుకుంటూ వెళ్తాను. వాళ్లు కూడా నా స్టైల్‌కే వదిలేశారు. కాకపోతే జై కృష్ణతో ఒక జర్నీ మొదలైన తర్వాత నేను చాలా ఎమోషనల్ అయ్యాను.
**శ్రీనివాస మంగాపురం టైటిల్ గురించి?**
నేను ఈ టైటిల్‌తోనే కథ రాసుకున్నాను. ఈ కథకు, టైటిల్‌కు పూర్తి జస్టిఫికేషన్ ఉంటుంది. ఈ కథ బ్యాక్‌డ్రాప్, క్యారెక్టర్ల పేర్లు, వాళ్ల లవ్ స్టోరీ... వీటన్నింటికీ ఈ టైటిల్ సరిపోతుంది. ఇది సినిమాకు చాలా ప్లస్ అయింది.
**మోహన్ బాబు క్యారెక్టర్ ఎలా ఉండబోతుంది?**
మోహన్ బాబు గారిది వేరే ఎమోషనల్ క్యారెక్టర్. గత 20 సంవత్సరాలుగా ఆయనను ఇంత ఎమోషనల్‌గా ఆడియన్స్ చూసి ఉండరు.
**మహేష్ బాబు సినిమా చూశారు కదా... ఆయన ఇచ్చిన కాంప్లిమెంట్ ఏమిటి?**
మహేష్ బాబు గారు సినిమా చూసి అదిరిపోయింది అని మెసేజ్ పెట్టారు. ముఖ్యంగా జై కృష్ణ, రాషా తడానీ జోడిని మెచ్చుకున్నారు.
**ఎమోషన్ పరంగా సినిమా ఎలా ఉంటుంది?**
ఎమోషన్ అదిరిపోతుంది. లాస్ట్ 30 నిమిషాలు చూస్తున్నప్పుడు యూత్ అందరూ కన్నీళ్లు పెట్టుకుంటారు
**తిరుపతిలో షూట్ చేసినప్పుడు చాలా నిబంధనలు ఉంటాయి కదా?**
తిరుమల స్టెప్స్ నుంచి పైకొండ వరకు ఏమీ చేయకూడదు. తిరుపతి అనేది మామూలుగా అన్ని టౌన్స్‌లాగే ఒక టౌన్.
**ఈ షూటింగ్ జర్నీలో జై కృష్ణలో వచ్చిన మార్పు ఏమిటి?**
జై కృష్ణ చాలా సిగ్గరి. చాలా ఇంట్రోవర్ట్. మహేష్ బాబులాగే తనలో కూడా మంచి సెన్స్ ఆఫ్ హ్యూమర్ ఉంది. బాగుంటుంది.

# 'మకుటం' నుంచి 'కలతేలా' సాంగ్ విడుదల



సూపర్ గుడ్ ఫిల్మ్స్ బ్యానర్ మీద 99వ ప్రాజెక్ట్‌గా విశాల్ హీరోగా, దర్శకుడిగా చేస్తున్న చిత్రం˝మకుటం. స్వర్గీయ ఆర్ బీ చౌదరి నిర్మిస్తున్న ఈ చిత్రంలో అంజలి, దుషార విజయన్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. ఈ మూవీ నుంచి వచ్చిన టీజర్, ఫస్ట్ సింగిల్ 'ది రైజ్ అఫ్ లింగా', ఫోక్ సాంగ్˝నచ్చాకే వచ్చేర్తా అనే పాటలు అన్నీ కూడా అందరిలోనూ అంచనాలు పెంచేశాయి. ఇక తాజాగా మరో పాటను చిత్రయూనిట్ రిలీజ్ చేసింది. 'కలతేలా'అంటూ సాగే సాంగ్‌ను తాజాగా రిలీజ్ చేశారు. ఇదొక ఫ్యామిలీ, మోటివేషనల్ సాంగ్‌లా కనిపిస్తోంది. ఇందులో విశాల్, దుషారలతో పాటుగా పిల్లలు కూడా కనిపిస్తున్నారు. ఈ పాటను రాజశ్రీ సుధాకర్ రచించగా.. కృష్ణ తేజస్వీ ఆలపించారు. ఇక జీవీ ప్రకాష్ అందించిన బాణీ ఎంతో క్యాచీగా ఉంది. ఇక ఈ పాట యూట్యూబ్‌లో ఇట్టే ట్రెండ్ అయ్యేలా కనిపిస్తోంది. ఈ సినిమాకి రిచర్డ్ ఎం. నాథన్, అభినందన్ రామానుజం కెమెరామెన్లుగా, ఎన్.బి.శ్రీకాంత్ ఎడిటర్‌గా పని చేస్తున్నారు. త్వరలోనే ఈ మూవీకి సంబంధించిన రిలీజ్ డేట్‌ను ప్రకటించనున్నారు.

# 'ఇమ్మోర్టల్' నుంచి 'షీ ఈజ్ మై' సాంగ్ రిలీజ్



మల్టీ ట్యాలంటెడ్ జి.వి. ప్రకాష్ కుమార్, కయదు లోహార్ జంటగా నటిస్తున్న డార్క్ ఫాంటసీ సూపర్ నేచురల్ థ్రిల్లర్ 'ఇమ్మోర్టల్' మరియప్పన్ చిన్న దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని అరుణ్‌కుమార్ ధనశేఖరన్ నిర్మిస్తున్నారు ఇప్పటికే రిలీజ్ చేసిన సాంగ్‌కి అదిరిపోయే రెస్పాన్స్ వచ్చింది.తాజాగా 'ఇమ్మోర్టల్' నుంచి రొమాంటిక్ మెలోడీ 'షీ ఈజ్ మై' లిరికల్ వీడియోను మేకర్స్ విడుదల చేశారు.ఈ పాటకు సామ్ సీఎస్ అందించిన సంగీతం ప్రత్యేక vamsishekarpro gmail¨com6గా నిలుస్తోంది. అరవింద్ శ్రీనివాస తన వోకల్స్ పాటకు ప్రాణం పోయగా, రాజశ్రీ సుధాకర్ రాసిన సాహిత్యం ప్రేమలోని భావోద్వేగాలను అందంగా పలికించింది.ఈ పాటలో జి.వి. ప్రకాష్ కుమార్, కయదు లోహార్‌ల మధ్య కెమిస్ట్రీ చాలా ఆసక్తికరంగా వుంది. మనసును హత్తుకునే ట్యూన్, లిరిక్స్‌తో 'షీ ఈజ్ మై' సంగీత ప్రియులను ఆకట్టుకునే మెలోడీగా నిలిచింది.

# 'ఆకాశంలో ఒక తార' 'చిట్టి చిట్టి చీమ'సాంగ్ రిలీజ్



వెర్సటైల్ స్టార్ దుల్కర్ సల్మాన్ పుట్టినరోజు సందర్భంగా 'ఆకాశంలో ఒక తార' చిత్ర యూనిట్ ఫస్ట్ సింగిల్ 'చిట్టి చిట్టి చీమ'ను విడుదల చేసింది.జివి ప్రకాష్ కుమార్ స్వరపరిచిన 'చిట్టి చిట్టి చీమ' పాట హృదయాన్ని హత్తుకునే మెలోడి.. భావోద్వేగంగా సినిమాలో ఏం చెప్పాలనుకున్నారో ఆ పాయింట్‌ను అద్భుతంగా ప్రతిబింబిస్తుంది. హీరోయిన్ కోణంలో పాడిన ఈ పాట, నక్షత్రాలను చేరాలనే ఒక మహిళ కలను, ఆమె పక్కన నిలబడి నిశ్శబ్దంగా అండగా నిలిచే వ్యక్తి ప్రేమను చూపిస్తుంది. సాంప్రదాయ ప్రేమకథలను దాటి, ఒక ప్రత్యేకమైన బంధాన్ని ఈ పాట అందంగా సెలబ్రేట్ చేస్తుంది.శ్రీమణి రాసిన ఈ పాటను రమ్య బెహరా ఎంతో చక్కగా ఆలపించారు. చిట్టి చీమ చక్కెర మోసుకెళ్లడం, కొండపల్లి బొమ్మ కొండలు దాటడం, గాలికి ఎదురుగా మాత్రమే ఎగిరే గాలిపటం వంటి ఆకర్షణీయమైన ఉపమానాల ద్వారా ఈ పాట పట్టుదల, ఆశ, ప్రతి కల వెనుక ఉన్న నిశ్శబ్ద బలాన్ని అద్భుతంగా ఆవిష్కరించింది. ఆకాశంలో ఒక తార చిత్రంలో దుల్కర్ సల్మాన్, సాత్విక వీరవల్లి, శ్రుతి హాసన్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. పావన్ సాదినేని దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని లైట్‌బాక్స్ మీడియా బ్యానర్‌పై సందీప్ గున్నం, రమ్య గున్నం నిర్మిస్తున్నారు. స్వప్న సినిమా, గీతా ఆర్ట్స్ ఈ చిత్రాన్ని సమర్పిస్తున్నాయి.

# లంక ప్రీమియర్ లీగ్‌లో మ్యాచ్ ఫిక్సింగ్?




**న్యూఢిల్లీ:** లంక ప్రీమియర్ లీగ్-2026 (ఎల్‌పిఎల్) ప్రస్తుత సీజన్ ప్రారంభం నుంచీ వరుస వివాదాలతో వార్తల్లో నిలుస్తోంది. ఫ్రాంచైజీల అవినీతి, షాహీన్ అఫ్రిది ఎంపికపై వివాదం, ఒక ఫ్రాంచైజీ యజమాని అరెస్ట్ వంటి వరుస పరిణామాలతో లీగ్ తీవ్ర విమర్శలు ఎదుర్కొంటోంది. ఇంకా ఈ సీజన్‌లో రెండు వారాల క్రికెట్ మిగిలి ఉండగానే, లీగ్ ప్రతిష్టను మరింత దెబ్బతీసేలా మరో సంచలన సంఘటన చోటుచేసుకుంది. కొలంబో క్యాప్స్, జాఫ్నా కింగ్స్ మధ్య జరిగిన మ్యాచ్‌లో జరిగిన ఓ పరిణామం లీగ్‌పై ఉన్న నమ్మకాన్ని మరింతగా సడలించింది. కొలంబో క్యాప్స్ తరఫున బౌలింగ్ ప్రారంభించిన పాకిస్థాన్ ఫాస్ట్ బౌలర్ షానవాజ్ దహానీ ఈ మ్యాచ్‌లో దారుణమైన ప్రదర్శన ఇచ్చాడు. తన 4 ఓవర్ల స్పెల్‌లో ఏకంగా 6 ఎక్స్‌ట్రాలతో కలిపి 71 పరుగులు సమర్పించుకున్నాడు. వికెట్ ఏమీ తీయలేకపోయాడు. తొలి ఓవర్లో వైడ్‌తో పరుగుల ఖాతా తెరిచి 6 పరుగులు ఇవ్వగా, రెండో ఓవర్లో జాఫ్నా బ్యాటర్లు విరుచుకుపడి రెండు సిక్సర్లు, రెండు ఫోర్లతో 21 పరుగులు పిండుకున్నారు. ఆ తర్వాత ఆఖరి ఓవర్లలో తిరిగొచ్చిన దహానీ వరుసగా వైడ్లు, నోబాల్స్‌తో వైఫల్యం చెందాడు. ఇక చివరి ఓవర్లో తోహిద్ హృదోయ్ వరుసగా మూడు సిక్సర్లు, ఆపై మరో సిక్స్, ఫోర్‌తో ఒకే ఓవర్లో ఏకంగా 31 పరుగులు రాబట్టాడు. ఎల్‌పిఎల్ చరిత్రలోనే అత్యంత ఖరీదైన బౌలింగ్ స్పెల్ నమోదవడంతో ఇప్పుడు అందరి దృష్టి దీనిపైనే కేంద్రీకృతమైంది. ఈ లీగ్‌లో పక్కాగా మ్యాచ్ ఫిక్సింగ్ జరుగుతోందని, లీగ్ పారదర్శకతపై పెద్ద ఎత్తున అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

## 4 ఓవర్లలో 71 పరుగులు

ఈ నెల ప్రారంభంలోనే అక్రమాలకు పాల్పడ్డాడనే ఆరోపణలతో జాఫ్నా కింగ్స్ జట్టు యజమానుల్లో ఒకరైన మన్జోత్ కల్రాను శ్రీలంక పోలీసుల స్పెషల్ ఇన్వెస్టిగేషన్ యూనిట్ అరెస్ట్ చేసిన విషయాన్ని గుర్తు చేస్తున్నారు. క్యాచ్‌లను కావాలనే వదిలేస్తున్నారని, మ్యాచ్‌లో ఎలాంటి తీవ్రత లేకుండా 30 పరుగుల ఓవర్లు మామూలైపోయాయని పోస్టులు పెడుతున్నారు. ఒకప్పుడు అత్యుత్తమ టి20 బౌలర్‌గా పేరొందిన 27 ఏళ్ల దహానీకి ఇది అత్యంత చేదు జ్ఞాపకంగా మిగిలిపోయింది. పిఎస్‌ఎల్ సీజన్‌లో ముల్తాన్ సుల్తాన్స్ తరఫున 20 వికెట్లు, తదుపరి సీజన్లో 17 వికెట్లు తీసి దహానీ వెలుగులోకి వచ్చాడు.






## తైపే ఓపెన్‌లో రెండో రౌండ్‌కు
# ప్రణయ్, ఉన్నతి

**న్యూఢిల్లీ:** భారత జట్టు ప్రచారానికి సారథులుగా ఉన్న అనుభవజ్ఞులైన షట్లర్లు హెచ్.ఎస్. ప్రణయ్, ఉన్నతి హూడా, బుధవారం తైపే ఓపెన్ సూపర్ 300లో తమతమ సింగిల్స్ ఈవెంట్లలో రెండవ రౌండ్‌కు చేరుకున్నారు. ఏడవ సీడ్ అయిన ప్రణయ్, కేవలం 35 నిమిషాల్లో ముగిసిన తన తొలి రౌండ్ పురుషుల సింగిల్స్ మ్యాచ్‌లో జపాన్‌కు చెందిన మినోరు కోగాను 21-11, 21-14 తేడాతో ఓడించాడు. రెండో రౌండ్‌కు చేరుకున్న ఇతర భారత పురుషుల సింగిల్స్ ఆటగాళ్లలో కిరణ్ జార్జ్, తరుణ్ మన్నేపల్లి ఉన్నారు. జార్జ్ చైనీస్ తైపీకి చెందిన వాంగ్ పోవెయ్‌ను 21-10, 21-18 తేడాతో, మన్నేపల్లి కొరియాకు చెందిన ఎనిమిదో సీడ్ జియోన్ హ్యోక్ జిన్‌ను 21-12, 21-15 తేడాతో అనూహ్యంగా ఓడించారు. పురుషుల సింగిల్స్ క్వాలిఫైయర్స్ ద్వారా ముందుకు సాగిన వర్ధమాన ఆటగాడు రౌనక్ చౌహాన్‌కు మాత్రం తెరపడింది. ఇండోనేషియాకు చెందిన రిచీ డూటా రిచర్డో చేతిలో అతను 14-21, 16-21 తేడాతో ఓడిపోయాడు. మూడో సీడ్ ఉన్నతి, చైనీస్ తైపీకి చెందిన పెయ్ యు వాంగ్‌పై 21-12, 21-18 తేడాతో విజయం సాధించి తన మహిళల సింగిల్స్ ప్రచారాన్ని సానుకూలంగా ప్రారంభించింది. ఎనిమిదో సీడ్‌గా ఉన్న యువ దేవికాసిహాగ్, తన్వి శర్మ, అన్మోల్ ఖర్బ్‌కూడా మహిళల సింగిల్స్ తదుపరి రౌండ్‌కు చేరుకున్నారు. దేవిక˘గా యున్ పార్క్‌ను 14-21, 21-7, 21-15 తేడాతో ఓడించగా, తన్వి తస్నీమ్ మీర్‌పై 21-16, 22-20 తేడాతో విజయం సాధించింది.

## ఐసిసి ర్యాంకింగ్స్‌లో..
# టి20 వరల్డ్ నంబర్‌గా కిషన్
## వన్డే ఫార్మట్‌లో అగ్రస్థానంలో శుభమన్ గిల్







**న్యూఢిల్లీ:** ప్రపంచ క్రికెట్‌లో భారత ఆటగాళ్ల హవా నిరంతరంగా కొనసాగుతోంది. ఐసిసి బుధవారం విడుదల చేసిన టి20 ర్యాంకింగ్స్‌లో టీమిండియా కుర్రాళ్లు ఊహించని సంచలనాలు సృష్టించారు. బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో భారత డాషింగ్ వికెట్ కీపర్ బ్యాటర్ ఇషాన్ కిషన్ అగ్ర పీఠాన్ని అధిరోహించి చరిత్ర తిరగరాశాడు. జింబాబ్వేతో జరిగిన రెండో టి20లో 81 పరుగులతో చెలరేగిన కిషన్ తన కెరీర్‌లోనే అత్యధికంగా 916 రేటింగ్ పాయింట్లను తాకాడు. సిరీస్ ముగిసే సమయానికి 910 పాయింట్లతో నంబర్ వన్ స్థానంలో తిరుగులేని ఆధిపత్యం చలాయిస్తున్నాడు. జింబాబ్వే సిరీస్‌లో అద్భుతంగా బౌలింగ్ చేసి మూడు వికెట్లు పడగొట్టిన స్పిన్నర్ రవి బిష్ణోయ్ ఐసిసి టి20 బౌలర్ల జాబితాలో 41వ ర్యాంకుకు చేరుకున్నాడు. బ్యాటర్ల విభాగంలో తిలక్ వర్మ రెండు స్థానాలు మెరుగుపరుచుకుని ఆరో ర్యాంకులో నిలవగా, మిడిలార్డర్ బ్యాటర్ శ్రేయాస్ అయ్యర్ 24వ ర్యాంకును దక్కించుకున్నాడు. జింబాబ్వే ఆటగాళ్లలో ఫాస్ట్ బౌలర్ బ్లెస్సింగ్ ముజరబాని బౌలర్ల జాబితాలో 26వ స్థానంలో నిలిచారు. జింబాబ్వే సిరీస్‌లో వైభవ్ సూర్యవంశీ ప్రదర్శనతో 48వ ర్యాంకుకు చేరుకున్నాడు. వన్డే ఫార్మట్‌లో భారత ఓపెనర్ శుభ్‌మన్ గిల్ తిరిగి నంబర్ వన్ కిరీటాన్ని కైవసం చేసుకున్నాడు. అగ్రస్థానంలో ఉన్న న్యూజిలాండ్ ప్లేయర్ డారిల్ మిచెల్, వెస్టిండీస్ సిరీస్‌కు దూరం కావడంతో ఆ స్థానం గిల్ వశమైంది. అటు టెస్టుల్లో వెస్టిండీస్‌కు చెందిన బౌలర్ జేడెన్ సీల్స్ 24వ ర్యాంకుకు చేరుకోగా, పాకిస్థాన్ మాజీ కెప్టెన్ బాబర్ ఆజం తన 32వ టెస్ట్ హాఫ్ సెంచరీతో బ్యాటర్ల ర్యాంకింగ్స్‌లో 15వ స్థానానికి చేరుకున్నాడు.






## వరల్డ్ స్క్వాష్ ఛాంపియన్‌షిప్..
# క్వార్టర్ ఫైనల్స్‌కు భారత్ పురుష, మహిళా జట్లు


**న్యూఢిల్లీ:** ప్రపంచ జూనియర్ స్క్వాష్ టీమ్ ఛాంపియన్‌షిప్‌ల నాకౌట్ దశల్లో విభిన్నమైన విజయాలు సాధించిన భారత పురుషుల, మహిళల జట్లు క్వార్టర్ ఫైనల్స్‌కు చేరుకున్నాయి. ఐదవ సీడ్ భారత పురుషుల జట్టు, ఆరంభంలో ఎదురైన ఎదురుదెబ్బ నుండి కోలుకుని ప్రీక్వార్టర్ ఫైనల్స్‌లో 11వ సీడ్ కువైట్‌ను 2-1 తేడాతో ఓడించింది. మరోవైపు, మహిళల జట్టు గ్రూప్ దశలో తమ అజేయ పరంపరను కొనసాగిస్తూ, దక్షిణాఫ్రికాపై 3-0 తేడాతో ఘన విజయం సాధించింది. అబ్దుల్లా అలీ చేతిలో యుషా నఫీస్ వరుస గేమ్‌లలో తొలి షాట్‌ను కోల్పోవడంతో భారత పురుషుల జట్టుకు ఆరంభం కష్టంగా మారింది. అయితే, ఖలీద్ వలీద్ అల్ ఫౌజెన్‌పై 11-5, 11-6, 11-5 తేడాతో ఆధిపత్య విజయం సాధించి ఆర్యవీర్ దీవాన్ టైని సమం చేశాడు. ఆ తర్వాత గుర్వీర్ సింగ్ అద్భుతమైన ప్రదర్శనతో అబ్దుల్ రహ్మాన్ అల్ సానియాను 11-3, 11-3, 11-4 తేడాతో ఓడించి జట్టు స్థానాన్ని ఖాయం చేశాడు. మరోవైపు, భారత మహిళల జట్టు దక్షిణాఫ్రికాపై ఏకపక్ష ప్రదర్శన కనబరిచింది. రుద్ర సింగ్, మకైలా నాయుడుపై 11-4, 11-5, 11-3 తేడాతో విజయం సాధించి మ్యాచ్‌ను ప్రారంభించగా, ఆ తర్వాత అనాహత్ సింగ్, బ్రియానా రాబిన్సన్‌ను 11-1, 11-1, 11-3 తేడాతో ఓడించింది. సాన్వి కలంకి, వివియెన్ వాన్ డెర్ షిఫ్‌ను 11-4, 11-3, 11-3 తేడాతో ఓడించి క్లీన్ స్వీప్ పూర్తి చేసింది..

## కామన్వెల్త్ గేమ్స్..
# గుల్వీర్‌కు రజత పతకం




**న్యూఢిల్లీ:** కామన్వెల్త్ గేమ్స్‌లో పురుషుల 10,000 మీటర్ల పరుగు పందెంలో పతకం గెలిచిన భారతదేశపు మొట్టమొదటి అథ్లెట్‌గా గుల్వీర్ సింగ్ నిలిచాడు. ఆస్ట్రేలియాకు చెందిన కై రాబిన్సన్ (27:48.93) వెనుక, మరియు 27:50.28 సమయంతో కాంస్యం గెలుచుకున్న ఐల్ ఆఫ్ మ్యాన్‌కు చెందిన డేవిడ్ ముల్లార్కీ కంటే కొద్దిగా ముందుగా, గుల్వీర్ 27:49.78 సమయంతో ముగింపు రేఖను చేరుకున్నాడు. ఆందోళన, ఆపై ఉద్వేగభరితంగా అతను రెండవ స్థానంలో ప్రారంభించి, సగం దూరం పూర్తయ్యే వరకు మొదటి మూడు స్థానాల్లో కొనసాగి, ఆ తర్వాత ఆరవ స్థానానికి పడిపోయాడు. 5,600 మీటర్ల తర్వాత వేగం పుంజుకోవడంతో అతను తొమ్మిదో స్థానానికి చేరుకున్నాడు. ఆపై చివరి 1,200 మీటర్లలో వేగం పుంజుకుని, ల్యాప్‌లోకి ప్రవేశించే ముందు మూడో స్థానానికి చేరుకున్నాడు, అనంతరం అద్భుతమైన వేగంతో దూసుకెళ్లి రెండో స్థానంలో నిలిచాడు. అతను 3,000 మీటర్ల దూరాన్ని 8:39.2 సమయంలో పూర్తి చేసి, 6,000 మీటర్ల వరకు ఐదవ స్థానానికి పడిపోయినప్పటికీ పోటీలో నిలిచి, చివరి ల్యాప్‌కు ముందు తిరిగి తన స్థానానికి చేరుకున్నాడు.

# కేంద్రానికి ఎల్‌ఐసి రూ.12,207 కోట్ల డివిడెండ్




**న్యూఢిల్లీ,జులై 29:** కేంద్ర ప్రభుత్వానికి ప్రభుత్వ రంగ సంస్థల నుంచి భారీగా డివిడెండ్లు అందుతున్నాయి. 2025-26 ఆర్థిక సంవత్సరానికి దేశంలోనే అతిపెద్ద బీమా సంస్థ ఎల్‌ఐసి రూ.12,207 కోట్ల డివిడెండ్‌ను కేంద్రానికి అందించింది. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు ఎల్‌ఐసి ఎండీ, సిఇఒ ఆర్. దొరైస్వామి రూ.12,207 కోట్ల డివిడెండ్ చెక్కును బుధవారం అందజేశారు. ఈ విషయాన్ని ఆర్థిక మంత్రి ఎక్స్ వేదికగా వెల్లడించారు. ఎల్‌ఐసి ఎండి రత్నాయక్ పట్నాయక్, ఎండి ఆర్ చందర్, జోనల్‌మేనేజర్ ఎస్‌ఎస్ రాఘవ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎండీ, సిఇఒ అశీష్ పాండే రూ.2,853 కోట్ల డివిడెండ్ చెక్కును అందించారు. న్యూ ఇండియా అష్యూరెన్స్ సిఎండీ గిరిజా సుబ్రహ్మణియన్ రూ.211 కోట్ల డివిడెండ్‌ను అందజేశారు. 2025-26లో ప్రభుత్వ రంగ బ్యాంకుల స్థూల నిరర్థక ఆస్తుల (జిఎన్‌పిఎ) నిష్పత్తి 1.9 శాతానికి తగ్గిపోయింది. ఇది ఇప్పటివరకు నమోదైన కనిష్ఠ స్థాయి. మరోవైపు ఈ బ్యాంకుల ఉమ్మడి నికర లాభం రూ.1.98 లక్షల కోట్లకు చేరింది. వరుసగా నాలుగో ఏడాది లాభాలను నమోదు చేయడం విశేషం. సంస్కరణలు, మెరుగైన పాలన, బలమైన మూలధన స్థితి ఈ ఫలితాలకు ప్రధాన కారణాలుగా ప్రభుత్వం పేర్కొంది. ఆర్థిక మంత్రిత్వ శాఖ వివరాల ప్రకారం 2025-26లో ప్రభుత్వ రంగ బ్యాంకుల నికర లాభం ఏడాది ప్రాతిపదికన 11.1 శాతం పెరిగింది. రుణాల వృద్ధి, వడ్డీ ఆదాయం పెరగడం, ఆస్తుల నాణ్యత మెరుగుపడటం లాభాలకు బలాన్నిచ్చాయి. 2026 మార్చి 31 నాటికి ఈ బ్యాంకుల మొత్తం వ్యాపారం రూ.283.3 లక్షల కోట్లకు చేరింది. గత ఏడాదితో పోలిస్తే ఇది 12.8 శాతం వృద్ధిని నమోదు చేసింది. మార్చి 31 నాటికి ప్రభుత్వ రంగ బ్యాంకుల నికర నిరర్థక ఆస్తుల (ఎన్‌పిఎ) నిష్పత్తి 0.39 శాతానికి తగ్గింది.


# ఆర్‌బిఐ రూ.12,604 కోట్ల ప్రభుత్వ బాండ్ల బైబాక్




**ముంబయి,జులై 29:** భారతీయ రిజర్వ్ బ్యాంక్ నిర్వహించిన ప్రభుత్వ సెక్యూరిటీల బైబ్యాక్ వేలంలో మార్కెట్ పాల్గొనేవారి నుంచి మొత్తం రూ.16,959.07 కోట్ల విలువైన బిడ్లు అందితే వాటిలో రూ.12,604.07 కోట్ల విలువైన బిడ్లను ఆమోదించింది. ఈ బైబ్యాక్‌లో అత్యధికంగా 7.33 శాతం జీఎస్2026 సెక్యూరిటీలను ఆర్‌బిఐ తిరిగి కొనుగోలు చేసింది. ఈ విభాగంలో రూ.9,160.69 కోట్ల విలువైన ఆఫర్లు రాగా, వాటిలో రూ.8,960.69 కోట్ల విలువైన సెక్యూరిటీలను స్వీకరించింది. అదనంగా 8.15 శాతం జిఎస్ 2026 సెక్యూరిటీలలో రూ.2,400.387 కోట్లు, 5.74 శాతం జిఎస్2026లో రూ.893 కోట్లు, 8.24 శాతం జిఎస్2027లో రూ.350 కోట్ల విలువైన బాండ్లను కూడా ఆర్‌బిఐ తిరిగి కొనుగోలు చేసింది.ఈ బైబ్యాక్‌కు సంబంధించి కట్‌ఆఫ్ ధరలను 7.33 శాతం జిఎస్2026కు రూ.100.48, 5.74 శాతం, జీఎస్2026కు రూ.100.10, 8.15 శాతం జీఎస్2026కు రూ.100.86, 8.24 శాతం, జీఎస్2027కు రూ.101.40గా నిర్ణయించింది. వెయిటెడ్ యావరేజ్ ధరలు వరుసగా రూ.100.47, రూ.100.10, రూ.100.86, రూ.101.39గా నమోదయ్యాయి.




## ఐటి, మెటల్, ఎఫ్ఎంసిజిల మద్దతు
# లాభాల్లో ముగిసిన సెన్సెక్స్, నిఫ్టీ



**ముంబయి,జులై 29:** దేశీయ ఈక్విటీ మార్కెట్లు బుధవారం భారీ లాభాలతో ముగిశాయి. ఐటీ, మెటల్, ఎఫ్ఎంసీజీ షేర్లలో బలమైన కొనుగోళ్లు కొనసాగడంతో పాటు విస్తృత మార్కెట్లలో కూడా కొనుగోళ్ల జోరు కనిపించింది. విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు వరుసగా నాలుగు రోజుల విక్రయాల తర్వాత మళ్లీ కొనుగోలుదారులుగా మారడం, మార్కెట్ అస్థిరత తగ్గడం, అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లను యథాతథంగా ఉంచుతుందన్న ఆశావహ అంచనాలు మార్కెట్‌కు ఊతమిచ్చాయి. బిఎస్ఇ సెన్సెక్స్ 888.68 పాయింటు ఎగిసి 77,654.60 వద్ద ముగిసింది. నిఫ్టీ50 సూచీ 264.85 పాయింటు లాభపడి 24,250.20 వద్ద స్థిరపడింది.నిఫ్టీ ర్యాలీకి ప్రధానంగా ఇన్ఫోసిస్ 4.32, భారతి ఎయిర్‌టెల్ 2.32, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్1.75 షేర్లు మద్దతునిచ్చాయి. బిఎస్ఇ మిడ్‌క్యాప్150 సూచీ 0.78 శాతం, బిఎస్ఇ స్మాల్‌క్యాప్250 సూచీ 1.47 శాతం చొప్పున పెరిగాయి. బిఎస్ఇలో మొత్తం 2,533 షేర్లు లాభపడగా, 1,705 షేర్లు నష్టాల్లో ముగిశాయి. 201 షేర్లు ఎలాంటి మార్పు లేకుండా ట్రేడయ్యాయి. అంతర్జాతీయ మార్కెట్లో సెప్టెంబర్ 2026 డెలివరీకి సంబంధించిన బ్రెంట్ ముడిచమురు ధర బ్యారెల్‌కు 3.82 డాలర్లు పెరిగి 87.91 డాలర్లకు చేరింది.రూపాయి మారకం విలువ డాలర్‌తో పోలిస్తే 95.6600 వద్ద ట్రేడవగా, గత ముగింపు 95.8200గా నమోదైంది. ఎంసీఎక్స్‌లో ఆగస్టు 5, 2026 డెలివరీకి సంబంధించిన బంగారం ఫ్యూచర్స్ ధర స్వల్పంగా 0.01 శాతం పెరిగి రూ.1,41,639 వద్ద ట్రేడైంది. నిఫ్టీ ఐటీ సూచీ 2.32 శాతం ఎగిసింది. ఇందులో ఇన్ఫోసిస్ 4.32 శాతం లాభపడగా, ఎల్‌టిఐ మైండ్‌ట్రీ 2.34, టిసిఎస్ 1.75, హెచ్‌సిఎల్ టెక్నాలజీస్ 1.70, కోఫోర్జ్1.25, విప్రో 1.20, పర్సిస్టెంట్ సిస్టమ్స్0.62, ఒరాకిల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ సాఫ్ట్‌వేర్ 0.56 , టెక్ మహీంద్రా 0.42 లాభాలతో ముగిశాయి.

## కనీస నిల్వల ఛార్జీలతో
# బ్యాంకులు దూకుడు




**నూఢిల్లీ,జులై 29:** దేశంలోని బ్యాంకులు తమ ఖాతాదారులకు భారీ షాక్ ఇచ్చాయి. అకౌంట్లలో కనీస సగటు బ్యాలెన్స్ నిర్వహించనందుకు గత నాలుగు ఆర్థిక సంవత్సరాల్లో ఏకంగా రూ.26,170 కోట్లకు పైగా జరిమానాల రూపంలో వసూలు చేశాయి. ఈ వివరాలను కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో వెల్లడించింది. రాజ్యసభలో కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి ఒక లిఖితపూర్వక సమాధానంలో ఈ గణాంకాలను అందించారు. 2022-23 నుంచి 202526 ఆర్థిక సంవత్సరం మధ్య కాలంలో ఈ భారీ మొత్తాన్ని బ్యాంకులు ఆర్జించాయి. ఈ వసూళ్లలో ప్రభుత్వ రంగ బ్యాంకులతో పోలిస్తే ప్రైవేట్ రంగ బ్యాంకుల వాటానే అధికంగా ఉండటం గమనార్హం. కేవలం గత ఆర్థిక సంవత్సరంలోనే బ్యాంకులు రూ.7,086.63 కోట్లను మినిమమ్ బ్యాలెన్స్ ఛార్జీల కింద వసూలు చేశాయి. ఇందులో ప్రభుత్వ రంగ బ్యాంకులు రూ.2,137.92 కోట్లు వసూలు చేయగా, ప్రైవేట్ బ్యాంకులు ఏకంగా రూ.4,948.71 కోట్లు ఆర్జించాయి. ఇది ప్రభుత్వ బ్యాంకుల వసూళ్ల కన్నా రెండింతలకు పైగా ఉండటం గమనార్హం. ప్రైవేట్ బ్యాంకుల్లో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ అత్యధికంగా రూ.1,798.14 కోట్లతో మొదటి స్థానంలో నిలిచింది. ఆ తర్వాత యాక్సిస్ బ్యాంక్ రూ.1,081.33 కోట్లు వసూలు చేసింది. ఈ రెండు బ్యాంకుల వాటానే ప్రైవేట్ బ్యాంకుల మొత్తం వసూళ్లలో దాదాపు 58 శాతంగా ఉంది. ఐసిఐసిఐ బ్యాంక్ (రూ.353.50 కోట్లు), కోటక్ మహీంద్రా బ్యాంక్ రూ.290.65 కోట్లు, యెస్ బ్యాంక్ రూ.195.05 కోట్లు వంటివి కూడా గణనీయంగా జరిమానాలు విధించాయి. ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రూ.477.27 కోట్లతో అగ్రస్థానంలో ఉంది. ఈ మొత్తం కేవలం కరెంట్ అకౌంట్లకు సంబంధించినదేనని, 2020 మార్చి నుంచే సేవింగ్స్ ఖాతాలపై మినిమమ్ బ్యాలెన్స్ జరిమానాలను ఎస్బీఐ రద్దు చేసిందని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఎస్బీఐ తర్వాత బ్యాంక్ ఆఫ్ బరోడా రూ.394.10 కోట్లు, ఇండియన్ బ్యాంక్ రూ.299.17 కోట్లు ఉన్నాయి. ఇటీవలి కాలంలో చాలా ప్రభుత్వ రంగ బ్యాంకులు ఈ ఛార్జీలను తగ్గించాయని ప్రభుత్వం తెలిపింది. మొత్తం 12 ప్రభుత్వ బ్యాంకుల్లో 10 బ్యాంకులు సేవింగ్స్ ఖాతాలపై ఈ పెనాల్టీలను పూర్తిగా రద్దు చేశాయని పేర్కొంది.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.